


# చైతన్యరథం



సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు





## రియల్‌టైమ్ ఛేదన

పోలీసులకు ఆర్టీజీఎస్ సాంకేతిక తోడ్పాటు

కీలక సహకారం అందిస్తున్న సీసీటీవీ 360

- వివరాలు 5 లో..

# సింహపురిలో పసుపు పండుగ!

### 27,28,29 తేదీల్లో మహానాడు - రంగంలోకి దిగిన నాయకులు

### స్థల పరిశీలనలో మంత్రి నారాయణ

తెలుగుదేశం పార్టీ పెద్ద పండగ మహానాడుకు తొలిసారి సింహపురి గడ్డ ఆతిథ్యం ఇవ్వనుంది. దీనిపై అధికారిక ప్రకటన అధిష్టానం నుంచి ఇంకా రాకున్నా..మహానాడు వేదిక పరిశీలనలో పురపాలక మంత్రి పొంగూరు నారాయణ బిజీగా ఉండటంతో నెల్లూరు జిల్లానే ఎక్కువగా ఖరారయ్యేందుకు అవకాశం ఉన్నట్లు తెలుస్తుంది. తొలుత మహానాడును శ్రీకాకుళం జిల్లాలో నిర్వహించేందుకు నిర్ణయం తీసుకున్నట్లు వార్తలు వచ్చాయి. అయితే జూన్‌లో ప్రధాని మోదీ శ్రీకాకుళం పర్యటన ఉండటం, భోగాపురం పోర్ట్ ప్రారంభానికి వస్తారన్న సమాచారంతో వేదికను నెల్లూరుకు మార్చినట్లు తెలుస్తుంది. అందుకే మంత్రి నారాయణ నెల్లూరు నగరంతో పాటు కోవూరులోని పలు ప్రాంతాలను పరిశీలించారు. కోవూరులో 2, నెల్లూరు రూరల్ ప్రాంతంలో 2 ప్రదేశా లను సందర్శించారు. మరో 2 రోజుల్లో వేదికపై పూర్తి క్లారిటీ వస్తుందని చెబుతున్నారు.



## పవన్‌కు సీఎం చంద్రబాబు పరామర్శ

ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో శనివారం పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని గురించి అడిగి తెలుసుకున్నారు.

2

## సింగపూర్‌కు ఉపాధ్యాయుల బృందం

- విద్యా వ్యవస్థపై అధ్యయనం కోసం
- కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం
- విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ హర్షం

4





ఏపీలోని ఉత్తమ ఉపాధ్యాయులను అంతర్జాతీయ స్థాయి విద్యా వ్యవస్థలను అధ్యయనం చేయించాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా ఏపీ ఉపాధ్యాయుల బృందం ఈ నెల 4 నుంచి 9 వరకు 37 మంది సింగపూర్‌లో పర్యటించనుంది. ఇప్పటికే ఈ బృందం విజయ వాడ నుంచి హైదరాబాద్‌కు బయలుదేరింది. నేషనల్ ఇనిస్టి ట్యూట్ ఆఫ్ సింగపూర్ ఐదురోజుల ప్రత్యేక శిక్షణ కార్యక్రమం లో పాల్గొంటారు. ఉత్తమ ప్రభుత్వ ఉపాధ్యాయులు 37 మంది సింగపూర్ పర్యటనకు వెళ్లడంపై విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ హర్షం వ్యక్తం చేశారు. ఆధునిక బోధన పద్ధతులు, పాఠ్య ప్రణాళిక రూపకల్పన, ప్రపంచ స్థాయి ఉత్తమ విధానా లను నేర్చుకుని వాటిని తిరిగి మన ప్రభుత్వ పాఠశాలల తరగతుల్లో అమలు చేయడమే ఈ కార్యక్రమం లక్ష్యమని తెలిపారు.

## నాయుడు భౌతికకాయానికి సీఎం చంద్రబాబు, లోకేష్ నివాళులు



పారిశ్రామికవేత్త జీవన్ నాయుడు భౌతికకాయాన్ని శనివారం హైదరాబాద్‌లోని నివాసంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్ సందర్శించి నివాళు లర్పించారు. ఆయన కుటుంబసభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఆయనతో ఉన్న పరిచయాన్ని చంద్రబాబు గుర్తు చేసుకున్నారు.

2





## జీరో బిల్లులతో... మగ్గం మురిసింది

- గత నెల 1 నుంచి ఉచిత విద్యుత్ అమలు
- చేనేతల కుటుంబాల్లో హర్షాతిరేకాలు
- చంద్రబాబు,లోకేష్‌కు ధన్యవాదాలు

6





## లోకేష్ పనితీరు భేష్

### వెంకయ్యనాయుడు ప్రశంసల వర్షం

విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ పనితీరుపై మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు కితాబిచ్చారు. ఈ ఏడాది పదో తరగతిలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు మంచి ఫలితాలు తీసు కువచ్చారని ప్రశంసించారు. మంచి పనులు చేసే వారిని ప్రతిఒక్కరూ ప్రోత్సాహించాలని సూచించారు.

3



## పవన్‌కళ్యాణ్‌కు సీఎం చంద్రబాబు పరామర్శ

హైదరాబాద్(చైతన్యరథం): ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో శనివారం పరామర్శించారు. ఇటీవల పవన్‌కళ్యాణ్ అస్వస్థతకు గురయ్యారు. ప్రైవేటు ఆసుపత్రిలో సర్జరీ జరగడంతో విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పరా మర్శించారు. ఆరోగ్య పరిస్థితిని గురించి అడిగి తెలుసుకున్నారు. తగిన విశ్రాంతి తీసుకోవాలని సూచించారు.





### పేదల డాక్టర్ కోడెల శివప్రసాద్ సీఎం చంద్రబాబు, లోకేష్ నివాళి

అమరావతి(చైతన్యరథం): టీడీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి స్వర్గీయ కోడెల శివప్రసాదరావు జయంతి సందర్భంగా ముఖ్యమం త్రి చంద్రబాబు ఒక ప్రకటనలో నివాళులర్పించారు. పేదలకు రూపాయి వైద్యుడిగా సేవలందించి సంఘవిద్రోహ శక్తులకు, ఫ్యాక్షనిస్టులకు ధైర్యంగా ఎదురొడ్డి నిలిచిన పల్నాటి పులి అని గుర్తుచేశారు. పల్నాడు అభివృద్ధికి కృషి చేసిన దూరదృష్టి గల నాయకుడిగా తెలుగుదేశం పార్టీలో ఆయన సేవలు చిరస్మరణీ యమని కొనియాడారు. మంత్రి నారా లోకేష్ ఒక ప్రకటనలో నివాళులర్పించారు. ఆయనను గుర్తుచేసుకుంటూ రూపాయి డాక్టర్‌గా ఆయన ప్రజల హృదయాల్లో చోటు సంపాదించారని పేర్కొన్నారు. పల్నాడు అభివృద్ధికి విశేషంగా కృషిచేశారు. నవ్యాం ధ్ర తొలి స్పీకర్‌గా కీలక బాధ్యతలు నిర్వర్తించారు. పల్నాటి పులి కోడెల శివప్రసాదరావు జయంతి సందర్భంగా పార్టీకి, రాష్ట్ర అభివృద్ధికి వారు అందించిన సేవలను స్మరించుకున్నారు.



### సీపీఐ నేత రామకృష్ణ మాతృమూర్తి మృతి సీఎం చంద్రబాబు సంతాపం

అమరావతి(చైతన్యరథం): సీపీఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ మాతృమూర్తి గౌరమ్మ మృతిపట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు ఒక ప్రకటనలో సంతాపం వ్యక్తం చేశారు. గౌరమ్మ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. రామకృష్ణ, వారి కుటుంబసభ్యులకు సీఎం చంద్రబాబు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

#### గౌరమ్మ మృతికి లోకేష్ సంతాపం

సీపీఐ జాతీయ కార్యదర్శి రామకృష్ణ మాతృమూర్తి గౌరమ్మ మృతి పట్ల మంత్రి లోకేష్ ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. ఆమె మృతికి నివాళులర్పిస్తూ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# జీఎన్ నాయుడు భౌతికకాయానికి సీఎం చంద్రబాబు, లోకేష్ నివాళులు





హైదరాబాద్(చైతన్యరథం): పారిశ్రామికవేత్త, రీజెన్సీ గ్రూప్ అధినేత జీఎన్ నాయుడు భౌతికకాయాన్ని శనివారం హైదరాబాద్ లో వారి నివాసంలో సందర్శించి ముఖ్యమంత్రి చంద్రబాబు నివా ళులర్పించారు. తెలుగు ప్రజలు మంచి పారిశ్రామికవేత్తను కోల్పో యారు. రీజెన్సీ స్థాపనతో యువతకు ఉపాధి కల్పనలో జీఎన్ నాయుడు కృషి ఎనలేనిది. సమాజ సేవకు జీఎన్ నాయుడు తన వంతు కృషిచేశారని గుర్తుచేశారు. ఆయన కుటుంబసభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ సందర్భంగా జీఎన్ నాయుడుతో తనకు ఉన్న పరిచయాన్ని గుర్తు చేసుకున్నారు.



### నాయుడు కుటుంబానికి లోకేష్ పరామర్శ

అనారోగ్యంతో కన్నుమూసిన ప్రముఖ పారిశ్రామికవేత్త, యానాం రీజెన్సీ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ అధినేత జీఎన్ నాయుడుకి మంత్రి నారా లోకేష్ నివాళులర్పించారు. శనివారం ఉదయం హైదరాబాద్‌లోని నాయుడు నివాసానికి వెళ్లి భౌతికకాయం వద్ద పుష్పాంజలి ఘటించారు. అనంతరం వారి కుటుంబసభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు.



# వేసవిలో విద్యుత్ కోతలు ఉండరాదు

- సమస్య తలెత్తితే వేగంగా పరిష్కరించాలి
- మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదేశం



అమరావతి(చైతన్యరథం): వేసవిలో ఎంత డిమాండ్ ఉన్నా విద్యుత్ కోతలు ఉండటానికి వీల్లేదని మంత్రి గొట్టిపాటి రవికు మార్ అధికారులకు స్పష్టం చేశారు. అకాల వర్షాలు, అధిక వేడి వల్ల తాత్కాలిక కరెంట్ సమస్యలు తలెత్తినా వెంటనే పునరుద్ధ రించాలని ఆదేశించారు. శనివారం తాడేపల్లి క్యాంపు కార్యా లయంలో సీఎండీలతో టెలికాన్ఫరెన్స్ ద్వారా మంత్రి సమీక్ష నిర్వహించారు. అకాల వర్షాలు, అధిక ఉష్ణోగ్రతల కారణంగా తాత్కాలికంగా విద్యుత్ సరఫరాలో సమస్యలు తలెత్తే అవకాశము న్నప్పటికీ ఎలాంటి పరిస్థితుల్లో వెంటనే పునరుద్ధరణ చర్యలు చేప ట్టాలని ఆదేశించారు. అధికారికంగా, అనధికారికంగా రాష్ట్రంలో ఎక్కడా విద్యుత్ కోతలు ఉండటానికి వీల్లేదని ఆయన స్పష్టం చేశారు. సాంకేతిక కారణాల వల్ల విద్యుత్ సరఫరా నిలిపివేయా ల్సిన పరిస్థితులు వచ్చినప్పుడు ప్రజలకు ముందస్తుగా సమాచారం అందించడంతో పాటు, సమస్యను అత్యంత వేగంగా పరిష్కరించా ల్సిన బాధ్యత అధికారులదని పేర్కొన్నారు. వేసవి డిమాండ్‌కు సరిపడా విద్యుత్ అందుబాటులో ఉన్నప్పటికీ కొన్ని ప్రాంతాల నుంచి ఫిర్యాదులు రావడంపై మంత్రి ఆరా తీశారు. దీనిపై అధికా రులు స్పందిస్తూ, అధిక వేడి కారణంగా పలుచోట్ల ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతినడం, అలాగే అకాలవర్షాల వల్ల విద్యుత్ సరఫరాలో అంత రాయాలు ఏర్పడుతున్నాయని వివరించారు. ప్రజలు ఎలాంటి ఇబ్బందులు పడకుండా సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు సిబ్బంది ఎప్పుడూ అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.

# ప్రజలపై గొడ్డలి పార్టీ అప్పు మోపింది




- దానిని భూస్థాపితం చేస్తేనే శని విరగడ
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
- జలవనరుల మంత్రి నిమ్మల రామానాయుడు

పాలకొల్లు(చైతన్యరథం): నియోజక వర్గంలో రూ.7.60కోట్లతో పలు అభివృద్ధి పనులకు శనివారం మంత్రి నిమ్మల రామానాయుడు శంకుస్థాపన చేశారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో రాష్ట్రం ఆర్థికంగా దివాలా తీసి 14లక్షల కోట్లు అప్పు భారం మోపింది.వైసీపీ పాలనలో ప్రతి మనిషి నెత్తి మీద రూ.2.40లక్షల అప్పు మోపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సీఎం చంద్రబాబు రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితి చక్కబెడుతూ సూపర్ సిక్స్ హామీలను నెరవేరుస్తున్నారు. గొడ్డలి పార్టీగా రూపాంతరం చెందిన వైసీపీపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పిలుపు నిచ్చారు.అధికారంలోకి వస్తే అభివృద్ధి, సంక్షేమం అమలు చేస్తా మని చెప్పాలే గాని..రప్పా రప్పా అంటూ పొట్టేలును నరికినట్టు తలలు నరుకుతామని గొడ్డలి పార్టీ బెదిరిస్తుంది. జగన్ పుట్టిన రోజుకు పొట్టేలు తల నరికి రక్తాన్ని ఫ్లెక్సీపై చిమ్మటం గొడ్డలి పార్టీ నైజం ఎటువంటిదో ప్రజలు గ్రహించాలని సూచించారు. గొడ్డలి పార్టీని భూస్థాపితం చేస్తేనే రాష్ట్రం శాంతంగా ఉంటుందని పేర్కొన్నారు.

# మంత్రి లోకేష్ పనితీరు భేష్

## వెంకయ్యనాయుడు ప్రశంసల వర్షం
## విశ్వంభరుడు పుస్తకావిష్కరణ



నెల్లూరు(చైతన్యరథం): విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ పని తీరుపై మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు కితాబిచ్చారు. ఈ ఏడాది పదోతరగతిలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు మంచి ఫలి తాలు తీసుకువచ్చారని ప్రశంసించారు. మంచి పనులు చేసే వారిని ప్రతిఒక్కరూ ప్రోత్సాహించాలని సూచించారు. శని వారం నెల్లూరు జిల్లా వెంకటాచలం మండలం గొలగమూడిలో ఆయన పర్యటించారు. శ్రీ భగవాన్ వెంకయ్య స్వామి జీవిత చరిత్ర, విశ్వం భరుడు పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్య క్రమంలో సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, నెల్లూరు ఆర్టీసీ రీజనల్ ఛైర్మన్ సురేశ్‌రెడ్డి, దీపావెంకట్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెంకయ్య నాయుడు మాట్లాడుతూ ఆధ్యాత్మికత మానసిక ఉల్లాసాన్ని, ఆనందాన్ని కలిగిస్తోందని వ్యాఖ్యానించారు. తల్లిదండ్రులు పిల్లలకు సమయాన్ని కేటాయించట్లేదని.. మొబైల్, టీవీలకు మాత్ర మే సమయాన్ని కేటాయించడం సరికాదని పేర్కొన్నారు. తిరుమల వేంకటేశ్వరస్వామిని ఏడాదిలో ఒక్కసారి మాత్రమే దర్శించుకోవాలని తాను నిర్ణయం తీసుకున్నానని చెప్పుకొచ్చారు. రోజూ పత్రికల్లో వచ్చే వార్తలను చూస్తోంటే సిగ్గేస్తోందని పేర్కొన్నారు.

# కొబ్బరి ఉత్పత్తులతో అదనపు ఆదాయం

- రైతులకు మేలు చేసేలా ప్రణాళికలు
- ఎంఎస్ఎంఈ మంత్రి కొండపల్లి శ్రీనివాస్
- ఎకో కాయిర్ క్లస్టర్ ప్లాంట్ సందర్శన
- క్లస్టర్ పనితీరుపై క్షుణ్ణంగా అధ్యయనం



అమరావతి(చైతన్యరథం): ప్రపంచవ్యాప్తంగా ఉన్న అవకాశాల ను అందిపుచ్చుకుంటూ రాష్ట్రంలో కొబ్బరి రైతులకు, రైతు ఉత్ప త్తులకు అదనపు ఆదాయం చేకూర్చేలా భవిష్యత్తులో ప్రణాళిక లు రూపొందిస్తున్నామని సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల మం త్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. కొబ్బరి సాగు ఎక్కువగా ఉన్న మన రాష్ట్రంలో అంబేద్కర్ కోనసీమ జిల్లాలో కొబ్బరి ఆధారిత ఉత్పత్తులను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. తమిళనాడు పొల్లాచ్చిలో 'ఎకో కాయిర్ క్లస్టర్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్' ప్లాంట్‌ను శనివారం మంత్రి సంద ర్శించారు. కేంద్ర ప్రభుత్వ ఎంఎస్ఎంఈ శాఖకు చెందిన 'స్ఫూర్తి' పథకం కింద ఏర్పాటు చేసిన ఈ క్లస్టర్ పనితీరును క్షుణ్ణంగా అధ్యయనం చేశారు. తమిళనాడు పర్యటనలో భాగంగా పొల్లాచ్చి ప్లాంట్‌లోని సుమారు 35 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉన్న అత్యాధునిక 'కామన్ ఫెసిలిటీ సెంటర్'ను మంత్రి సందర్శించి అక్కడ కొబ్బరి అనుబంధ పదార్థాలతో రూపొందుతున్న విలువ ఆధారిత ఉత్పత్తుల గురించి ప్రత్యేకంగా తెలుసుకున్నారు. ముఖ్యం గా అంతర్జాతీయ స్థాయిలో డిమాండ్ ఉన్న పీవీసీ టఫ్టెడ్ కాయిర్ మ్యాట్స్, జియో-టెక్స్టైల్స్, కోకోపీట్ బ్లాక్స్, మల్చ్ మ్యాట్స్ తయా రీ విధానాన్ని పరిశీలించారు.

### పొల్లాచ్చి 'కాయిర్ క్లస్టర్' రోల్‌మోడల్

కొబ్బరి నార పరిశ్రమలో విప్లవాత్మక మార్పులకు పొల్లాచ్చి 'కాయిర్ క్లస్టర్' ఒక రోల్ మోడల్‌గా నిలుస్తుందని మంత్రి అభిప్రాయపడ్డారు.. "కొబ్బరి సాగు ఎక్కువగా ఉన్న మన రాష్ట్రం లో అంబేద్కర్ కోనసీమ జిల్లాలో నార పరిశ్రమను మరింత బలోపేతం చేయాల్సిన అవసరాన్ని ఆయన నొక్కి వక్కాణించారు. పొల్లాచ్చి క్లస్టర్‌లో పాటిస్తున్న అత్యాధునిక సాంకేతికత విధానాలు, సూచనలు మన రాష్ట్రంలో కూడా అన్వయించి చూడాలన్నారు. వ్యర్థంగా పారేసే కొబ్బరి పీచు నుంచి అద్భుతమైన ఉత్పత్తులను తయారు చేస్తూ స్థానిక రైతులు, మహిళలకు పెద్దఎత్తున ఉపాధి కల్పించడం అభినందనీయమని ప్రశంసించారు. పొల్లాచ్చి క్లస్టర్ స్ఫూర్తితో ఆంధ్రప్రదేశ్‌లో కూడా భవిష్యత్తులో ఇటువంటి ప్లాంట్ల ను ఏర్పాటు చేసి మన కొబ్బరి రైతులకు అదనపు ఆదాయం కల్పించేలా ప్రణాళికలు రూపొందిస్తామని వెల్లడించారు. పర్యావ రణ హితమైన ఈ ఉత్పత్తులకు ప్రోత్సహించేలా యూనిట్లను ప్రోత్సహిస్తామని స్పష్టం చేశారు. మంత్రి వెంట కోయంబత్తూరు జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ షణ్ముగ శివ, సీఈవో మిస్టర్ కన్నన్, స్థానిక రైతులు ఉన్నారు.

# మహిళల ఆర్థిక స్వావలంబనకు డ్వాక్రా

- ప్రభుత్వ కార్యక్రమాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి
- గ్రామీణాభివృద్ధికి డిజిటల్ దిశలో కీలక అడుగు
- వ్యవసాయ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు
- 180 మంది వీవోఏలకు 5జీ ఫోన్లు పంపిణీ



నిమ్మాడ(చైతన్యరథం): మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించి సొంత కాళ్లపై నిలబడాలనే లక్ష్యంతో డ్వాక్రా సంఘాల ను స్థాపించారని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నా యుడు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆధ్వర్యంలో ఏర్పడిన ఈ సంఘాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని ఆయన అన్నారు. జిల్లా గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో నిమ్మాడ క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో నాలుగు మండలాలకు చెందిన 180 మంది విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్స్ (వీవోఏ)లకు 5జీ మొబైల్ ఫోన్లను మంత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ కార్యక్రమా లను మరింత సమర్థవంతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచిం చారు. డ్వాక్రా మహిళలకు వెన్నుదన్నుగా కూటమి ప్రభుత్వం ఉంటుందని పేర్కొన్నారు. ప్రభుత్వం మీపై పెట్టిన బాధ్యతను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. విధి నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని, నిర్దిష్ట జాబ్ చార్ట్ ప్రకారం పనిచేయాలని స్పష్టం చేశారు. డ్వాక్రా సంఘాలు మహిళల ఆర్థిక పురోగతికి కీలకంగా నిలిచాయని, ఈ వ్యవస్థపై తనకు ప్రత్యేకమైన గౌరవం ఉందని పేర్కొన్నారు. మహిళలు పొదుపు సంఘాల ద్వారా ఆర్థిక స్వావలంబన సాధించడం గర్వ కారణమని కొనియాడారు. 5జీ ఫోన్ల ద్వారా వీవోఏలు స్వయం సహాయక సంఘాల డేటా, పొదుపులు, రుణాల వివరాలు, ప్రభుత్వ పథకాల సమాచారాన్ని వేగంగా నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు పి.భానుమ తి, కూటమి నాయకులు పాల్గొన్నారు,

చైతన్యరథం



విద్యా వ్యవస్థపై అధ్యయనం కోసం

## సింగపూర్‌కు ఏపీ ఉపాధ్యాయుల బృందం

**ఉత్తమ అవార్డు గ్రహీతలు 37 మంది ఎంపిక**

**కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం**

అమరావతి(చైతన్యరథం): ఏపీలోని ఉత్తమ ఉపాధ్యాయులను అంతర్జాతీయ స్థాయి విద్యా వ్యవస్థలను అధ్యయనం చేయించాలనే లక్ష్యంతో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా ఏపీ ఉపాధ్యాయుల బృందం సింగపూర్‌కు వెళ్లనుంది. ఈ నెల 4 నుంచి 9 వరకు సింగపూర్‌లో ఈ బృందం పర్యటించనుంది. సింగపూర్ పర్యటనకు ఏపీలో 37 మంది ఉత్తమ ఉపాధ్యాయు లతో బృందాన్ని ఎంపిక చేసినట్లు అధికారులు తెలిపారు. సింగ పూర్‌లో అత్యాధునిక విద్యా విధానాలు, బోధనా పద్ధతులు, పాఠశాలల్లో అమల వుతున్న వినూత్న ప్రయోగాలు, విద్యా ర్థుల అభివృద్ధి వ్యవస్థలను ఉపాధ్యా యులు సమగ్రంగా అధ్యయనం చేయ నున్నారు. ఇప్పటికే ఈబృందం విజయ వాడ నుంచి హైదరాబాద్‌కు బయలు దేరింది. అక్కడి నుంచి సింగపూర్‌కు విమానం ద్వారా ప్రయాణించనున్నారు. మిగిలిన ఉత్తమ ఉపాధ్యాయులను అధ్యయనం కోసం త్వరలో ఫిన్లాండ్‌కు పంపించాలని ప్రభుత్వం నిర్ణయిం చింది. ప్రాథమిక విద్యలో ప్రపంచానికే ఫిన్లాండ్ ఆదర్శంగా నిలిచింది. ఈ రెండు దేశాల అనుభవాలను విని యోగించి ఏపీలో విద్యా రంగాన్ని మరింత బలోపేతం చేయాలనేది ప్రభుత్వ ఆలోచన. ప్రభుత్వ నిర్ణయంపై ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. విద్యావ్యవస్థలో ఇప్పటికే లోకేష్ మంత్రిగా అనేక సంస్కరణలు తీసుకువచ్చారు. సింగపూర్ పర్యటనకు ఉపాధ్యాయు లను పంపడం వల్ల అత్యుత్తమ విద్యావిధానాల అధ్యయనానికి అవకాశం ఏర్పడుతుంది.

క్వాంటం వ్యాలీలో

# ట్విన్ టవర్లకు గ్రీన్‌సిగ్నల్

- అమరావతి అభివృద్ధిలో మరో ముందడుగు
- రూ.1208.41 కోట్లు కేటాయిస్తూ ఉత్తర్వులు
- టెండర్ల ప్రక్రియను ప్రారంభించాలని ఆదేశం



అమరావతి(చైతన్యరథం): రాజధాని అమరావతి అభివృద్ధిలో భాగంగా ఏపీ ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. రాజధాని ప్రాంతంలోని క్వాంటం వ్యాలీ లో అత్యాధునిక సౌకర్యాలతో నిర్మిం చతలపెట్టిన ట్విన్ ఆఫీస్ టవర్ల నిర్మా ణానికి అధికారికంగా పరిపాలన అనుమతులు లభించాయి. రాజధాని నగరంలో మౌలిక సదుపాయాల కల్పన, పరిపాలనా యంత్రాంగానికి అవసరమైన కార్యాలయాల కోసం ఈ ట్విన్ టవర్లను ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకం గా చేపడుతోంది. ట్విన్ టవర్ల టీ1,టీ2 'షెల్ అండ్ కోర్' నిర్మాణ పనుల కోసం రూ.1208.41 కోట్లు కేటాయిస్తూ మున్సిపల్ పరిపాలన శాఖ ఉత్తర్వులు జారీచేసింది. గత నెల ఏప్రిల్ 23వ తేదీన జరిగిన 60వ ఏపీసీఆర్‌డీఏ అథారిటీ సమావేశంలో తీసుకు న్న నిర్ణయం మేరకు ఈ నిధులను మంజూరు చేసింది. ఈ ప్రాజెక్టును 'డిజైన్ బిల్డ్ లంప్సమ్' పర్సంటేజ్ టెండర్ విధానంలో చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనివల్ల నిర్మాణ సంస్థ ప్లానింగ్, డిజైనింగ్, ఎగ్జిక్యూషన్ బాధ్యతలను సమర్థవం తంగా నిర్వహించే అవకాశం ఉంటుంది. ఈ భారీ నిర్మాణ పనులకు సంబంధించి టెండర్ల ప్రక్రియను తక్షణమే ప్రారంభిం చాలని అమరావతి గ్రోత్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్‌ను ఏపీ ప్రభుత్వం ఆదేశించింది. ప్రాజెక్టు పర్యవేక్షణ, అమలు బాధ్యతలను ఏజీఐసీఎల్ మేనేజింగ్ డైరెక్టర్‌కు అప్పగిస్తూ ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. క్వాంటం వ్యాలీ ప్రాంతంలో ఈ టవర్లు రావడం వల్ల ఐటీ, పరిపాలన, వాణిజ్య రంగాలు మరింత వేగంగా వృద్ధి చెందే అవకాశం ఉంది. అమరావతిని గ్లోబల్ సిటీగా తీర్చిదిద్దే క్రమంలో ఇవి ఐకానిక్ కట్టడాలుగా నిలవనున్నాయి. అమరావతి నిర్మాణ పనుల్లో వేగం పెంచిన ఏపీ ప్రభుత్వం రూ.1208.41 కోట్లకు పైగా నిధులతో ట్విన్ టవర్ల నిర్మాణానికి పచ్చజెండా ఊపడం రాజధాని ప్రాంతంలో రియల్ ఎస్టేట్, అభివృద్ధి పనులకు కొత్త ఊపునిస్తోంది.

# కాలువల మరమ్మతులు, పూడికతీతకు రూ.397 కోట్లు

**నామినేషన్ పద్ధతిపై రూ.10 లక్షల లోపు పనులు**

**సీజన్ మొదలయ్యేలోగా పూర్తిచేయాలి**

**మంత్రి నిమ్మల రామానాయుడు ఆదేశం**



అమరావతి(చైతన్యరథం): తూడు, గుర్రపుడెక్క తొలగింపు వంటి నీటి అడ్డంకులు తొలగింపు, పూడికతీత పనుల కోసం ప్రభుత్వం రూ.397 కోట్లు విడుదల చేసింది. వెంటనే పనులు మొదలుపెట్టేలా సీఈ స్థాయి నుంచి కిందిస్థాయి అధికారులు చర్య లు చేపట్టాలని మంత్రి నిమ్మల రామానాయుడు ఆదేశించా రు. సీజన్ మొదలయ్యేలోగా కాలువల పూడికతీత, తవ్వకం, తూడు, గుర్రపుడెక్క తొలగింపు వంటి అత్యవసర పనులు పూర్తి చేయాలని సూచించారు. రూ.10 లక్షల లోపు పనులను సాగునీటి సంఘాల ఆధ్వర్యంలో నామినేషన్ పద్ధతిలో చేపట్టాలి. .రూ.10 లక్షలు దాటిన పనులకు షార్ట్ టెండర్లు పిలిచి పనులు మొద లుపెట్టాలి..ఎట్టి పరిస్థితుల్లోనూ అన్ని పనులు సీజన్ మొదలయ్యే నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. గేట్లు, షట్టర్లు, వంటి మెకా నికల్ పనులను తప్పనిసరిగా అసిస్టెంట్ ఇంజనీర్ పరిశీలించి సక్రమంగా పనిచేసే స్థితిలో ఉన్నాయనే ధ్రువీకరణ పత్రాన్ని చీఫ్ ఇంజనీర్‌కు ఇవ్వాలని సూచించారు. సాగునీటి సంఘాల ఆధ్వర్యం లో వారి పరిధిలోని పనులను మే నెలాఖరుకు పూర్తిచేయాలని, పనులను చీఫ్ ఇంజనీర్లు, సూపరింటెండెంట్ ఇంజనీర్లు నిరంత రం పర్యవేక్షించాలని ఆదేశించారు. గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వం కాలువల నిర్వహణ, మరమ్మతులు, పూడికతీత పనులను గాలికొదిలేసిందని దుయ్యబట్టారు. వైసీపీ పాలనలో ఐదేళ్లలో రూ.200 కోట్లు నిర్వహణ పనుల నిమిత్తం ఇస్తే.. కూటమి ప్రభు త్వం 20 నెలల్లోనే రూ.1100 కోట్లు ఇచ్చిందని వివరించారు. 2026 ఖరీఫ్ ప్రారంభానికి ముందుగానే నిర్వహణ, మరమ్మతులు చేపట్టి పూర్తిచేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని వెల్లడించారు.

# పసుపు పండుగ మహానాడుకు సింహపురి సిద్ధం

- ఈ నెల 27,28,29 తేదీల్లో నిర్వహణ
- ఆతిథ్యం అదిరిపోయేలా నేతల ప్రణాళిక
- స్థల ఎంపికలో మంత్రి నారాయణ బిజీ
- కోవూరు ఇఫ్కో భూముల పరిశీలన
- మంత్రులు ఆనం, ఫరూక్‌లతో సమాలోచనలు



నెల్లూరు(చైతన్యరథం): సింహపురిలో మహానాడు గర్జన ప్రతి ధ్వనించేలా పసుపు పండుగకు సన్నాహాలు మొదలయ్యాయి. ఇందుకు సంబంధించి అనువైన స్థలాన్ని ఎంపిక చేసే పనిలో ఉన్నారు. పురపాలక మంత్రి పొంగూరు నారాయణ శనివారం కోవూరు జాతీయ రహదారి వద్ద నున్న 110 ఎకరాల ఇఫ్కో భూములను వేదిక కోసం నాయకులతో కలిసి పరిశీలించారు. నెల్లూరు జిల్లా రాజకీయ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయేలా ఈ ఏడాది టీడీపీ మహానాడు నిర్వహించబోతున్నామని నారాయణ తెలిపారు. కేంద్ర కమిటీ పరిశీలన, ఆమోదం అనంతరం వేదికను ఖరారు చేస్తామని వెల్లడించారు.

### మహానాడు ఏర్పాట్లపై మంత్రుల సమాలోచనలు

మహానాడు ఏర్పాట్లపై నెల్లూరు నారాయణ మెడికల్ కాలేజీ ఆవరణలోని మంత్రి నారాయణ క్యాంపు కార్యాలయంలో మంత్రి నారాయణ, దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఇన్‌చార్జి మంత్రి ఫరూక్ సమాలోచనలు జరిపారు. ఈ సమావే శానికి సీఎం ప్రోగ్రాం కోఆర్డినేటర్ మంతెన సత్యనారాయణ రాజు, ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, కాకర్ల సురేష్, కృష్ణారెడ్డి, రాష్ట్ర వక్ఫ్‌బోర్డ్ చైర్మన్ అబ్దుల్ అజీజ్, బీదా రవిచంద్ర తదితరులు హాజరయ్యారు. మహానాడు వేదిక ఖరారు, బహిరంగ సభ వేదిక, పార్కింగ్ ప్రదేశాలు, అతిథు లకు, పార్టీ నాయకులు, కార్యకర్తలకు వసతి సౌకర్యాలపై చర్చిం చారు. నెల్లూరు ఆతిథ్యం రాష్ట్రస్థాయిలో గుర్తుండి పోయేలా మహా నాడు విజయవంతానికి విస్తృతమైన ఏర్పాట్లు చేసేలా ప్రణాళిక రూపొందిస్తున్నారు. ఈ నెల 27,28,29 తేదీల్లో మహానాడు జరగనుంది.



# 'రియల్‌టైమ్' ఛేదన

- పోలీసులకు ఆర్టీజీఎస్ సాంకేతిక తోడ్పాటు
- కీలక సహకారం అందిస్తున్న సీసీటీవీ 360
- అదృశ్యమైన ముగ్గురు మహిళల ఆచూకీ లభ్యం
- హత్య కేసులో నిందితుడిని పట్టించిన టెక్నాలజీ
- వాహన చోరీ కేసు ఛేదనలోనూ కీలక పాత్ర



అమరావతి(చైతన్యరథం): వివిధ కేసుల దర్యాప్తులో పోలీసు లకు రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ తనదైన సాంకేతిక తోడ్పాటు అందిస్తూ కేసుల ఛేదనలో పోలీసులకు తగినంత సహకారం అందిస్తోంది. తాజాగా ఐదు కేసుల్లో ఆర్టీజీఎస్ సీసీటీవీ 360 వ్యవస్థ కీలకపాత్ర పోషించి ఈ కేసుల దర్యాప్తులో పోలీసుల పని సులభతరం చేసింది. అదృశ్యమైన ముగ్గురు మహిళల ఆచూకీ కనుగొనడంలో ఆర్టీజీఎస్ సీసీటీవీ 360 కీలకపాత్ర పోషించింది. ఈ ముగ్గురిలో ఇద్దరు బాలికలు కూడా ఉన్నారు. అలాగే తాడేప ల్లిగూడెంలో హత్య చేసి ఇంట్లో సొత్తు దోపిడీ చేసి వెళ్లిన హంతకుడిని కూడా సకాలంలో పట్టించడంలో ఆర్టీజీఎస్‌కు చెంది న సర్వైలెన్స్ కెమెరాలు కీలకంగా పనిచేశాయి. మోటారుసైకిల్ దొంగిలించి పరారైన మరో నిందితుడి కదలికలను సైతం పసిగట్టి నిందితుడిని పట్టించేలా చేయడంలో ఆర్టీజీఎస్ సాంకేతికత సమర్థ వంతంగా పనిచేసింది. శాంతిభద్రత పరిరక్షణకే కాకుండా పలు కేసుల దర్యాప్తులోనూ పోలీసులకు సహకరించేలా ఆర్టీజీఎస్‌లో సీసీటీవీ 360 అనే ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేశారు. దీని ద్వారా తాజాగా ఐదు కేసుల్లో పోలీసులు ఆర్టీజీఎస్ సీటీవీ360 సాంకేతి క సహకారాన్ని సమర్థంగా వినియోగించుకున్నారు.

**కేస్ 1: అదృశ్యమైన బాలిక.. విజయవాడలో గుర్తింపు**

కర్నూలు జిల్లా నందవరం పోలీసుస్టేషన్ పరిధిలో ఏప్రిల్ 22న 17 ఏళ్ల బాలిక అదృశ్యమైంది. బాలిక ఆచూకీ కనుక్కోవ డానికి ఆర్టీజీఎస్ సహకారాన్ని పోలీసులు కోరారు. ఆమె ఫొటోను ఆర్టీజీఎస్ సీసీటీవీ360 అప్లికేషన్లో అప్‌లోడ్ చేసి టైమ్ సెన్సిటివ్ అప్రోచ్ ద్వారా డిజిటల్ గాలింపు చేపట్టారు. ఆమె విజయవాడకు వచ్చి నగరంలోని ఒక ప్రధాన కూడలిలో తచ్చాడుతున్నట్లు ఆర్టీజీ ఎస్ రియల్ టైమ్ అలర్టులను పోలీసులకు పంపింది. దీంతో నందవరం పోలీసులు విజయవాడ పోలీసుల సహకారంతో బాలిక ను పట్టుకుని ఆమె తల్లిదండ్రులకు అప్పగించగలిగారు.

**కేస్2: నంద్యాలలో అదృశ్యం.. ఒంగోలులో బాలిక**

నంద్యాల జిల్లా గడివేముల పోలీసుస్టేషన్ పరిధిలో ఈ నెల 25న 16 సంవత్సరాల బాలిక అదృశ్య మైనట్లు ఆమె తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. దీంతో ఆమె వెళ్లిన మోటారుసైకిల్ నెంబరు ఆధారంగా ఆమె ఆచూకీ కనిపెట్టడానికి పోలీసులు ఆర్టీజీఎస్ సహ కారం కోరారు.ఆ బాలిక ఫొటో,ఆమె వెళ్లిన వాహనం నెంబ ర్‌ను ఆర్టీజీఎస్ సీసీటీవీ360 అప్లికేషన్‌లో అప్‌లోడ్ చేసి ఆమె కదలికలను గాలించారు. ఆమె ఏప్రిల్ 29న ప్రకాశం జిల్లా ఒంగోలు పట్టణంలోని ఒక ప్రధాన కూడలిలో ఉండగా సీసీటీవీ కెమెరాలు కనిపెట్టాయి. ఆర్టీజీఎస్ పోలీసులకు రియల్ టైమ్ అలర్టులు పంపడంతో నంద్యాల, ఒంగోలు పోలీసులు సమన్వయంతో వ్యవహరించి ఆమెను ఆమె తల్లిదండ్రులకు అప్పగించారు.

**కేస్3: చిత్తూరులో యువతి ఆచూకీ గుర్తింపు**

చిత్తూరు జిల్లా రొంపిచెర్లలో ఈ నెల 24న 22 ఏళ్ల యువతి అదృశ్యమైనట్లు అక్కడి పోలీసులకు ఆమె తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. తమ గ్రామా నికి చెందిన ఓ యువకుడు ఈ అదృశ్యం వెనుక ఉన్నారనే అనుమానం వ్యక్తం చేశారు. దీంతో పోలీ సులు ఈకేసు ఛేదనకు ఆర్టీజీఎస్ సహకారంకోరారు. ఆ యువకుడి వాహనం నెంబర్, ఆ యువతి ఫొటోలను ఆర్టీజీఎస్ సీసీటీవీ360 అప్లికేషన్‌లో అప్‌లోడు చేసి పర్సన్ ఆఫ్ ఇంట్రెస్ట్ (పీఓఐ), ఆటోమే టిక్ నెంబర్ ప్లేట్ రికగ్నిషన్ (ఏఎన్‌పీఆర్) టెక్నాలజీ అప్రోచ్ ద్వారా గాలింపు చర్యలు చేపట్టారు. వారు వెళ్లిన వాహనం 28వ తేదీ వరకు తిరుపతిలోని వివిధ ప్రాంతాల్లో తిరుగాడినట్లు గుర్తించి అటు నుంచి చిత్తూరుకు వెళుతున్నట్లు సీసీటీవీల ద్వారా గుర్తిం చారు. ఆ సమాచారాన్ని ఆర్టీజీఎస్ పోలీసులకు రియల్ టైమ్ అలర్టులు పంపడంతో పోలీసులు వారిని చిత్తూరు పట్టణంలో పట్టుకున్నారు.

**కేస్4: హత్య, దోపిడీ కేసు ఛేదనలో సహకారం**

పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో ఏప్రిల్ 15న నమో దైన హత్య, దోపిడీ కేసుకు సంబంధించి నిందితుడ్ని పట్టుకోవ డంలో ఆర్టీజీఎస్ సీసీటీవీ360 వ్యవస్థ కీలకంగా పనిచేసింది. నిందితుడి ఆచూకీ కనుగొనడానికి పోలీసులు ఆర్టీజీఎస్ సహకా రం కోరారు. ఈ సంఘటన జరిగిన ప్రాంతానికి సమీపంలోని ఆర్టీజీఎస్‌కు చెందిన మ్యాట్రిక్స్ సర్వైలెన్స్ కెమెరాల్లో నిందితుడి అనుమానిత కదలికలు రికార్డు అయ్యాయి. ఇది పోలీసులకు గోల్డెన్ లీడ్‌గా మారింది. దీని ఆధారంగా పోలీసులు నిందితుడ్ని అరెస్టు చేయడంతో పాటు అతడి నుంచి బంగారు నగలు, చోరీ సొత్తు స్వాధీనం చేసుకున్నారు. ఇది డిజిటల్ ఎవిడెన్సుగా కూడా పోలీసులకు ఉపయోగపడనుంది.

**కేస్5: చోరీకి గురైన మోటారుసైకిల్ లభ్యం**

ఏలూరు జిల్లా పోలవరం పోలీసుస్టేషన్ పరిధిలో గత మార్చి లో చోరీకి గురైన మోటారు సైకిల్‌ను కూడా పోలీసులు ఆర్టీజీఎస్ సీసీటీవీ 360 సహకారంలో విజయవంతంగా పట్టుకోగలిగారు. చోరీకి గురైన మోటారుసైకిల్ నెంబర్ ఆధారంగా ఆర్టీజీఎస్ జనరల్ సర్వైలెన్స్ మ్యాట్రిక్స్ ద్వారా హై రిజల్యూషన్ ఇమేజెస్ ద్వారా ఆ వాహనం కదలికలను పసిగట్టారు. గోదావరి జిల్లా కడియం పోలీసు స్టేషన్ పరిధిలో సంచరిస్తున్నట్లు పోలీసులకు ఆర్టీజీఎస్ అలర్టులు పంపడంతో పోలీసులు సమన్వయంతో వ్య వహరించి ఈ బైకును చోరీ చేసిన నిందితుడిని పట్టుకుని బైకును స్వాధీనం చేసుకున్నారు.

**పోలీసుల మధ్య మరింత సమన్వయం**

ఆర్టీజీఎస్‌లోని సీసీటీవీల సాంకేతిక వ్యవస్థ పోలీసుల మధ్య సమన్వయం పెంపొందించడానికి దోహదపడుతోంది. కేసు దర్యాప్తులో పోలీసుల మధ్య జిల్లాల మధ్య ఉన్న సరిహద్దులను చెరిపివేస్తూ, నేరస్థులు రాష్ట్రంలో ఎక్కడ సంచరిస్తున్నా వారి కదలికలను ఆర్టీజీఎస్ సీసీకెమెరాలు ఇట్టే పట్టేస్తున్నాయి. ఆయా కేసుల్లో ఆ నిందితులకు సంబంధించిన సమాచారాన్ని కేసు నమోదైన పోలీసు స్టేషన్ పోలీసులకు చేరవేస్తున్నాయి. దీంతో పోలీసులు సమన్వయంతో వ్యవహరించి నిందితులను ఇట్టే పట్టుకుంటుని కేసులను విజయవంతంగా ఛేదిస్తున్నారు.

# మన్యంలో ట్రెక్కింగ్ టూరిజానికి అడుగులు

- వారాంతపు సెలవుల్లో ఇప్పటికే ఔత్సాహికులు
- గాలికొండ, అరమ కొండలకు సందర్శకులు
- మే 24 నుంచి 31 వరకు ఎన్‌సీసీ క్యాంప్



పాడేరు(చైతన్యరథం): ప్రకృతి అందాలకు నిలయమైన అల్లూరి జిల్లాలో ట్రెక్కింగ్ టూరిజం అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అడుగులు వేస్తున్నాయి. ఇందులో భాగంగా అరకులోయ కేంద్రంగా ఈనెల 24 నుంచి 31వ తేదీ వరకు ఎన్‌సీసీ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి ట్రెక్కింగ్ క్యాంప్‌ను నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నాయి. వాస్తవానికి అరకులోయ ప్రాంతంలో ట్రెక్కింగ్ టూరిజం అభివృద్ధి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. కొండలు కోనలున్న అరకులోయ ప్రాంతంలో పర్యాటకంలో భాగంగా ట్రెక్కింగ్ ట్రైల్స్ అభివృద్ధికి కృషిచేస్తామని గత ఫిబ్రవరిలో జరిగిన పార్లమెంట్ సమావేశాల్లో ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్ స్వయంగా ప్రకటించారు. కేంద్ర బడ్జెట్‌పై జరిగిన చర్చల్లో అరకులోయలో ట్రెక్కింగ్ టూరిజం గురించి ప్రస్తావించడం గర్వ కారణం. మన్యంలో ఇన్నాళ్లుగా ప్రకృతి అందాలపైనే ఆధారపడి పర్యాటకం కొనసాగుతున్నది. కానీ ఇకపై ఇక్కడున్న కొండలు, కోనలను సైతం సందర్శకులకు సరికొత్తగా చూపించి పర్యాటకంగా అభివృద్ధికి చేయాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ట్రెక్కింగ్ అభివృద్ధిపై దృష్టి సారించింది. ఇప్పటికే ఏజెన్సీలో అరకులోయ మండలం గాలికొండ, సుంకరమెట్ట ప్రాంతాల్లో, హుకుంపేట మండలం అరమకొండ (సీతమ్మకొండ) ప్రాంతానికి వివిధ ప్రాంతాలకు చెందిన వారు ట్రెక్కింగ్ అనుభూ తిని పొందుతున్నారు. అయితే పర్యాటకుల వ్యక్తిగత ఆసక్తి మేరకు మాత్రమే ఇన్నాళ్లుగా ఏజెన్సీలో ట్రెక్కింగ్ ప్రక్రియ కొనసాగుతుంది. కేంద్ర ప్రభుత్వం అరకులోయ కేంద్రంగా ట్రెక్కింగ్ ట్రైల్స్ అభివృ ద్ధికి చర్యలు చేపట్టేందుకు ముందుకు వస్తుండడంతో రానున్న రోజుల్లో అరకులోయ ప్రాంతం సాహస క్రీడలకు వేదికగా మారేం దుకు అవకాశం ఉందని పలువురు అంటున్నారు.

**ఈనెల 24 నుంచి రాష్ట్ర స్థాయి ట్రెక్కింగ్ క్యాంప్**

జిల్లాలో అరకులోయ కేంద్రంగా ఈనెల 24 నుంచి 31వ తేదీ వరకు ఎన్‌సీసీ 13వ బెటాలియన్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి ట్రెక్కింగ్ క్యాంప్‌ను నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. అరకులోయలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీ భూమికగా అరకులోయ మండలంలోని గాలికొండ, హుకుంపేట, డుంబ్రి గుడ మండలాల్లోని అరమ కొండ(సీతమ్మకొండ), అనంతగిరి మండలంలోని బొర్రా గుహలు ప్రాంతాల్లో ట్రెక్కింగ్ నిర్వహించే లా సన్నాహాలు చేస్తున్నారు. రాష్ట్రంలో ఉన్న ఔత్సాహిక ఎన్‌సీసీ క్యాడెట్లతో ఈ క్యాంప్‌ను నిర్వహిస్తారు. ఇందుకు సంబంధం చిన ఏర్పాట్లపై వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ ప్రత్యేక సమావేశాన్ని కూడా నిర్వహించారు.

# సంగంలో అభివృద్ధి పనులకు శ్రీకారం

- పాల్గొన్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి
- బ్యారేజ్ పెండింగ్ పనులు పూర్తిచేస్తున్నట్లు వెల్లడి

సంగం(చైతన్యరథం): మండలంలోని తరుణవాయి, పడమటిపాలెం గ్రామాల్లో దేవాదాయ మంత్రి ఆనం రామనారా యణరెడ్డి పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. ముం దుగా తరుణవాయి గ్రామంలోని హను మాన్ జంక్షన్ వద్ద ఆంజ నేయ స్వామి విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం భోజనశాలను ప్రారంభించా రు. ఈ సందర్భంగా రూ.72.90 లక్షల వ్యయంతో ఐటీఐ కాలేజీ సిమెంట్ రోడ్డు ను ప్రారంభించడంతోపాటు, గ్రామ పం చాయతీ పరిధిలో రూ.57.75లక్షలతో నీటిపారుదల కాలువల మరమ్మతులు, రూ.31.60 లక్షలతో ఇంటింటికి రక్షిత తాగునీటి పథకం పంపు షెడ్ పనులకు శ్రీకారం చుట్టారు. తరుణవాయి గ్రామం లోనే మొత్తం రూ.1.62 కోట్లతో పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించా రు. అనంతరం తన స్వగ్రామమైన పడ మటిపాలెంకు విచ్చేసిన మంత్రికి నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఆత్మీయ స్వాగతం పలికారు. ఇక్కడ రూ.1.71కోట్లతో అభివృద్ధి పను లను ఎమ్మెల్యేతో కలిసి మంత్రి ప్రారం భించారు. ఇందులో రూ.20లక్షలతో సిమెంట్ రోడ్లు, రూ.31.60 లక్షలతో రక్షిత తాగునీటి పథకం, రూ.97.50 లక్షలతో సాగునీటి కాలువల మరమ్మత్తు పనులు ఉన్నాయి. అదనంగా రూ.27 లక్షలతో విలేజ్ క్లినిక్ అసంపూర్తి పనుల కు శంకుస్థాపనచేశారు. పడమటిపాలెం లో రూ.5.47లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కు లను లబ్దిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం మాట్లాడు తూ త్వరలోనే తరుణవాయి ఐటీఐ కళా శాల భవనాలను పూర్తిచేసి తరగతులను ప్రారంభిస్తామని, లగడపాటి కుటుంబ సభ్యుల కోరిక మేరకు ఆ కళాశాలకు లగడపాటి వెంకట రామనాయుడు పేరు పెట్టనున్నట్లు తెలిపారు. ప్రతి గ్రామంలో సాగునీటి పనులను పూర్తిచేసి ప్రతి ఎక రాన్ని సస్యశ్యామలం చేయడమే లక్ష్యమ ని, సంఘం బ్యారేజ్ పెండింగ్ పనులను కూడా పూర్తి చేస్తున్నామని పేర్కొన్నారు.



# చేనేతల లోగిళ్లలో 'ఉచిత' కాంతులు

- గత నెల 1 నుంచి ఉచిత విద్యుత్ అమలు
- మగ్గం నేతన్నలకు 200 యూనిట్లు
- మర మగ్గాలకు 500 యూనిట్లు
- జీరో పేమెంట్‌తో మే నెల బిల్లుల రాక
- చేనేతల కుటుంబాల్లో హర్షాతిరేకాలు
- చంద్రబాబు,లోకేష్‌కు ధన్యవాదాలు
- ఏడాది ఉపాధే లక్ష్యం : మంత్రి సవిత

అమరావతి(చైతన్యరథం): ఇచ్చిన మాటకు కట్టుబడుతూ నేతన్నలకు ఇచ్చిన హామీ నెరవేర్చి కూటమి ప్రభుత్వం నేతన్నల కుటుంబాల్లో వెలుగులు నింపుతోంది. ఉచిత విద్యుత్ పథకం అమలు కావడంతో తొలి నెలలో జీరో పేమెంట్ విద్యుత్ బిల్లు రావడంతో చేనేతలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఆర్థిక భారం తగ్గడంతో మాట నిలబెట్టుకున్న సీఎం చంద్రబాబుకు, కూటమి ప్రభుత్వానికి ధన్యవాదాలు చెబుతున్నారు. ఒకవైపు చేనేత పరిశ్ర మకు పూర్వవైభవం తీసుకొచ్చేలా చర్యలు చేపడుతూనే, నేతన్నల కు వ్యక్తిగత లబ్ది కలిగేలా పథకాలు అమలు చేస్తోంది. దీనిలో భాగంగా గత ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి చేనేతలకు మేలు కలిగేలా కూటమి ప్రభుత్వం ఉచిత విద్యుత్ పథకానికి శ్రీకారం చుట్టింది. ఈ పథకం ద్వారా 1.04 లక్షల కుటుంబాలకు ఉచిత విద్యుత్ అందజేసేలా చర్యలు చేపట్టింది. మగ్గంపై నేసే నేతన్న లకు నెలకు 200 యూనిట్లు, మర మగ్గంపై నేసే నేతన్నలకు 500 యూనిట్లు ఉచితంగా ఇవ్వాలని సీఎం చంద్రబాబు నిర్ణయిం చారు. ఉచిత విద్యుత్ పథకం అమలుతో చేనేత కుటుంబాలకు ఆర్థిక వెసులుబాటు కలిగింది.



జీరో విద్యుత్ బిల్లుల రాక

గత నెల ఒకటో తేదీ నుంచి ఉచిత విద్యుత్ పథకం అమల్లోకి రావడంతో రెండు రోజుల నుంచి గ్రామాల్లో చేనేతలకు విద్యుత్ బిల్లులను ట్రాన్స్‌కో అధికారులు అందజేస్తూ వస్తున్నారు. జీరో పేమెంట్ విద్యుత్ బిల్లులు రావడంతో చేనేతల ఆనందానికి అవధుల్లేకుండా పోయింది. బిల్లులు చెల్లించాల్సిన అవసరంలేదని ట్రాన్స్‌కో అధికారులు చెబుతుండడంతో వారంతా మురిసిపోతు న్నారు. చేనేత, విద్యుత్ శాఖాధికారులు సమన్వయంతో పనిచేస్తూ నేతన్నల ఉచిత విద్యుత్ పథకం విజయవంతానికి తమ వంతు పాత్ర పోషించారు. రాష్ట్రంలో 50,252 మగ్గం నేతన్నల కుటుం బాలను, 6,995 మరమగ్గం మీద నేసే కుటుంబాలను ఉచిత విద్యుత్ పథకం కింద అర్హులుగా గుర్తించారు. వారికి ఉచిత విద్యుత్ సరఫరా చేశారు. మిగిలిన అర్హులకూ ఉచిత విద్యుత్ పథకం వర్తించేలా కృషి చేస్తున్నారు.

### ఉచిత విద్యుత్‌తో ఆర్థిక భరోసా

ఉచిత విద్యుత్‌తో మగ్గం నేతన్నలకు నెలకు రూ.720లు, సంవత్సరానికి రూ.8,640లు లబ్ది కలగనుంది. మరమగ్గం మీద నేసే కుటుంబానికి నెలకు రూ.1,800, ఏడాదికి రూ.21,600 లబ్ది కలుగనుంది. ఉచిత విద్యుత్ రూపంలో నెలనెలా ఆర్థిక భారం తప్పిందని, తమకు ఆర్థికంగా ఎంతో మేలు చేస్తోందని నేతన్నలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇచ్చిన మాటకు కట్టుబ డుతూ ఉచిత విద్యుత్ హామీ నెరవేర్చిన సీఎం చంద్రబాబుకు, మంత్రి నారా లోకేష్‌కు, కూటమి ప్రభుత్వానికి చేనేతలు ధన్యవా దాలు తెలియజేస్తున్నారు.

### నేతన్నలకు 365 రోజులూ ఉపాధే లక్ష్యం: మంత్రి సవిత

చేనేత కార్మికులకు గౌరవ జీవనం కల్పించడమే కూటమి ప్రభు త్వ లక్ష్యం. సగం ధరకే చీర, దోవతి నినాదంతో ఆనాడు అన్న ఎన్టీఆర్ చేనేత రంగానికి ఊపిరిపోస్తే.. నేడు సీఎం చంద్రబాబు నేతన్నలకు ఆర్థిక మేలు కలుగజేసేలా పథకాలు రూపొందిస్తు న్నారు. పెన్షన్లు, నూలుపై సబ్సిడీ, త్రిఫ్ట్ ఫండ్ నిధులు, ముద్ర రుణాలు, 90 శాతం సబ్సిడీ ఆధునిక పరికరాలు అందజేత వంటి కార్యక్రమాలను అమలు చేస్తున్నారు.

చేనేత వస్త్రాలకు మార్కెటింగ్ కల్పించేలా కూటమి ప్రభుత్వం పలు ఒప్పందాలు చేసుకుంది. 50 ఏళ్లు నిండిన నేతన్నలకు రూ.4 వేల చొప్పున పెన్షన్ అందజేస్తోంది. ఏటా రూ.5 కోట్ల మేర త్రిఫ్ట్ ఫండ్ నిధులు కేటాయిస్తోంది. నూలుపై 15 శాతం సబ్సిడీ అందజేస్తోంది. ఆప్కో ద్వారా చేనేత ఉత్పత్తుల అమ్మకాలు పెంచేలా ఎగ్జిబిషన్లు ఏర్పాటు చేస్తోంది. ఆన్ లైన్ ద్వారా నేరుగా వినియోగదారుల ఇళ్లకే చేనేత ఉత్పత్తులను డోర్ డెలివరీ చేస్తోంది. 2,640 మంది చేనేత కార్మికులకు ముద్ర పథకం కింద రూ.24.43 కోట్లు అందచేసిం ది. రాష్ట్ర వ్యాప్తంగా మెగా టెక్స్ టైల్స్ పార్కులు, క్లస్టర్లు ఏర్పాటు చేస్తున్నాం. గత నెల ఒకటో తేదీ నుంచి అమలు చేస్తున్న ఉచిత విద్యుత్ పథకంతో నేతన్న కుటుంబాలకు మరింత లబ్ది కలుగు తోంది. మగ్గం నేతన్నలకు ఏడాదికి రూ.8,640లు, మర మగ్గం నేతన్నలకు రూ.21,600 లబ్ది కలుగుతోంది. చేనేతలకు 365 రోజుల పాటు పని కల్పించడమే సీఎం చంద్రబాబు నేతృ త్వంలోని కూటమి ప్రభుత్వం ప్రధాన లక్ష్యం. ఉచిత విద్యుత్‌తో నేతన్నలకు ఆర్థిక భరోసా కల్పించిన సీఎం చంద్రబాబుకు, మంత్రి నారా లోకేష్‌కు చేనేతల తరఫున ధన్యవాదాలు.

# కార్మికుల రక్షణకు లేబర్ అడ్డాలు

- వారి కోసం విశ్రాంతి గదులు, సౌకర్యాలు
- 15 నగరాల్లో పైలెట్ ప్రాజెక్టుగా ప్రారంభం
- తర్వాత నియోజకవర్గాల్లోనూ ఏర్పాటు చేస్తాం
- ఉపాధి సమాచారం కూడా అందజేస్తాం
- స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాలు వేగవంతం
- ఈఎస్‌ఐ ఆసుపత్రులు, డిస్పెన్సరీల విస్తరణకు చర్యలు
- కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్

మంగళగిరి(చైతన్యరథం): అంతర్జాతీయ కార్మికుల దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల భద్రత, ఆరోగ్యం, సంక్షేమం, ఉపాధి అవకాశాల పెంపుపై ప్రత్యేక దృష్టి సారించినట్లు కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ వెల్లడించారు. శనివారం మంగళగిరి టీడీపీ కేంద్ర కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు గత 22 నెలల కాలంలో కార్మికుల జీవితాల్లో గణనీయమైన మార్పు లు తీసుకువచ్చామని పేర్కొన్నారు. కార్మికుల కోసం రాష్ట్రవ్యాప్తం గా అనేక సంక్షేమ, మౌలిక సదుపాయాల కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. మేడే సందర్భంగా ముఖ్యమంత్రి ప్రకటించిన "లేబర్ అడ్డా" పథకం రాష్ట్రంలోని 15 నగరాల్లో పైలెట్ ప్రాజెక్టుగా ప్రారంభం కానుందని చెప్పారు. రోజువారీ కూలీలు, జట్టు కార్మికులు రోడ్లపై నిలబడి పనుల కోసం ఎదు రుచూడాల్సిన పరిస్థితిని తొలగించేందుకు ఈ కేంద్రాలు ఉప యోగపడనున్నాయని వివరించారు.

### కార్మికులు విశ్రాంతి గదులు, సౌకర్యాలు

లేబర్ అడ్డా పథకంలో భాగంగా మండుటెండల్లో కార్మికులు ఇబ్బందులు పడకుండా విశ్రాంతి గదులు, తాగునీరు, మరుగుదొడ్లు వంటి సౌకర్యాలు కల్పించ నున్నట్లు తెలిపారు. అదే విధంగా ఆధునిక పరికరాల వినియోగంపై శిక్షణ, ఉపాధి అవ కాశాలపై సమాచా రం కూడా అందించనున్నట్లు వెల్లడించారు. యాజ మాన్యాల నుంచి కార్మిక అవసరాల డేటా సేకరించి అవసరమైన వారికి పని కల్పించే విధంగా ఈ కేంద్రా లను అభి వృద్ధి చేయనున్నట్లు పేర్కొన్నారు. పైలెట్ ప్రాజెక్టు విజయవం తమైతే ప్రతి నియోజకవర్గంలో లేబర్ అడ్డాలు ఏర్పాటు చేసే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. పోలవ రం,



అమరావతి నిర్మాణ పనులు, పారిశ్రామిక కారిడార్లు, లాజిస్టిక్స్ రంగాల్లో విస్తృతస్థాయిలో అభివృద్ధి పనులు జరుగు తున్నందున కార్మికులకు పెద్దఎత్తున ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయని వివరించారు.

### భవన నిర్మాణ కార్మికులకు మేలు చేసే కార్యక్రమాలు

భవన నిర్మాణ కార్మికులకు వివాహ కానుకగా రూ.40వేల వరకు, ప్రసూతి సాయంగా రూ.20వేల వరకు,సహజ మరణానికి రూ.60వేల వరకు, అంత్య క్రియల ఖర్చులకు రూ.20వేల వరకు ఆర్థిక సహా యం అందిస్తున్నట్లు వెల్లడించారు."మన మిత్ర"యాప్ ద్వారా కేవలం రూ.55తో కార్మికులు రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశం కల్పించినట్లు తెలిపారు. అదే యాప్ ద్వారా ఎస్టాబ్లిష్‌మెంట్ రిజిస్ట్రేషన్లు, ట్రేడ్ యూని యన్ రిజిస్ట్రేషన్లు, స్టాట్యుటరీ రిటర్న్స్, సెస్ చెల్లింపులు వంటి సేవలు అందుబాటులోకి తీసుకు వచ్చామని చెప్పారు. కార్మికుల ఆరోగ్య పరిరక్షణలో భాగంగా ఈఎస్‌ఐ ఆసు పత్రులు, డిస్పెన్స రీల విస్త రణకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని తెలిపారు. తిరుప తి ఈఎస్‌ఐ ఆసుపత్రిని 50పడకల నుంచి 100 పడకలకు అప్‌గ్రేడ్ చేసినట్లు, అచ్యుతాపురంలో 30 పడకల ఆసుపత్రి నిర్మాణం పూర్తిదశకు చేరుకుం దని వివరించారు. గుంటూరులో 100పడకల ఆసు పత్రికి 6.35 ఎకరాలు, కర్నూలులో 30 పడకల ఆసుపత్రికి 5.23 ఎకరాల భూమిని కేటాయించినట్లు తెలిపారు.శ్రీ సిటీ, నెల్లూరు ప్రాంతాల్లో కొత్త ఈఎస్‌ఐ ఆసుపత్రుల కోసం భూము లను గుర్తించినట్లు పేర్కొ న్నారు. విశాఖపట్నంలో 50 ఎంబీబీఎస్ సీట్లతో ఈఎస్‌ఐసీ మెడికల్ కాలేజీకి కేంద్ర అనుమతులు లభించినట్లు వెల్లడించా రు. అమరావతిలో 500 పడకల ఆసుపత్రి, 150 సూపర్ స్పెషాలిటీ పడకలతో కూడిన ఈఎస్‌ఐసీ మెడికల్ కాలేజీ ప్రతిపాదనలు సమర్పించినట్లు తెలిపారు.

### కొత్త ఈఎస్‌ఐ డిస్పెన్సరీల కోసం భూములు

చిత్తూరు, బంగారు పాళ్యం, నగరి, గుంతకల్, అనంతపురం, గంగూరు, మచిలీ పట్నం, బాపుల పాడు ప్రాంతాల్లో కొత్త ఈఎస్‌ఐ డిస్పెన్సరీల కోసం భూములను కేటాయించినట్లు వెల్లడించారు. రాష్ట్ర వ్యాప్తంగా మరో 30 కొత్త డిస్పెన్సరీలు, 57 ప్రస్తుత డిస్పెన్సరీల బలోపేతానికి ప్రతిపాదనలు పంపినట్లు చెప్పారు. పరిశ్రమల్లో ప్రమాదాల నివారణకు ప్రభు త్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని పేర్కొన్నారు. "జీరో యాక్సిడెంట్స్" లక్ష్యంగా యూనివర్సిటీలు, ఏపీ ప్రొడ క్టివిటీ కౌన్సిల్‌తో ఒప్పందాలు కుదుర్చుకుని సేఫ్టీ ఆఫీ సర్లకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. విశాఖపట్నం, కాకినాడ, విజయవాడల్లో "సేఫ్టీ వాక్" కార్యక్ర మాలు నిర్వహించి కార్మికుల్లో అవగాహన పెంచుతున్నట్లు చెప్పారు. 57 రకాల వృత్తుల వారు కార్మికుల కింద వస్తారని స్పష్టం చేశారు.

### "ఈ-శ్రమ్" పోర్టల్‌లో నమోదు చేసుకోవాలి

"ఈ-శ్రమ్" పోర్టల్‌లో నమోదు చేసుకుంటే ప్రమాద మరణానికి రూ.2లక్షలు, సహజ మరణానికి రూ.లక్ష బీమా సౌకర్యం లభిస్తుందని వివరించారు. రాష్ట్రంలో పెరుగుతున్న పెట్టుబడులు, అమరావతి, పోలవరం వంటి భారీ ప్రాజెక్టుల కారణంగా నైపు ణ్యం కలిగిన కార్మికులకు భారీ డిమాండ్ ఏర్పడిందని తెలిపారు. ఈ ఏడాది 25వేల మందికి నేరుగా స్కిల్ ట్రైనింగ్,వారి కుటుంబసభ్యులతో కలిపి సుమారు లక్ష మందికి స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాలు నిర్వహిస్తు న్నట్లు చెప్పారు. శిక్షణ అనంతరం సర్టిఫికేషన్ కూడా ఇవ్వడం ద్వారా ఉపాధి అవకాశాలు మరింత పెరుగు తాయని వివరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్ర అభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తు న్నారని, కార్మిక సంక్షేమాన్ని అత్యంత ప్రాధాన్యంగా తీసుకుంటున్నారని పేర్కొన్నారు. రాష్ట్రాన్ని "సువ ర్ణాంధ్ర"గా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు.




## ప్రమాద బాధితులకు '108' సత్వర సాయం

### గోల్డెన్ అవర్‌లో ఆసుపత్రికి తరలింపు

### నలుగురికి తప్పిన ప్రాణాపాయం

తంబళ్లపల్లె/మదనపల్లి(చైతన్యరథం): అన్నమయ్య జిల్లా తంబ ళ్లపల్లె మండలం పరిధిలో శనివారం రోడ్డు ప్రమాదంలో గాయ పడిన నలుగురికి '108' సిబ్బంది సకాలంలో స్పందించి ప్రాణా పాయం నుంచి తప్పించారు. మదనపల్లి-కడప జాతీయ రహదా రిపై రెడ్డికోట వద్ద గొర్రెలను తరలిస్తున్న బొలెరో వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో వాహనంలో ఉన్న నలుగురు వ్యక్తులు గాయపడగా వారిలో ఇద్దరికి తీవ్ర రక్తస్రావమై పరిస్థితి విషమంగా మారింది. సమాచారం అందుకున్న వెంటనే గుర్రంకొండ 108 అంబులెన్స్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకు న్నారు. అత్యంత కీలకమైన 'గోల్డెన్ అవర్'లో బాధితులకు ప్రాథమి క చికిత్స అందిస్తూ మెరుగైన వైద్యం కోసం మదనపల్లి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సకాలంలో అంబులెన్స్ చేరుకుని ఆసుపత్రికి చేర్చడంతో బాధితులకు ప్రాణాపాయం తప్పిందని స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.



# జలధారతో భూగర్భజలాలు పెరిగాయి

- **రైతుసోదరులు స్వచ్ఛంద శ్రమదానం చేయాలి**
- **ఉద్యానపంటల సాగుపైనా దృష్టిపెట్టాలి**
- **ఆర్‌అండ్‌బీ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి**



నంద్యాల/బనగానపల్లె(చైతన్యరథం): జలధార–జలహారతిలో భాగంగా శనివారం బనగానపల్లె బహిరంగ సభలో మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా పాల్గొన్నారు. సందర్భంగా మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ తాను ఇన్‌చార్జి మంత్రిగా ఉన్న అన్నమయ్య జిల్లాలలో నేడు భారీగా భూగర్భ జలాలు పెరిగాయని వివరించారు. గతంలో తెలుగుదేశం పార్టీ నీరు చెట్టు కార్యక్రమాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రారంభిస్తే వైసీపీ నేతలు దుష్ప్రచారం చేశారు. నీరు చెట్టు కార్యక్రమం ఎంతో ఉపయోగకరమో రాష్ట్ర ప్రజలందరికీ తెలుసు. ఎప్పుడో శ్రీకృష్ణదేవ రాయల కాలంలో తవ్విన కాలువలు చెరువులను తిరిగి పునరుద్ధ రించేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు. గత ఐదే ళ్లు ఒక వాగు, వంక, చెరువు, కాలువలో మట్టి తీసిన పాపాన పోలేదని మండిపడ్డారు. పోలవరం ప్రాజెక్టును నిలిపివేస్తే నేడు మేము పరుగులు పెట్టిస్తున్నామని తెలిపారు. బనగానపల్లెలోని పడమటపల్లెలో తాగునీరు ఇచ్చేందుకు కృత నిశ్చయంతో పని చేస్తున్నామని వివరించారు. నాడు కేవలం 9 నెలల కాలంలో దద్దనాల చెరువు ప్రాజెక్ట్‌ను అభివృద్ధి చేశామని వివరించారు.

రైతు సోదరులంతా కలిసి స్వచ్ఛందంగా ట్రాక్టర్లు, జేసీబీలు ఇస్తే ప్రభుత్వ సహకారంతో శ్రమదానం చేద్దామని పిలుపునిచ్చారు. వ్యవసాయంతో పాటు హార్టికల్చర్‌పై కూడా రైతులు దృష్టిపెట్టాలి. ఏ ఏ గ్రామాల్లో ఆ పంటలకు అనుకూలంగా ఉంటుందో అధి కారులు నివేదికను రూపొందించాలని సూచించారు. రైతులంతా స్వచ్ఛందంగా చేసే శ్రమదానానికి ప్రభుత్వంతో పాటు వ్యక్తిగతంగా తాను కూడా సహకరిస్తామని తెలిపారు. కొలిమిగుండ్లలో ఈ విధానం సక్సెస్ అయితే భవిష్యత్తులో బనగానిపల్లిలో కూడా ఈ తరహాలో శ్రమదానం చేపడదామని సూచించారు.

# విశాఖ ఉక్కుకు నేచురల్ గ్యాస్

- **ముందుకువచ్చిన ఐవోసీ సంస్థ**
- **రోజుకు 18 వేల క్యూబిక్ మీటర్ల పీఎన్‌జీ**
- **మెడ్‌టెక్ జోన్ నుంచి పైప్‌లైన్ పనులు ప్రారంభం**



విశాఖపట్నం(చైతన్యరథం): స్టీల్ ప్లాంటు ఎదుర్కొంటున్న గ్యాస్ సమస్య పరిష్కారానికి ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ ముందుకువచ్చింది. లిక్విడ్ పెట్రోలియం గ్యాస్‌కు బదులుగా పైప్డ్ నేచురల్ గ్యాస్(పీఎన్‌జీ) అందిస్తామని ఆఫర్ చేసింది. అందుకు స్టీల్ యాజమాన్యం అంగీకరించడంతో పైపులైన్ పనులు ప్రారంభించింది. పశ్చిమ ఆసియా దేశాల యుద్ధం నేపథ్యంలో ఇండస్ట్రియల్ ఎల్‌పీజీ సరఫరాను తగ్గించింది. అనేక విజ్ఞప్తుల తరువాత ఐండియన్ ఆయిల్ కార్పొరేషన్ ప్రత్యేకంగా 18టన్నుల గ్యాస్ ట్యాంకర్లను దఫదఫాలుగా సరఫరా చేయడంతో కొంత పరిస్థితి మెరుగుపడింది. దీంతో ప్రత్యామ్నాయంపై కర్మాగారం దృష్టిసారించింది. ఐఓసీతో చర్చించింది. అగనంపూడి ఏపీ మెడ్‌టెక్‌జోన్‌లో ఐఓసీకి పైప్డ్ నేచురల్ గ్యాస్ స్టోరేజీ సెంటర్ ఉంది. ఉత్తరాంధ్ర జిల్లాలకు పీఎన్‌జీ సరఫరా బాధ్యత ఐఓసీనే తీసుకుంది. గాజువాకలో అనేక ప్రాంతాల్లో గృహ వినియోగానికి పీఎన్‌జీ కనెక్షన్లు ఇచ్చింది. పీఎన్‌జీని ఉపయోగించుకోవడానికి అభ్యంతరం లేక పోతే సరఫరా చేస్తామని ఐఓసీ అధికారులు చెప్పగా స్టీల్ అధికారులు అంగీకరించారు. రోజుకు 18 వేల క్యూబిక్ మీటర్ల పీఎన్‌జీ అవసరమని లెక్క తేల్చారు. దీనికి మెడ్‌టెక్ జోన్ నుంచి స్టీల్ ప్లాంటులో గ్యాస్ ప్లాంటు వరకు ఆరు కిలోమీటర్ల పొడవున పైపులైన్ వేయాలని నిర్ణయించి పనులు కూడా ప్రారంభించారు. ఒక నెలరోజుల్లో పీఎన్‌జీ సరఫరా మొదలవుతుందని, ఇక గ్యాస్ కు ఇబ్బందులు ఉండవని, వ్యయం కూడా కొంతవరకు తగ్గుతుం దని స్టీల్ ప్లాంటు అధికార వర్గాలు తెలిపాయి.

# స్వచ్ఛ రథాలకు నాని సహాయం

## స్పందించిన డిప్యూటీ సీఎంవో




అమరావతి(చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్‌లో 'స్వచ్ఛరథాలు' కార్యక్రమానికి ప్రముఖ సినీ హీరో నాని సహాయం చేయడంపై ఉప ముఖ్యమంత్రి కార్యాలయం స్పందించింది. నాని సహాయంపై ఎక్స్‌వేదికగా పోస్టు పెట్టింది. అడిగిన వెంటనే సాయం చేయడం పై ప్రశంసలు కురిపించింది. 'మన పారిశుద్ధ్యం.. మన ఆరోగ్యం.. మన బాధ్యత' అనే నినాదంతో పవన్ ఆలోచనల నుంచి స్వచ్ఛ రథాలు పురుడుపోసుకున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా గ్రామాల్లో ఈ స్వచ్ఛరథాలు విప్లవాత్మక మార్పులు తెస్తున్నాయి. చెత్త నుంచి సంపద సృష్టి అనే యజ్ఞంలో గ్రామీణ ప్రజల్ని భాగస్వాముల్ని చేస్తూ దూసుకుపోతున్నా యి. గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణను సులభతరం చేసేందుకు కూటమి ప్రభుత్వం తీసుకువచ్చిన స్వచ్ఛ రథాల గురించి ప్రజల్లో మరింత అవగాహన కల్పించేందుకు అడిగిన వెంటనే తన వంతు సహాయ సహకారాలు అందించిన ప్రముఖ హీరో నానికి పవన్‌కళ్యాణ్ తరపున కృతజ్ఞతలు అంటూ పోస్ట్ పెట్టింది. ఈ స్వచ్ఛరథాలు ఏప్రిల్ నెలలో రికార్డు స్థాయిలో సుమారు 19 లక్షల కేజీల పొడి చెత్త కొనుగోలు చేయడం ద్వారా రూ.3.32 కోట్ల విలువ గల నిత్యావసరాలను ప్రజలకు అందించాయని చెప్పేందుకు ఆనందిస్తున్నామని తెలిపింది. భవిష్యత్తు తరాలకు వ్యర్థాల నిర్వహణపై అవగాహన కల్పించేందుకు ప్రతి గురువారం పాఠశాలల వద్దకు ఈ స్వచ్ఛరథాలు వెళ్లి.. పొడి చెత్తకు బదులుగా పుస్తకాలు, స్టేషనరీ ఇచ్చే విధంగా చేసిన ఏర్పా టు సత్ఫలితాలను ఇస్తోంది. ప్రధాని నరేంద్ర మోదీ, ఏపీ సీఎం చంద్రబాబు స్వచ్ఛ భారత్, స్వచ్ఛాంధ్ర లక్ష్యాలను సాధించేందుకు ఈ స్వచ్ఛరథం కార్యక్రమాన్ని ప్రారంభించామని డిప్యూటీ సీఎంవో ఎక్స్ వేదికగా పోస్టు పెట్టింది.

# మూడు హార్బర్‌లకు గ్రీన్‌సిగ్నల్

- **సవరించిన అంచనాలతో ఆమోదం**
- **తీరంలో ఆధునిక ల్యాండింగ్, బెర్తింగ్ సౌకర్యాలు**

అమరావతి(చైతన్యరథం): రాష్ట్ర ప్రభుత్వం మూడు ఫిషింగ్ హార్బర్లకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. మంత్రిమండలి సమావేశంలో ఈమేరకు కీలకనిర్ణయం తీసుకున్నారు. ప్రాజెక్టుల సవరించిన పరిపాలనా అంచనాలకు క్యాబినెట్ ఆమోద ముద్ర వేసింది. శ్రీకాకుళంజిల్లాలోని బుడగట్లపాలెంతోపాటు అనకాపల్లి జిల్లా పూడిమడక, ప్రకాశంజిల్లా కొత్తపట్నం హార్బర్ల నిర్మాణానికి గతంలో ఆగస్టు19, 2021న ప్రభుత్వం రూ.1150.79కోట్లతో పరిపాలనా ఆమోదం ఇచ్చింది. అయితే ప్రాజెక్టుల తాజా అవసరాలు,ఆధునిక సదుపాయాల కల్పన దృష్ట్యా ఈ మూడు హార్బర్లకు కలిపి మొత్తం సవరించిన అంచనా వ్యవయం రూ.1586.69 కోట్లకు తాజా మంత్రి మండలి సమావేశంలో ఆమోదం తెలిపారు. దీంతో ముఖ్యంగా బుడగట్లపాలెం హార్బర్ నిర్మాణంతో మత్స్యకారుల కష్టాలకు శాశ్వత పరిష్కారం లభించనుంది. మత్స్యకారులకు అత్యంత అవసరమైన ఆధునిక ల్యాండింగ్, పడవలు నిలుపుకొ నేందుకు(బెర్తింగ్) సురక్షితమైన సౌకర్యాలు అందుబాటులోకి రానున్నాయి.సముద్రంలో వేట మరింత సులభతరం అవ్వడంతోపాటు జిల్లాలో చేపల ఉత్పత్తి గణనీయంగా మెరుగుపడుతుంది. ఈ మూడు ప్రాజెక్టుల ద్వారా సుమారు 2,530ఫిషింగ్ నౌకలకు మద్దతు లభిస్తుంది.తద్వారా 12,700 మందికి పైగా మత్స్యకారులకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి, జీవనోపాధి అవకాశాలు మెరుగుపడతాయి. ఉపాధి కోసం గుజరాత్, చెన్నై వంటి ఇతర ప్రాంతాలకు వలస వెళ్లే జిల్లా మత్స్యకారులకు బుడగట్టపాలెం హార్బర్ నిర్మాణంతో స్థానికంగానే ఉపాధి లభించనుంది.



# విద్యార్థినిలపై లైంగిక వేధింపులు.. ఉద్యోగులపై సస్పెన్షన్ వేటు

విజయవాడ(చైతన్యరథం): డాక్టర్ నోరి రామశాస్త్రి ప్రభుత్వ ఆయుర్వేద వైద్య కళాశాలలో విద్యార్థినిలపై లైంగిక వేధింపుల ఘటనను కూటమి ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. ఈ మేరకు బాధ్యులపై వైద్యారోగ్య శాఖ చర్యలకు ఉపక్రమించింది. మెడికల్ ఆఫీసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ డి.మౌళి నాయక్, ల్యాబ్ టెక్నీషియన్ కె.వి.సుబ్రహ్మణ్యంపై సస్పెన్షన్ వేటు వేసిం ది. అలాగే విధుల నిర్వహణలో బాధ్యతారాహిత్యంగా వ్యవహ రించిన కళాశాల ప్రిన్సిపల్ కె.నిర్మలా జ్యోతిబాయి, పీఎస్పీ విభా గానికి చెందిన ప్రొఫెసర్ కె.విజయకుమారిని ప్రభుత్వానికి సరెండర్ చేశారు. ఈ వివరాలను ఆయుష్ ఇన్‌ఛార్జ్ కమిషనర్ రోణంకి గోపాలకృష్ణ వెల్లడించారు. అలాగే లైంగిక వేధింపులకు సంబంధించి కళాశాలలో అంతర్గతంగా విచారణ చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. లైగింక వేధింపుల ఘటనపై ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశాకు లేఖ రాసినట్లు రోణంకి వెల్లడించారు. ఆ లేఖలో స్వతంత్ర కమిటీ ద్వారా విచారణ జరిపించాలని లక్ష్మీశా ను కోరినట్లు కమిషనర్ రోణంకి గోపాలకృష్ణ తెలిపారు.

# రీ సర్వే మాటున వైసీపీ నేతల భూ దందా

- గ్రీవెన్స్‌లో తిమ్మసముద్రం గ్రామవాసి ఫిర్యాదు
- చేతబడి నెపంతో మా కుటుంబంపై వేధింపులు... న్యాయం చేయాలని వినతి
- రెవెన్యూ రికార్డుల మాయాజాలం... సంబంధం లేని వ్యక్తికి అక్రమంగా భూమి కట్టబెట్టే కుట్ర
- అసైన్డ్ భూమిలో అక్రమంగా వెంచర్లు.. బరితెగించిన రియల్టర్లు
- అర్జీలు స్వీకరించిన కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, ఏపీ వడ్డెర వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్లెల ఈశ్వరరావు
- సమస్యల పరిష్కారానికి కృషి చేసిన నేతలు



మంగళగిరి (చైతన్యరథం): మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో శనివారం ప్రజా వినతుల పరిష్కార వేదిక నిర్వహించారు. రాష్ట్రం నలుమూలల నుంచి విచ్చేసిన వారి నుంచి రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, ఏపీ వడ్డెర వెల్ఫేర్, డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్లెల ఈశ్వరరావు వినతులు స్వీకరించి వాటి పరిష్కారానికి కృషి చేశారు.

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా జలదంకి మండలం తిమ్మసముద్రం గ్రామానికి చెందిన వెంకటసురేష్ అర్జీ... 1993 సంవత్సరంలో ప్రభుత్వ అధికారులు నా తండ్రి శ్రీనివాసులుకి సర్వే నెం.40-1లో 2.34 ఎకరాలు (సెంట్లు), సర్వే నెం.658-1లో 1.03 ఎకరాలు భూమిని అసైన్డ్‌మెంట్ పట్టా కింద మంజూరు చేసి పట్టాదారు పాస్ పుస్తకం కూడా ఇచ్చారు. అప్పటి నుంచీ మా కుటుంబం ఆ భూమిని సాగు చేసుకుంటోంది. నా తండ్రి మరణానంతరం ఆ భూమి నా తల్లి తోటకూర జయలక్ష్మి పేరిట రెవెన్యూ రికార్డుల్లో నమోదైంది. 2023లో జరిగిన రీ సర్వేలో స్థానిక వైపీపీ నాయకులు రాజకీయ కక్షతో నా కుటుంబాన్ని ఇబ్బంది పెట్టాలని అధికారులపై ఒత్తిడి తెచ్చారు. దీంతో అధికారులు ఉద్దేశపూర్వకంగా.. 40-1 సర్వే నెంబర్‌లో ఉన్న 2.34 ఎకరాల భూమికి సంబంధించిన ఎల్‌పీఎం నెంబరు 2827ను.. పక్కనే ఉన్న 40-2 సర్వే నెంబరుకు చెందిన దివి మాల్యాద్రి, దివి సుబ్బరత్నం పేరిట తప్పుగా నమోదు చేశారు. దివి మాల్యాద్రి, సుబ్బరత్నం కావలి పట్టణంలో నివాసం ఉంటారు. వారెప్పుడూ ఆ పొలం (40-2) వద్దకు రాలేదు. కానీ రీ సర్వే రికార్డుల్లో మా పేరు రావడంతో వారు ఆ అసైన్డ్ భూమిని దానికి దక్షిణాన ఉన్న ఓ నగల వ్యాపారికి చట్టవిరుద్ధంగా అమ్మేశారు. ఆ నగల వ్యాపారి ఆ భూమిని తన పొలంలో కలుపుకోవడానికి దౌర్జన్యానికి దిగాడు. కావలికి చెందిన గంజాయి స్మగ్లర్ గంధం ప్రసన్నాంజనేయులు... అతడి అనుచరులను రంగంలోకి దించి.. మా భూమిలో (40-1లో) వేసిన పంటను జేసీబీతో అత్యంత దారుణంగా నాశనం చేయించాడు. దీనిపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి న్యాయం జరగలేదు. కావున వారిపై చర్యలు తీసుకుని సమస్యను పరిష్కరించాలని విన్నవించాడు.

పోలవరం జిల్లా గంగవరం మండలం లొద్ది పాలేనికి చెందిన నాగమణి వినతి... మా గ్రామానికి చెందిన బూరుగు నూకరాజు ఆత్మహత్య చేసుకుంటే దానికి నేను చేసిన చేతబడే కారణమని అతని కుటుంబ సభ్యులు (పుల్లయ్యదొర, అప్పలకొండ) దుష్ప్రచారం మొదలుపెట్టారు. గ్రామంలో ఏ అరిష్టం జరిగినా నాపైనే నిందలు వేస్తూ మానసిక, భౌతిక దాడులకు దిగుతున్నారు. ఉపాధిహామీ పనులు, వ్యవసాయ పనులకు వెళ్లకుండా గొడవలు చేసి అడ్డుకున్నారు. చివరకు రొయ్యల ఫ్యాక్టరీలో పనిలో చేరితే అక్కడ కూడా యాజమాన్యానికి తప్పుడు సమాచారం ఇచ్చి పనిలో నుంచి తీయించారు. శుభకార్యాలకు వెళ్లనివ్వకుండా సామాజిక బహిష్కరణ చేశారు. మా కుటుంబం నిర్మించుకున్న గంగలమ్మ గుడిలో క్షుద్ర పూజలు చేస్తున్నారనే నెపంతో ఆ గుడిని తగులబెట్టారు. కూతురి పెళ్లి కోసం చేసిన రూ.6లక్షల అప్పు తీర్చడానికి ఉన్న భూమిని కుదవపెడదామన్నా ఎవరూ రాకుండా అడ్డుకుంటున్నారు. దీనిపై పలుమార్లు పోలీసులకు ఫిర్యాదుచేసినా ఎలాంటి న్యాయం జరగలేదు.

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరుజిల్లా వేదాయపాళేనికి చెందిన శిరీష అర్జీ... నెల్లూరు రూరల్ మండల పరిధిలోని నెల్లూరు బిట్-1, సర్వే నెం.1903/2లో గ్రామ సమిష్టి కింద మొత్తం 185.64 ఎకరాల భూమి ఉంది. ఇందులో పాపసాని వెంకటసుబ్బానాయుడు వాటా (1 1/2 భాగం) కింద 13.10 ఎకరాలు ఉండగా.. ఆయన తమ్ముడు పాపసాని మస్తాన్‌నాయుడు వాటా కింద 6.55 ఎకరాల భూమి వచ్చింది. ఈ మస్తాన్‌నాయుడు వాటాలోని 6.55 ఎకరాల వ్యవసాయ భూమిని ఆయన కుమారులు పాపసాని పిచ్చయ్యనాయుడు, పాపసాని రాధాకృష్ణయ్య నాయుడు 1971 మార్చి 15న నా తండ్రి నెట్టెం వెంకయ్యకి 'విక్రయ స్వాధీన పత్రం' ద్వారా విక్రయించారు. అప్పటి నుంచీ ఆ 6.55 ఎకరాల భూమి పూర్తిగా మా అనుభవంలోనే ఉంటూ వస్తోంది. 2008 జనవరి 4న నా తండ్రి వెంకయ్య మరణించారు. అనంతరం ఆ భూమికి చట్టబద్ధమైన వారసురాలిగా నా పేరిట పట్టా చేయాలని నెల్లూరు రూరల్ తహసీల్దారు కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నాను. అయితే నెల్లూరు రూరల్ తహసీల్దారు నాకు పట్టా ఇవ్వకుండా నిరాకరిస్తున్నారు. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే... ఈ భూమితో ఏమాత్రం సంబంధం లేని తూమాటి సరోజనమ్మ అనే మహిళకు అక్రమంగా పట్టా కట్టబెట్టేందుకు అధికారులు తెర వెనుక ఏర్పాట్లు చేశారు. దీనిపై నేను రెవెన్యూ అధికారులకు ఎన్నిసార్లు అర్జీలు పెట్టుకున్నా ఎవరూ సమాధానం ఇవ్వట్లేదు. కనీసం పట్టించుకోవట్లేదు.

గుంటూరు జిల్లా వట్టిచెరుకూరు మండలం వింజనంపాడుకు చెందిన నాగేశ్వరరావు విన్నపం... 1973 డిసెంబరు 12న అప్పటి గుంటూరు తహసీల్దారు పీవీ కృష్ణారెడ్డి (=ఎ. చీశీ. దీ3-6482/93 ఉత్తర్వుల ప్రకారం) నా తండ్రి నిరుపేద అయిన గోగుల నరసయ్యకు విజనంపాడు పరిధిలో 25 సెంట్ల పోరంబోకు భూమిని అసైన్‌మెంట్ కింద మంజూరు చేశారు. నాటి నుంచి నా తండ్రి ఆ భూమిని సాగు చేసుకుంటూ వచ్చారు. 1980లో ఆయన మరణానంతరం వారసులమైన నా సోదరులు, సోదరి ఆ భూమిలో వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాం. 2020లో మా వ్యవసాయ భూమి పక్కన ఉన్న పొలాన్ని కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు వెంచర్‌గా వేసి ప్లాట్లుగా మార్చారు. ఈ క్రమంలో మా కుటుంబ భూమిపై కన్నేసిన ఆ అక్రమార్కులు దౌర్జన్యంగా 25 సెంట్ల భూమిని ఆక్రమించుకున్నారు. ఏకంగా మా వ్యవసాయ భూమిలోనే రోడ్లు వేసి, పైపులైన్లు ఏర్పాటుచేసి మమ్మల్ని పొలంలోకి అడుగుపెట్టనివ్వకుండా, వ్యవసాయం చేసుకోనివ్వకుండా అడ్డుకుంటున్నారు. దీనిపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి న్యాయం జరగలేదు.

అన్నమయ్య జిల్లా పెద్దతిప్పసముద్రం మండలం పులికల్లుకు చెందిన చంద్రశేఖర్‌రెడ్డి అర్జీ... మా గ్రామ పరిధిలో సర్వే నెం.90-5, 89-4, 88-1ల్లో వారసత్వ భూమి ఉంది. అన్నదమ్ముల భాగ పంపకాల్లో భాగంగా నాకు సర్వే నెం.90-5 లో 0.28 సెంట్లు, 89-4లో 0.23 సెంట్లు రాగా, అన్న వెంకటరమణారెడ్డికి 90-5 లో 0.08 సెంట్లు, 89-4 లో 0.06 సెంట్లు, 88-1 లో 0.37 సెంట్లు వచ్చాయి. మేము ఈ భూమిని ఏళ్ల తరబడి సాగు చేసుకుంటున్నాం. అయితే సర్వే నెం.88-1లో ఎలాంటి హక్కు, సంబంధం లేని మబ్బు అంజనమ్మ, మబ్బు సిద్ధారెడ్డి తదితరులకు రీ సర్వేలో ఏకంగా ఞావీ చీశీ. 2015 ద్వారా భూమిని కేటాయించారు. ఈ తప్పిదం కారణంగా అసలైన హక్కుదారుల భూమికి కోత పడింది. సర్వే నెం.90-5లో 0.28 సెంట్లకు బదులు 0.17.7 సెంట్లు, సర్వే నెం.89-4లో 0.23 సెంట్లకు బదులు 0.18 సెంట్లు మాత్రమే ఆన్‌లైన్ చేశారు. మొత్తంగా 0.15 సెంట్లు నష్టపోయాం. సర్వే నెం.90-5లో 0.08 సెంట్లకు బదులు 0.17.8 సెంట్లు, సర్వే నెం. 88-1లో 0.37 సెంట్లకు బదులు 0.17.10 సెంట్లు నమోదు చేశారు. మొత్తంగా 0.11.4 సెంట్లు నష్టపోయాం.


నంద్యాల జిల్లా శిరివెళ్ల మండలం వీరారెడ్డిపల్లెకి చెందిన కోటిరెడ్డి వినతి... మాకు సంబంధించిన భూమిలో 'కుంట' ఉందనే సాకుతో రెవెన్యూ అధికారులు మా దరఖాస్తును ఉద్దేశపూర్వకంగా తిరస్కరిస్తున్నారు. వాస్తవానికి ఆ భూమిలో ఎలాంటి కుంట లేదు. ఈ విషయాన్ని ధ్రువీకరిస్తూ గతంలో స్వయంగా తహసీల్దారే లిఖితపూర్వకంగా స్టేట్‌మెంట్ కూడా ఇచ్చారు. కుంట లేదని రిపోర్ట్ ఇచ్చినప్పటికీ ఇప్పుడు అదే రెవెన్యూ శాఖ కుంట ఉందనే నెపంతో దరఖాస్తు తిరస్కరిస్తున్నారు. దీనిపై పలుమార్లు రెవెన్యూ అధికారుల చుట్టూ తిరిగినా న్యాయం జరగలేదు.

తిరుపతి జిల్లా డక్కిలి మండలం చాకలపల్లి గ్రామానికి చెందిన నారాయణ అర్జీ... సర్వే నెం.070-పిలో గల 21 ఎకరాల ఈనాం భూమి చుట్టూ వివాదం ముదిరింది. ఏళ్ల క్రితం వెంకటగిరి సంస్థానం వారు ఈ భూమిని గెరిటి వెంకటయ్య మా తాతకి ఈనాంగా ఇచ్చారు. నెల్లూరు అధికారులు దీనిపై విచారణ జరిపి నా తండ్రి గెరిటి పెంచలయ్య, సాటోకోటి రమణయ్య పేరిట జాయింట్ పట్టా మంజూరు చేశారు. అప్పటి నుంచీ పెంచలయ్య ఈ భూమిపై సర్వ హక్కులూ కలిగి సాగు చేసుకునేవారు. అయితే నా తండ్రి పెంచలయ్య అనారోగ్యంతో మరణించిన తర్వాత నేను ఆ భూమిని సాగుచేస్తుండగా.. సంగన్నపల్లి గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు దౌర్జన్యంగా ప్రవేశించి ఆక్రమించుకున్నారు. ఈ కబ్జాపై గతంలో ఉన్న తహసీల్దారు స్పందించి డక్కిలి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కానీ పోలీసులు ఎలాంటి చర్యలూ తీసుకోకపోవడంతో అక్రమార్కులు రెచ్చిపోయారు. ఇటీవల జిల్లా అధికారుల దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లగా, మండల స్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో పూర్తి విచారణ జరపకుండా వారికి తోచిన విధంగా తప్పులతడక నివేదికలు పంపుతున్నారు.

మార్కాపురానికి చెందిన సుబ్బలక్ష్మి వినతి... సర్వే నెం.675/1లో మొత్తం 66 సెంట్ల భూమి కొనుగోలు చేశాం. అప్పట్లో నా భర్త పేరిట 33 సెంట్లు, నా పేరిట 33 సెంట్లు చొప్పున రిజిస్ట్రేషన్ చేయించుకున్నాం. అయితే కొన్నేళ్ల క్రితం నా భర్త మరణించారు. చట్టప్రకారం ఆ మొత్తం 66 సెంట్ల భూమికి నేనే ఏకైక వారసురాలు, సర్వహక్కురాలు అయ్యాను. ఇదే అదనుగా భావించిన కొండయ్య, వెంకటరెడ్డి తదితరులు నా భూమిలోకి ప్రవేశించి దౌర్జన్యంగా ఆక్రమించుకున్నారు. అంతే కాకుండా అధికారులను తప్పుదోవ పట్టించి రెవెన్యూ రికార్డుల్లో కూడా వారి పేర్లు నమోదు చేయించుకున్నారు. దీనిపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి న్యాయం జరగలేదు.

వైఎస్సార్ కడప జిల్లా ప్రొద్దుటూరు మండలం కొత్తపల్లె గ్రామానికి చెందిన పుల్లయ్య అర్జీ... మా తాత మొలక లింగడు కుటుంబం గతంలో నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ మండలం బాచేపల్లె గ్రామంలో నివాసం ఉండేది. ఆర్ఎస్ఆర్ రికార్డుల ప్రకారం.. బాచేపల్లె గ్రామ పరిధిలోని సర్వే నెం.85లో మా తాత పేరిట 2.29 సెంట్ల (ఎకరాల) పట్టా భూమి ఉంది. ఆయన బతికున్న కాలంలో ఆ భూమిని సాగు చేసుకునేవారు. ఆయన మరణానంతరం ఆర్థిక ఇబ్బందుల కారణంగా మాకుటుంబం అక్కడి నుంచి వలస వెళ్లి కడప జిల్లాలో స్థిరపడింది. మా కుటుంబం ఊరు విడిచి వలస వెళ్లడాన్ని ఆసరాగా చేసుకున్న 'బొందెల నరసింహుడు అనే వ్యక్తి ఆ భూమికి తప్పుడు దస్తావేజులు సృష్టించి, దౌర్జన్యంగా ఆక్రమించుకున్నాడు. ఈ విషయం తెలుసుకుని నా భూమి అప్పగించాలని కోరగా కబ్జాదారుడు దౌర్జన్యానికి దిగుతున్నాడు. దీనిపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా న్యాయం జరగలేదు.

పై వీటితో పాటు పలువురు పింఛన్, రేషన్, ఇళ్ల నిర్మాణాల సమస్యలపై అర్జీలు ఇచ్చి పరిష్కరించాలని కోరారు. మరికొందరు ఉద్యోగాల కోసం రెస్యూమ్ ఇచ్చారు. అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నాం ఆర్థిక తోడ్పాటు కల్పించాలని మరికొందరు అభ్యర్థనలు అందించారు.



# ఆడబిడ్డలు సొంత కాళ్లపై నిలబడాలనే లక్ష్యంతో డ్వాక్రా స్థాపన

● రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



నిమ్మాడ (చైతన్యరథం): మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించి సొంత కాళ్లపై నిలబడాలనే లక్ష్యంతో డ్వాక్రా సంఘాలను స్థాపించారని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో ఏర్పడిన ఈ సంఘాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని ఆయన అన్నారు. జిల్లా గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో నిమ్మాడ క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో నాలుగు మండలాలకు చెందిన 180 మంది విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్లకు 5జీ మొబైల్ ఫోన్లను మంత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... ప్రభుత్వ కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. డ్వాక్రా మహిళలకు వెన్నుదన్నుగా కూటమి ప్రభుత్వం ఉంటుందని అన్నారు. ప్రభుత్వం మీపై పెట్టిన బాధ్యతను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. విధినిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని, ప్రతి ఒక్కరు నిర్దిష్ట జాబ్ చార్ట్ ప్రకారం పని చేయాలని స్పష్టం చేశారు. డ్వాక్రా సంఘాలు మహిళల ఆర్థిక పురోగతికి కీలకంగా నిలిచాయని, ఈ వ్యవస్థపై తనకు ప్రత్యేకమైన గౌరవం ఉందని మంత్రి పేర్కొన్నారు. మహిళలు పొదుపు సంఘాల ద్వారా ఆర్థిక స్వావలంబన సాధించడం గర్వకారణమని అన్నారు. అలాగే, ఈ 5జీ ఫోన్ల ద్వారా ఆయా స్వయం సహాయక సంఘాల డేటా, పొదుపులు, రుణాల వివరాలు మరియు ప్రభుత్వ పథకాల సమాచారాన్ని వేగంగా నిర్వహించగలరని తెలిపారు. డ్వాక్రాతో మహిళల ఆర్థిక ప్రగతికి బాటలు వేశామని అన్నారు, గ్రామ సంఘాలను మరింత బలోపేతం చేయాలని, మహిళల ఆర్థికాభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు పి.భానుమతి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

# విద్యలో విప్లవాత్మక మార్పులు..

## ప్రభుత్వ బడులకు నూతన ఊపిరి

●పేద విద్యార్థుల ప్రతిభకు రాష్ట్ర స్థాయి గుర్తింపు

●100 యాక్షన్ ప్లాన్‌తో మంచి ఫలితాలు

●హర్షం వ్యక్తం చేసిన టీడీపీ అధ్యక్షుడు కిమిడి నాగార్జున



విజయనగరం (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్‌లో విద్యా రంగాన్ని సమగ్రంగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పని చేస్తున్నారని విజయనగరం జిల్లా టీడీపీ అధ్యక్షులు కిమిడి నాగార్జున అన్నారు. విజయనగరం జిల్లా డీసీసీబీ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగార్జున మాట్లాడుతూ సంస్కరణలతో ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేట్ స్థాయికి తీసుకెళ్లే దిశగా విద్యాశాఖ మంత్రి లోకేష్ కార్యాచరణ ప్రారంభించినట్లు వెల్లడించారు. ప్రభుత్వ బడుల్లో చదువుతున్న పేద విద్యార్థులు ప్రతిభ కనబరిస్తే వారికి రాష్ట్ర స్థాయిలో గుర్తింపు కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేశారని తెలిపారు. ప్రముఖ పత్రికలు అయిన ఈనాడు, ఆంధ్రజ్యోతి వంటి పత్రిక వేదికలు ద్వారా వారి ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల ప్రతిభను ప్రజలకు తెలియజేయటం సంతోషంగా ఉంది అని అన్నారు. పాఠశాలల్లో "100 రోజులు యాక్షన్ ప్లాన్" అమలు చేసి విద్యార్థుల ప్రతిభను ఉన్నత శిఖరాలకు చేర్చేలా లోకేష్ చర్యలు తీసుకున్నారని పేర్కొన్నారు. మౌలిక వసతులు, బోధనా ప్రమాణాలు, సాంకేతిక వనరులు---all in one విధంగా అభివృద్ధి చేస్తున్నారని వివరించారు. మధ్యాహ్న భోజన పథకాన్ని మరింత బలోపేతం చేసి, డొక్కా సీతమ్మ వంటి మహనీయుల సేవా స్ఫూర్తితో విద్యార్థులకు నాణ్యమైన పోషకాహారం అందిస్తున్నామని తెలిపారు. పోషకాహార లోపం లేకుండా ప్రత్యేక మెనూలు అమలు చేస్తున్నామని వెల్లడించారు. ఉపాధ్యాయుల బదిలీల్లో పూర్తి పారదర్శకత పాటిస్తూ, సీనియారిటీ మరియు మెరిట్ ఆధారంగా మంత్రి లోకేష్ ట్రాన్స్ఫర్లు చేపట్టారని నాగార్జున స్పష్టం చేశారు. అలాగే రిటైర్ అయిన ఉపాధ్యాయులకు పెండింగ్ బెనిఫిట్స్ సకాలంలో చెల్లించే విధంగా చర్యలు తీసుకున్నారని తెలిపారు. ఉపాధ్యాయులపై ఎటువంటి యాప్‌ల భారం తగ్గిస్తూ, అనవసర టార్గెట్లను తొలగించి బోధనపై దృష్టి పెట్టేలా అనుకూల వాతావరణం కల్పించారని పేర్కొన్నారు. గురువు గౌరవమే విద్యా వ్యవస్థకు బలమని, వారి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది అని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలే భవిష్యత్తు భారత్‌కు బలమైన పునాది. ప్రతి విద్యార్థి ఎదగాలి, అదే లోకేష్ ధ్యేయం అని నాగార్జున పేర్కొన్నారు.

# మండే ఎండల్లో చల్లని కబురు...

# వచ్చే మూడు రోజులు తెలుగు రాష్ట్రాల్లో వర్షాలు



అమరావతి (చైతన్యరథం): తెలుగు రాష్ట్రాల్లో ఎండలు మండిపోతున్నాయి.. రోజురోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.. ఓ వైపు వేడి.. మరోవైపు ఉక్కపోతతో జనం అల్లాడిపోతున్నారు. ఈ క్రమంలోనే ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో వాతావరణ పరిస్థితులపై వాతావరణ శాఖ కీలక అప్డేట్ ఇచ్చింది. తీవ్రమైన ఎండల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. అమరావతి వాతావరణ కేంద్రం ప్రకారం.. ఉత్తర-దక్షిణ ద్రోణి,/గాలులు అంతరాయం, పశ్చిమ రాజస్థాన్ పై గల ఉపరితల ఆవర్తనం నుండి తూర్పు రాజస్థాన్, మధ్యప్రదేశ్, విదర్భ, తెలంగాణ, రాయలసీమ, అంతర తమిళనాడు మీదుగా కొమోరియన్ ప్రాంతం వరకు సగటు సముద్ర మట్టానికి 0.9 కి.మీ. ఎత్తులో విస్తరించి ఉన్నది. నిన్నటి దక్షిణ ఒడిశా నుండి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు మీదుగా మన్నార్ గల్ఫ్ వరకు సగటు సముద్ర మట్టానికి 0.9 కిలోమీటర్ల ఎత్తులో ఉన్న ద్రోణి/గాలి అంతరాయం ఇప్పుడు బలహీనపడింది.

**ఉత్తర కోస్తా ఆంధ్రప్రదేశ్ - యానాం**

శనివారం, ఆదివారం తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశముంది. ఉరుములతో కూడిన మెరుపులు - ఈదురు గాలులు గంటకు 50 -- 60 కిలోమీటర్ల వేగముతో వీచే అవకాశముంది. వేడి, తేమ, అసౌకర్యమైన వాతావరణ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉంది. సోమవారం తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు కొన్ని చోట్ల కురిసే అవకాశముంది. ఉరుములతో కూడిన మెరుపులు, ఈదురు గాలులు గంటకు 40-50 కిలోమీటర్ల వేగముతో వీచే అవకాశముంది. వేడి, తేమ, అసౌకర్యమైన వాతావరణ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉంది. శనివారం, ఆదివారం తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశముంది. ఉరుములతో కూడిన మెరుపులు మరియు ఈదురు గాలులు గంటకు 30-40 కిలోమీటర్ల వేగముతో వీచే అవకాశముంది. వడగాలులు ఒకటి లేదా రెండు చోట్ల వీచే అవకాశముంది. సోమవారం తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశముంది. ఉరుములతో కూడిన మెరుపులు, ఈదురు గాలులు గంటకు 30-40 కిలోమీటర్ల వేగముతో వీచే అవకాశముంది. వేడి, తేమ, అసౌకర్యమైన వాతావరణ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉంది.

**రాయలసీమ**

శనివారం, ఆదివారం, సోమవారం తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశముంది. ఉరుములతో కూడిన మెరుపులు, ఈదురు గాలులు గంటకు 30-40 కిలోమీటర్ల వేగముతో వీచే అవకాశముంది. ఉత్తర కోస్తా ఆంధ్రప్రదేశ్, యానాం, రాయలసీమలో రాగల 7 రోజుల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదులో గణనీయమైన మార్పు లేదు.

# సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా : ఎమ్మెల్యే అదితి



అయ్యన్నపేట (చైతన్యరథం): శనివారం విజయనగరంలో నిర్వహించిన 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'లో ఎమ్మెల్యే పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతి రాజు స్వయంగా వినతులు స్వీకరించారు. అర్జీల పరిష్కారానికి తమవంతు బాధ్యతగా కృషి చేస్తామని చెప్పారు. వచ్చిన వినతులను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. మొత్తం 30 వినతులు వచ్చాయని ఎమ్మెల్యే తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న అన్ని పథకాలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

# విజయనగరం అర్బన్ తాహసీల్దార్ కార్యాలయం ప్రారంభం



అయ్యన్నపేట (చైతన్యరథం): స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలోని అన్న క్యాంటీన్ పక్కన కొత్తగా ఏర్పాటు చేసిన విజయనగరం అర్బన్ తాహసీల్దార్ కార్యాలయాన్ని ఎమ్మెల్యే పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడితో కలిసి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పెరిగిన పట్టణ జనాభాకు అనుగుణంగా రెవెన్యూ సేవలను విస్తరించాలన్న ఉద్దేశంతో కొత్తగా అర్బన్ తాహసీల్దార్ కార్యాలయాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దీనివల్ల ప్రజలకు రెవెన్యూ సేవలు మరింత చేరువ అవుతాయని పేర్కొన్నారు. అందుబాటులోకి వచ్చిన సేవలను ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. ప్రస్తుతం జనగణన జరుగుతున్న నేపథ్యంలో ఇక్కడ పూర్తిస్థాయిలో సేవలు అందుబాటులోకి రావడానికి సమయం పడుతుందని చెప్పారు.

# సమస్య పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నాం : ఎంపీ కలిశెట్టి



ఎచ్చెర్ల (చైతన్యరథం): ప్రజల వద్దకు పాలన దిశగా విజయనగరం పార్లమెంటు సభ్యులు కలిశెట్టి అప్పలనాయుడు ముఖ్య అతిథిగా శనివారం ఎచ్చెర్ల నియోజకవర్గం, ఎచ్చెర్ల మండలం, ధర్మవరం గ్రామ పంచాయతీలోని ఎచ్చెర్ల మండల టీడీపీ పార్టీ అధ్యక్షుడు బెండు మల్లేశ్వరరావు అధ్యక్షతన, ధర్మవరం టీడీపీ సీనియర్ నాయకులు రుప్పా రమేష్ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులతో క్యాడర్ మీటింగ్ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు మాట్లాడుతూ... ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు ప్రతి శుక్రవారం ప్రజాదర్బార్‌తో పాటు పార్టీ క్యాడర్ మీటింగ్ నిర్వహించడం జరుగుతూ వస్తుందని, కార్యకర్తే అధినేత అనే నినాదంతో పార్టీ బలోపేతానికి నిరంతరం అహర్నిశలు శ్రమిస్తున్న కార్యకర్తల సంక్షేమానికై, వారి అభ్యున్నతకై, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని అన్నారు. కార్యకర్తల కష్టం, శ్రమను పార్టీ, అధిష్ఠానం ఎప్పుడు గుర్తించుకుంటుందని, సమయం వచ్చినప్పుడు నా మాదిరిగా ఫలితాలు వస్తాయని దానికి తగ్గట్టు పార్టీ బలోపేతానికి కష్టపడి పని చేయాలన్నారు. కొద్ది రోజుల్లో జరగబోవు స్థానిక సంస్థల ఎన్నికలలో విజయకేతనం ఎగరవేసే దిశగా పనిచేయాలని, అందుకు తగ్గట్టుగా గ్రామాలలో కూటమి నాయకులతో సమన్వయం చేసుకొని 100% ఫలితాలు సాధించే విధంగా వ్యూహాలు అనుసరించి ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి కొరకై అమలుపరుస్తున్నటువంటి సూపర్ 6 పథకాలను, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల వద్దకు తీసుకెళ్లి ప్రభుత్వం చేస్తున్న మంచి పనులను ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.

జోన్ - 2
(కాకినాడ, అమలాపురం, నర్సాపురం, రాజమహేంద్రవరం, ఏలూరు)
చైతన్యరథం

# కాలువల పూడికతీతల కోసం రూ.397 కోట్లు విడుదల



పాలకొల్లు (చైతన్యరథం): నీటిపారుదల రంగంలో అత్యంత కీలకమైన కాలువల వ్యవస్థ నిర్వహణకు గాను రూ.397 కోట్లు విడుదల చేస్తూ జీవో ఇచ్చినట్లు జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. ఈ పనులన్నీ వచ్చే ఖరీఫ్‌కు ముందే పూర్తి చేసి తీరుతామన్నారు. ఐదేళ్ల జగన్ అరాచక పాలనలో కేవలం 200 కోట్లు మాత్రమే కాలువల నిర్వహణ, పూడికతీత వంటి పనులకు కేటాయించిన వైనాన్ని మంత్రి ఎండగట్టారు. కూటమి ప్రభుత్వం వచ్చిన 20 నెలల్లో ఓ అండ్ ఎం పనులకు రూ.1100 కోట్లు కేటాయించి అన్నదాతల పట్ల తమ బాధ్యత నెరవేర్చిందన్నారు. ఓ అండ్ ఎం నిధులతో తూడు, గుర్రపుడెక్క తొలగింపు, నీటి అడ్డంకులు తొలగింపు, పూడిక తీత పనుల కోసం ఖర్చు చేస్తారన్నారు. వెంటనే పనులు మొదలు పెట్టేలా సిఈ స్థాయి నుండి కింది స్థాయి అధికారులు చర్యలు చేపట్టాలని మంత్రి నిమ్మల ఆదేశించారు. సీజన్ మొదలయ్యేలోగా కాలువల పూడికతీత, తవ్వకం, తూడు, గుర్రపుడెక్క తొలగింపు వంటి అత్యవసర పనులు పూర్తి చేయాలని మంత్రి సూచించారు. రూ.10లక్షల లోపు పనులను సాగునీటి సంఘాల ఆధ్వర్యంలో నామినేషన్ పద్ధతిలో చేపట్టవచ్చు అని, రూ.10లక్షలు దాటిన పనులకు షార్ట్ టెండర్లు పిలిచి పనులు మొదలుపెట్టాలన్నారు. అలాగే గేట్లు, షట్టర్లు, వంటి మెకానికల్ పనులను తప్పనిసరిగా అసిస్టెంట్ ఇంజనీర్ పరిశీలించి, సక్రమంగా పనిచేసే స్థితిలో ఉన్నాయనే ధ్రువీకరణ పత్రాన్ని, చీఫ్ ఇంజనీర్‌కు ఇవ్వాలన్నారు. సాగు నీటి సంఘాల ఆధ్వర్యంలో, వారి పరిధిలోని పనులను, మే నెలాఖరుకు పూర్తిచేయాలని చెప్పారు.

# పది ఫలితాల్లో చరిత్ర సృష్టించిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు

**●ప్రభుత్వ పాఠశాలల్లో టాప్ ర్యాంకులు సాధించిన విద్యార్థినులకు ఎమ్మెల్యే రాము అభినందనలు**



గుడివాడ (చైతన్యరథం): మన ప్రభుత్వ పాఠశాలల ఆడబిడ్డలు ఈరోజు చరిత్ర సృష్టించారని పదో తరగతి పరీక్షల్లో అద్భుత విజయం సాధించారని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము హర్షం వ్యక్తం చేశారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నిరంతర పర్యవేక్షణ, సంస్కరణలు చక్కటి ఫలితానిచ్చాయనీ ఆయన పేర్కొన్నారు. గుడివాడ నియోజకవర్గంలో ఎస్‌ఎస్సీ ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థినులు సత్తా చాటారు. జిల్లా టాప్ ర్యాంకర్లను శనివారం ఉదయం రాజేంద్రనగర్‌లోని తన స్వగృహంలో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అభినందించారు. 592 మార్కులతో జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల్లో ప్రథమ స్థానం సాధించిన వి.అక్షిత, 591 మార్కులతో ద్వితీయ స్థానంలో నిలిచిన షేక్ జాస్మిన్, అమృత వర్షిని, 590 మార్కులతో తృతీయ స్థానం సాధించిన ప్రణీతను ఎమ్మెల్యే రాము మిఠాయిలు తినిపించారు. మన ప్రభుత్వ పాఠశాలల ఆడబిడ్డలు ఈరోజు చరిత్ర సృష్టించారని, జిల్లా స్థాయిలో టాప్ ర్యాంకులు సాధించడం మనందరికీ గర్వకారణమనీ ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాము అన్నారు. ఈ విజయం వెనుక విద్యార్థినుల కృషి, తల్లిదండ్రుల సహకారం, ఉపాధ్యాయుల పట్టుదల ఉందన్నారు. అన్నింటికీ మించి రాష్ట్రంలో విద్యావ్యవస్థను బలోపేతం చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, దార్శనికత, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నిరంతర పర్యవేక్షణ, సంస్కరణలు ఉన్నాయన్నారు. మంత్రి లోకేష్ ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన, డిజిటల్ క్లాస్ రూమ్‌లు, ఉపాధ్యాయులకు శిక్షణ, విద్యార్థులకు నాణ్యమైన బోధన అందేలా తీసుకుంటున్న చర్యల ఫలితమే ఈరోజు మన కళ్ల ముందు కనిపిస్తోందనీ, ఆయనకు నా తరపున, నియోజకవర్గ ప్రజల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు చెప్తున్నాను అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ స్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# నిబద్ధత గల నాయకుడ్ని కోల్పోయాం...
# వల్లభనేని బాబూరావు మృతి పట్ల వీరంకి గురుమూర్తి శ్రద్ధాంజలి



గుడ్లవల్లేరు (చైతన్యరథం): ఉమ్మడి కృష్ణా జిల్లా తెలుగుదేశం పార్టీ మాజీ అధ్యక్షులు, కృష్ణాజిల్లా గ్రంధాలయ సంస్థ మాజీ చైర్మన్, గుడ్లవల్లేరు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, గుడ్లవల్లేరు మిల్క్ సొసైటీ అధ్యక్షులు వల్లభనేని బాబురావు ఆకస్మిక మరణం చాలా బాధాకరమని కృష్ణా జిల్లా టీడీపీ అధ్యక్షుడు వీరంకి గురుమూర్తి వ్యాఖ్యానించారు. వల్లభనేని బాబురావు పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతున్ని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నానని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు వారి నివాసానికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని పరామర్శించి మనోధైర్యం చెప్పడం జరిగింది. కానీ తెల్లారేసరికి ఈ విషాద వార్త మనందరికీ తీరని లోటును మిగిల్చింది. నాకు ఆప్తులు అయిన బాబురావుని గత నెల మార్చి 2వ తేదీన వారి నివాసంలో కలిసిన ఆ క్షణాలు ఇంకా నా కళ్లముందే తిరుగుతున్నాయి. వారి ఆశయాలను కొనసాగించడం ద్వారానే ఆయనకు నిజమైన నివాళి అర్పించిన వారమవుతామని తెలియజేసుకుంటున్నాను.

# ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేటర్ స్థాయి విద్య : ఎమ్మెల్యే నసీర్



గుంటూరు (చైతన్యరథం): రాష్ట్ర వ్యాప్తంగా పదో తరగతి పరీక్ష ఫలితాలలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించటం సంతోషంగా ఉందని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనార్టీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. అంజుమన్ ఇస్లామియా పాఠశాలలో 10 పరీక్షల్లో విద్యార్థులు మంచి మార్కులు సాధించిన సందర్భంగా శనివారం అభినందన సభ ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే నసీర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రెండు దశాబ్దాలుగా అంజుమన్ ఇస్లామియా ద్వారా పాఠశాలలో ఉచిత విద్య అందిస్తున్నట్లు తెలిపారు. ఎల్ కేజీ నుంచి పదో తరగతి వరకు అత్యుత్తమ ప్రమాణాలతో విద్య అందిస్తూ కార్పొరేట్ కు దీటుగా ఫలితాలు సాధిస్తున్నామని చెప్పారు ఈ ఏడాది అన్ని ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకున్నామని అన్నారు. దీంతో అంజుమన్ పాఠశాలలో 60 మంది పదో తరగతి విద్యార్థులకుగాను 95% ఉత్తీర్ణత సాధించారని చెప్పారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలో 17 ప్రభుత్వ పాఠశాలల్లో 1123 మంది పదో తరగతి పరీక్షలకు హాజరు కాగా 84% ఉత్తీర్ణత సాధించారన్నారు 582 మార్కులతో ఇద్దరు 575 మార్కులతో పది మంది విద్యార్థులు మంచి ఫలితాలు సాధించారని చెప్పారు. వీరితో కలిసి ఎమ్మెల్యే స్వయంగా భోజనం చేసి అభినందించారు. అనంతరం ప్రతిభ చాటిన విద్యార్థులను సత్కరించి గిఫ్ట్‌లు అందించారు.

# ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ ఆధ్వర్యంలో అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట

**●హాజరైన డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు, కేంద్రమంత్రి శ్రీనివాస వర్మ, రాజ్యసభ సభ్యులు సత్యనారాయణ**



తణుకు (చైతన్యరథం): తణుకు మండలం వేల్పూరు గ్రామంలో 45 అడుగుల అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్టలో భాగంగా నిర్వహిస్తున్న కార్యక్రమాలు శనివారం రెండో రోజుకు చేరుకున్నాయి. తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ ఆధ్వర్యంలో జరుగుతున్న విగ్రహ ప్రతిష్ట మహోత్సవంలో భాగంగా శనివారం నిర్వహించిన కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్, ఉండి ఎమ్మెల్యే కనుమూరి రఘురామకృష్ణంరాజు, కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ, రాజ్యసభ సభ్యులు పాకా సత్యనారాయణ తదితరులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రఘురామకృష్ణంరాజు మాట్లాడుతూ రాముడికి ప్రియమైన భక్తుడిగా అభయాంజనేయ స్వామి వారి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో తాను పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. స్థానిక ఎమ్మెల్యే రాధాకృష్ణ నాయకత్వంలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు నియోజవర్గంలో జరగాలని ఆయన ఆకాంక్షించారు. అభయాంజనేయ స్వామి వారి విగ్రహంతో పాటు వాకింగ్ ట్రాక్ నిర్మాణం ఎంతో ఆహ్లాదాన్ని ఇస్తోందని చెప్పారు. స్థానిక ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ మాట్లాడుతూ వేల్పూరు గ్రామంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న అభయాంజనేయ స్వామి వారి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు కృతజ్ఞతలు తెలియజేశారు. అభయాంజనేయ స్వామి వారి ఆశీస్సులు నియోజకవర్గంలోని ప్రతి ఒక్కరి కుటుంబ సభ్యులపై ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులతో పాటు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వైసీపీ నుంచి టీడీపీలోకి భారీ వలసలు

**●జంగారెడ్డిగూడెం టౌన్‌లో 20 కుటుంబాల చేరిక**




జంగారెడ్డిగూడెం (చైతన్యరథం): ఏలూరు పార్లమెంటరీ పరిధిలోని చింతలపూడి నియోజకవర్గం జంగారెడ్డిగూడెం టౌన్‌లో 41, 71 బూత్‌లకు చెందిన సుమారు 20 కుటుంబాల వైసీపీ కార్యకర్తలు ఎమ్మెల్యే సొంగ రోషన్‌కుమార్ సమక్షంలో టీడీపీలో చేరారు. ఈ కార్యక్రమంలో ఫోకస్ బూత్ అబ్జర్వర్ పెన్మెత్స త్రినాథరాజు, టీడీపీ టౌన్ అధ్యక్షుడు కొండ్రెడ్డి కిషోర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**ముసునూరులో 20 కుటుంబాలు టీడీపీలో చేరిక**

ఏలూరు పార్లమెంటరీ పరిధిలోని నూజివీడు నియోజకవర్గం ముసునూరు గ్రామంలో వైసీపీకి చెందిన 20 కుటుంబాలు తెలుగుదేశం పార్టీలో చేరాయి. ఫోకస్ బూత్‌లు 82, 83 పరిధిలోని ఈ కుటుంబాల వారికి రాష్ట్ర సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి మార్గదర్శకత్వంలో టీడీపీ ముసునూరు మండల శాఖ అధ్యక్షుడు గద్దె రఘుబాబు, మండల శాఖ మాజీ అధ్యక్షుడు దేవినేని డెలారామ్ పసుపు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఫోకస్ బూత్ అబ్జర్వర్ శేషపు శేషగిరిరావు పర్యవేక్షణలో కార్యక్రమం సజావుగా జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులమై తాము టీడీపీలో చేరినట్టు కొత్తగా చేరిన వారు చెప్పారు. వారి చేరికతో ముసునూరు మండలంలో టీడీపీ మరింత బలపడిందని స్థానిక నాయకులు అభిప్రాయపడ్డారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే ఎజెండాగా ప్రజా దర్బార్



విజయవాడ (చైతన్యరథం): ఎంపీ కేశినేని శివనాథ్ ఆధ్వర్యంలో విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో ప్రజా దర్బార్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ జాతీయ ఉపాధ్యక్షులు బుద్ధా వెంకన్న పాల్గొని ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ప్రజలు అనేక రకాల సమస్యలు వారికి గత ప్రభుత్వంలో ఎదురైన ఇబ్బందులు భూ వ్యవహారాలు లాంటి సమస్యలు ఎన్నో పరిష్కారం కానీ సమస్యలతో ప్రజలు ప్రజా దర్బార్ కు వచ్చారు ఈ సందర్భంగా నాయకులు సమస్యలతో వచ్చిన ప్రజలకు ఎంపీ చిన్ని తరుపున భరోసా కల్పించారు. ప్రజలు గత ప్రభుత్వంలో ఇలాంటి వేవి లేవని ఎంపీ చిన్ని చొరవతో ఇలాంటి ప్రజా దర్బార్ లాంటి ప్రజా సమస్యల వేదిక ఏర్పాటు చేయడం గొప్ప విషయమని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## తలార్లపల్లి రోడ్డు పనులను పరిశీలించిన చీఫ్ విప్ జీవీ



వినుకొండ (చైతన్యరథం): నియోజకవర్గంలోని నూజెండ్ల మండలం, తాలార్లపల్లి సమీపంలో ఇటీవల వంతెన కూలిపోవడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు ఆదేశాల మేరకు ఆర్ అండ్ బి (R&B) అధికారులు యుద్ధప్రాతిపదికన ప్రత్యామ్నాయ రోడ్డు నిర్మాణ పనులను చేపట్టారు. శనివారం నాడు ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు స్వయంగా ఈ పనులను సందర్శించి, క్షేత్రస్థాయిలో పురోగతిని పరిశీలించారు. ప్రజలకు, వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా పనులను వేగవంతం చేసి, తక్షణమే రోడ్డును అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వినుకొండ మార్కెట్ యార్డ్ చైర్మన్ మీసాల మురళీ కృష్ణ యాదవ్‌తో పాటు పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

**ప్రజాదర్బార్ చేపట్టిన జీవీ**

వినుకొండ పట్టణం మున్సిపల్ కౌన్సిల్ హాల్ నందు శనివారం ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు ఆధ్వర్యంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజలు తమ సమస్యలను విన్నవించుకోగా, ఆయన వారితో నేరుగా మాట్లాడి వినతి పత్రాలను స్వీకరించారు. మౌలిక సదుపాయాల సమస్యలపై ప్రజలు ఫిర్యాదులు చేశారు. జీవీ అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా చూస్తామని, సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ప్రజల చెంతకు పాలనను చేర్చడమే తమ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.

## పదవ తరగతి టాపర్లకు విహారయాత్ర : ఎమ్మెల్యే గళ్ళా మాధవి



గుంటూరు (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ పాఠశాలలు, ప్రైవేట్ పాఠశాలలకు ఏ మాత్రం తీసిపోవని విద్యార్థులు నిరూపించారని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు. శనివారం గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలోని పలు ప్రభుత్వ పాఠశాలలో పదవ తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థి, విద్యార్థినులతో ఎమ్మెల్యే గళ్ళా మాధవి శనివారం తన క్యాంపు కార్యాలయంలో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను శాలువాలతో సత్కరించి అభినందించారు. గతంలో తాను ప్రకటించినట్లుగానే అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను త్వరలో విహారయాత్రకు తీసుకెళ్తున్నట్లు ఎమ్మెల్యే గళ్ళా మాధవి వెల్లడించారు. ఈ ప్రకటనతో విద్యార్థులు, తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ... ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు సాధించిన ఫలితాలు ఎంతో గర్వకారణమని పేర్కొన్నారు. గుంటూరు పశ్చిమలో 600 మార్కులకు 585, 586 వరకు మార్కులు సాధించిన విద్యార్థులు ఉండటం చాలా ఆనందంగా ఉందన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే పిల్లలు ఇంతటి ప్రతిభ కనబరచడం రాష్ట్ర విద్యా రంగంలో వచ్చిన సానుకూల మార్పుకు నిదర్శనమని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. ఈ విజయానికి రాష్ట్ర ఐటీ మరియు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చేపట్టిన 100 రోజుల యాక్షన్ ప్లాన్ ప్రధాన కారణమని పేర్కొన్నారు.

## పెడన టీడీపీలోకి 32 కుటుంబాలు చేరిక... స్వాగతించిన ఎమ్మెల్యే కాగిత



బంటుమిల్లి (చైతన్యరథం): మచిలీపట్నం పార్లమెంటరీ పరిధిలోని పెడన నియోజకవర్గం బంటుమిల్లి లో పెద్ద తుమ్మిడి గ్రామం బూత్ నెం.159,160, ములపర్రు గ్రామం బూత్ నెం.144, కృత్తివెన్ను మండలం కొమ్మలపూడి గ్రామం బూత్ నెం.177, పెడన రూరల్ మండలం కొంగవర్ల గ్రామంలో బూత్ నెం.73ల్లో వైసీపీకి చెందిన దాదాపు 32 కుటుంబాలు ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ సమక్షంలో టీడీపీ చేరాయి. కార్యక్రమంలో ఫోకస్ బూత్ అబ్జర్వర్ హోసింపిక్, మూడు మండలాల టీడీపీ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నమ్మినోళ్ళ పాలిట జగన్ విలన్ : టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎంఎస్ బేగ్



విజయవాడ (చైతన్యరథం): నమ్మినోళ్లను నట్టేట ముంచుతూనే చాప కింద నీరుల అవినీతి అంగానికి తెరదీసిన జగన్ నిజంగా రాష్ట్ర ప్రజలకు ఒక విలన్ అని తెదేపా రాష్ట్ర అధికార ప్రతినిధి ఎంఎస్ బేగ్ నిప్పులు చెరిగారు. జగన్‌ను రాష్ట్ర ప్రజానీకం విలన్‌గా భావించినందునే, వైకాపాను 11 సీట్లకు పరిమితం చేసిన విషయాన్ని ఈ సందర్భంగా బేగ్ ఉదాహరించారు. ఈ మేరకు బేగ్ ఒక పత్రిక ప్రకటన విడుదల చేశారు రాజధాని నిర్మాణములో భాగముగా భవనాల అద్దాలు, సభకుల కోసం చదరపు అడుక్కి ఎంతెంత ఖర్చు చేస్తున్నారని వైకాపా చేస్తున్న విమర్శలను ఆయన ఈ సందర్భంగా తిప్పి కొట్టారు. వైజాగ్ రుషికొండ ప్యాలెస్, తాడేపల్లి ప్యాలెస్, బెంగళూరు ప్యాలెస్ ల నిర్మాణ ఖర్చులకు సంబంధించి చదరపు అడుగుకి ఎంతెంత ఖర్చు చేశారు జగన్ కు చెప్పే దమ్ముందా అని బేగ్ ఈ సందర్భంగా సవాలు విసిరారు. మావిగన్ ప్రకటనకు సంబంధించి జగన్‌కు జనం నీరాజనాలు పలుకుతున్నారని వైకాపా చెబుతున్న అర్ధరహిత ఆర్భాటాలను ఆయన ఎద్దేవా చేశారు నిజంగా మావిగను ప్రకటన నిజమైతే వైకాపా తన హయాములో ఈ ప్రకటనను ఎందుకు తీసుకురాలేకపోయిందో చెప్పాలని నిలదీశారు. కల్తీ నెయ్యి, మద్యం, ఆడుదాంఆంధ్ర ఇలా అన్నింటిలోనూ అవినీతి అక్రమాల మరకలు ఇంకా కనిపిస్తూనే ఉన్నాయన్నారు. మరో 20 ఏళ్లు ఈ కూటమి ప్రభుత్వం ప్రజారాజక పాలనను కొనసాగించడం ఖాయమని బేగ్ ఈ సందర్భంగా జోశ్యం చెప్పారు.

## లోకేశ్ 100 రోజుల ప్రణాళిక పక్కా కార్యాచరణతోనే పదిలో అత్యుత్తమ ఫలితాలు : ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు




చిలకలూరిపేట (చైతన్యరథం): "పది ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలలు ఏటికేడు గణనీయమైన పురోగతి సాధించడం రాష్ట్ర విద్యావ్యవస్థ పనితీరుకు ప్రత్యక్ష నిదర్శనం. పేద, మధ్య తరగతి విద్యార్థులకు ఉత్తమ భవిష్యత్ అందించాలన్నదే విద్యాశాఖ మంత్రి లోకేశ్ జీవితాశయం. తాజాగా విడుదలైన పదోతరగతి ఫలితాలు.. విద్యార్థుల జీవితాలు మెరుగుపరచాలన్న మంత్రి లోకేశ్ మహోన్నత లక్ష్యసాధనలో తొలి విజయాన్ని అందించాయి. సర్కారీ బడులు, అక్కడి మౌలిక వసతులు, విద్యా బోధనపై ప్రజల్లోని అపోహలను తొలగించడంలో లోకేశ్ విజయం సాధించారు. తన ఆలోచనలతో కేవలం 100 రోజుల్లోనే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాప్రమాణాలను మెరుగుపరిచారు. కార్పొరేట్ పాఠశాలల్ని తలదన్నేలా తీర్చిదిద్దారు. లీప్ విధానంతో బోధనాంశాలతో పాటు.. బోధనేతర అంశాల్లోనూ అనూహ్య ఫలితాలు వచ్చేలా ప్రణాళికాబద్ధంగా వ్యవహరించారు. ప్రభుత్వ పాఠశాల్లో పేద, మధ్య తరగతి విద్యార్థుల ఉజ్వల భవిష్యత్ నిర్మాణ సమదాయాలుగా మార్చడంలో లోకేశ్ సఫలీకృతులయ్యారు. దినపత్రికల్లో తమ బిడ్డల ఫోటోలు చూసిన తల్లిదండ్రుల అవధుల్లేని ఆనందమే ... లోకేశ్ 100 రోజుల ప్రణాళిక యొక్క అద్భుత ఫలితానికి నిదర్శనం.

**ప్రజల సొమ్ముతో విలాసాలు చేసిన వారు.. ప్రజా రాజధాని నిర్మాణాన్ని తప్పుపట్టడం హాస్యాస్పదం**

కూటమి ప్రభుత్వంలో అమరావతి నిర్మాణ వ్యయం పెరిగిందంటున్న వైసీపీ ప్రచారం పూర్తిగా అవాస్తవం.. అభూత కల్పనల మయం. పెరిగింది నిర్మాణ ఖర్చు కాదు..వైసీపీ నేతల బుద్ధి మాంద్యం. ఐదేళ్ల రాష్ట్రాన్ని లూటీ చేసి, ప్రజల సొమ్ముతో విలాసాలు చేసిన వారు నేడు ఏ నిస్సిగ్గుగా ప్రజా రాజధాని నిర్మాణంపై దుష్ప్రచారం చేస్తున్నారు. అమరావతిపై తమ నరనరాన ఉన్న విద్వేషాన్ని, నిత్యం ఏదో విధంగా బయటకు వెళ్లగక్కనిదే వైసీపీనేతలకు నిద్రపట్టదు. రాజధాని పనుల్లో రోజురోజుకీ కనిపిస్తున్న పురోగతిని భరించలేకే వైసీపీ నేతలు మతిలేని నిరాధార ఆరోపణలు చేస్తున్నారు. ఐదేళ్లు ప్రజల సొమ్ముతో విలాసాలు చేసి, మూడుముక్కలాటతో రాష్ట్రాన్ని విచ్ఛిన్నం చేసిన వారు, రాజధానిపై మొసలి కన్నీరు కార్చడం హాస్యాస్పదం." అని శాసనసభ్యులు ప్రత్తిపాటి ఒక ప్రకటనలో స్పష్టంచేశారు.

## నాయకుడి పనితీరుకు నిదర్శనమే పదో తరగతి ఫలితాలు

**●టీడీపీ రాష్ట్ర కార్యదర్శి అంకెం ఇందిరా ప్రియదర్శిని**



మైలవరం (చైతన్యరథం): "సమర్ధవంతమైన నాయకుడు, నాయకత్వం ఉంటే విద్యా వ్యవస్థలో ఎలాంటి మార్పులు తీసుకురావచ్చో పదవ తరగతి ఫలితాలే నిదర్శనం" అని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి, రాష్ట్ర ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ అంకెం ఇందిరా ప్రియదర్శిని అన్నారు. శనివారం మైలవరం నియోజకవర్గంలోని టీడీపీ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు.. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తెలుగు రాష్ట్రాల్లో ప్రముఖ దినపత్రికల మొదటి పేజీలో ఇన్ని సంవత్సరాలుగా ప్రైవేటు విద్యా సంస్థల వార్తలే చూశాను. మెట్ట మొదటిసారిగా ప్రభుత్వ పాఠశాలల విజయాలు ముఖ్యాంశాలుగా నిలిచాయి. గవర్నమెంటు పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులు నలుగురు 596 మార్కులు సాధించడం ఎంతో గర్వకారణం. ప్రధాన దినపత్రికల్లో 'సగర్వంగా నిలబడి' అనే శీర్షికతో వార్తలు రావడం ఎంతో సంతోషంగా ఉంది. విద్యార్థులందరికీ శు భాకాంక్షలు, ఉపాధ్యాయులకు అభినందనలు" తెలిపారు. గత ప్రభుత్వంలో 72 % ఉత్తీర్ణత నుంచి, గత సంవత్సరం 81%కి, ఈ సంవత్సరం 85%కి పెరిగిందని అన్నారు. ఈ గొప్ప ఫలితాలకు కారణం మంత్రి నారా లోకేష్ విద్యా శాఖలో తీసుకున్న విప్లవాత్మక నిర్ణయాలే కారణమని అన్నారు.

## కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపిన... బ్రాహ్మణ చైతన్య వేదిక



అమరావతి (చైతన్యరథం): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మరియు కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లుగా తెదేపా సీనియర్ నేత, మాజీ బ్రాహ్మణ కార్పొరేషన్ కో-ఆర్డినేటర్, బ్రాహ్మణ చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు సిరిపురపు శ్రీధర్ శర్మ వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... దేశంలో ఎక్కడా లేని విధంగా భారతదేశం మొత్తంలో తొలిసారి పేద బ్రాహ్మణుల సంక్షేమం కోసం 2015లో బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ ఏర్పాటు చేసి దానికి అనుబంధంగా బ్రాహ్మణ కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ ప్రభుత్వ బ్రాహ్మణ కుల భాగస్వామ్యంతో ఏర్పాటు చేసిన సొసైటీలో కోపరేటివ్ సొసైటీ శాఖ నుంచి ఈ సొసైటీకి సీఈవోగా నాగ సాయి అనే వ్యక్తి 2017లో నియామకం జరిగినది. అప్పటి నుంచి 2026 నేటివరకు ఒకే చోట ప్రభుత్వ ఉద్యోగం చేస్తూ రెండు జీతాలు తీసుకుంటూ 9 సంవత్సరాల పాటు బ్రాహ్మణ కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీలో పేద, ఉన్నత వర్గాల బ్రాహ్మణులు దాచుకున్న సొమ్మును గత వైసీపీ జగన్ ప్రభుత్వంలో పందికొక్కు లాగా దోచుకున్నాడని భారీ స్థాయిలో అవినీతి చేశాడని, సాధారణంగా ప్రభుత్వ ఉద్యోగి ఎక్కడైనా మూడు సంవత్సరాల పాటే ప్రభుత్వ నిబంధనల ప్రకారం పని చేయాల్సి ఉంటుందని తర్వాత ట్రాన్స్ఫర్ జరుగుతుందని కానీ ఈ సీఈవో గత వైసిపి ప్రభుత్వ పార్టీ నేతల్ని కూడా ప్రలోభాలకు గురిచేసి ఇన్వేళ్లపాటు ఒకే చోట ఉద్యోగం చేసి రెండు జీతాలు తీసుకోవడం జరిగిందని, అవినీతి అక్రమాలపై ఎన్నో ఫిర్యాదులు తాము చేస్తున్నామని, కూటమి ప్రభుత్వం ఏర్పడిన నుండి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి, బీసీ వెల్ఫేర్ శాఖ మంత్రి సవితకు కూడా వ్రాతపూర్వక ఫిర్యాదులు అందజేయటం జరిగిందని శ్రీధర్ తెలియజేశారు. సీఈవో నాగసాయి బ్రాహ్మణ కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీలో చేసిన అవినీతిపై ఐఏఎస్‌తో కమిటీ వేసి ప్రభుత్వ ఆడిట్ జనరల్‌తో విచారణ చేయించాలని అప్పుడే అసలు విషయాలు, వాస్తవాలు వెలుగులోకి వస్తాయని, అతను చేసిన అవినీతి అక్రమాలపై తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కూటమి ప్రభుత్వాన్ని సిరిపురపు శ్రీధర్ కోరారు.

జోన్-4
(ఒంగోలు, నెల్లూరు, రాజంపేట, తిరుపతి, చిత్తూరు)
చైతన్యరథం

# సమిష్టి కృషితో మహానాడును విజయవంతం చేస్తాం

- నెల్లూరులో తొలిసారి మహానాడు... రంగంలోకి దిగిన టీడీపీ కీలక నేతలు
- 5 లక్షల మందితో బహిరంగసభ... వేదిక కోసం మంత్రి నారాయణ ఆధ్వర్యంలో టీడీపీ బృందం అన్వేషణ
- జిల్లా చరిత్రలో నిలిచిపోయేలా నిర్వహించేందుకు భారీ ఏర్పాట్లు



నెల్లూరు (చైతన్యరథం): తెలుగుదేశం పార్టీ ఏడాదికోసారి ప్రతిష్టాత్మకంగా నిర్వహించుకొనే మహానాడుకు తొలిసారి నెల్లూరు జిల్లా వేదిక కాబోతోంది. ఈనెల 27 నుంచి 3 రోజుల పాటు జరగనున్న మహానాడు వేదిక ఎంపిక కోసం మంత్రి నారాయణ, ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, ఎమ్మెల్సీ బీదా రవిచంద్ర, సీఎం ప్రోగ్రాం కోఆర్డినేటర్ మంతెన సత్యనారాయణ రాజు, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి, రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్, టీడీపీ రాష్ట్రస్థాయి నేత జయరామిరెడ్డి, ముఖ్యనేతలతో కూడిన టీడీపీ బృందం శనివారం కోవూరు, నెల్లూరు రూరల్ నియోజకవర్గాల్లో సుడిగాలి పర్యటన చేసింది. కోవూరులో 2, నెల్లూరు రూరల్ ప్రాంతంలో 2 కలిపి మొత్తం 4 కీలక ప్రదేశాలను వారు క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం మంత్రి నారాయణ మాట్లాడుతూ... పరిశీలించిన ప్రాంతాల నివేదికను సెంట్రల్ పార్టీ ఆఫీస్‌కు పంపుతామన్నారు. మరో 2 రోజుల్లో వేదికపై పూర్తి క్లారిటీ ఇస్తామని తెలిపారు. మహానాడుకు సుమారు 5 లక్షల మంది ప్రతినిధులు, కార్యకర్తలు వస్తారని అంచనా వేస్తున్నామన్నారు. సమన్వయం చేసుకొంటూ సమిష్టి కృషితో మహానాడును దిగ్విజయం చేస్తామన్నారు. **ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ...** మహానాడును తెలుగుజాతి పండుగగా అభివర్ణించారు. జిల్లా చరిత్రలో నిలిచిపోయేలా చేస్తామన్నారు. **రాష్ట్ర అధికారప్రతినిధి కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి మాట్లాడుతూ...** మహానాడును నెల్లూరులో నిర్వహించాలని నిర్ణయం తీసుకొన్న సీఎం చంద్రబాబు,యువనేత నారా లోకేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో మొదటిసారిగా మహానాడు జరుగుతుండటం తమ అదృష్టమని వక్ఫ్ బోర్డు చైర్మన్ అజీజ్ హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యమంలో ఎమ్మెల్సీలు బీదా రవిచంద్ర, సీఎం ప్రోగ్రాం కోఆర్డినేటర్ మంతెన సత్యనారాయణ రాజు, డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, జిల్లాపార్టీ ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# సింగరాయకొండ డీఎస్పీ ఆధ్వర్యంలో కార్డెన్ సెర్చ్




సింగరాయకొండ (చైతన్యరథం): ప్రకాశం జిల్లా సింగరాయకొండ మండలం పాత సింగరాయకొండలోని బాలిరెడ్డి నగర్ గిరిజన కాలనీలో శనివారం ఉదయం 6 గంటల నుంచి ఒంగోలు డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఇందులో భాగంగా సరైన ధ్రువపత్రాలు లేని సుమారు 20 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా గంజాయి, మత్తు పదార్థాలకు బానిసలు కావద్దని యువత, మహిళలు, విద్యార్థులకు సూచించారు. రహదారి నిబంధనలపై వాహనదారులకు అవగాహన కల్పించారు. చిన్నారులపై జరిగే అఘాయిత్యాలపై అప్రమత్తంగా ఉండాలని వారి తల్లిదండ్రులకు సూచించారు. ఏమైనా సమస్యలు ఎదురైతే 100, 112 హెల్ప్ లైన్ నంబర్లకు కాల్ చేసి ఆశ్రయం పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీఐ శ్రీహరి, ఒంగోలు డివిజన్ స్థాయి పోలీసులు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

# టీడీపీ కార్యాలయ పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి



ఒంగోలు (చైతన్యరథం): ఒంగోలు పార్లమెంట్ పార్టీ కార్యాలయం కోసం కేటాయించిన స్థలాన్ని చదును చేసే పనులను కనిగిరి నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ముక్కు ఉగ్రనరసింహారెడ్డి మాట్లాడుతూ... మొన్న జరిగిన క్యాబినెట్ మీటింగ్‌లో ప్రకాశం జిల్లా టీడీపీ కార్యాలయానికి ఆమోదం తెలుపుతూ స్థలం మంజూరు చేస్తూ జీవో కాపీని విడుదల చేయడం జరిగిందని, అందులో భాగంగా శనివారం ఒంగోలు భాగ్యనగర్ 4వ లైన్ లోని ఏసీబీ కార్యాలయం ఉన్న లైన్‌లో తెలుగుదేశం పార్టీ కార్యాలయం కోసం కేటాయించిన భూమిలో పనులు ప్రారంభించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, ఆంధ్రప్రదేశ్ టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీ, ఒంగోలు పార్లమెంట్ పార్టీ ప్రధాన కార్యదర్శి కొఠారి నాగేశ్వరరావు, పార్లమెంట్ కమిటీ సభ్యులు, షేక్ ఆరీఫా, బీరం అరుణరెడ్డి, గార్లపాటి శ్రీనివాసరావు, కసుకుర్తి అంకరాజు తదితరులు పాల్గొన్నారు.

# పోలవరం ప్రాజెక్టుకు కేంద్రం మరో రూ.3,300 కోట్ల నిధులు



అమరావతి (చైతన్యరథం): ఆంధ్రుల జీవనాడి పోలవరం ప్రాజెక్ట్‌పై కేంద్రప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది.పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి అదనంగా మరో రూ. 3,300 కోట్లు ఇవ్వాలని నిర్ణయించింది. 2027 జూన్ నాటికి పోలవరం పూర్తి చేయాలని ఏపీ ప్రభుత్వం నిర్ణయించింది. ఈ లక్ష్యంతో ఏకీభవించిన కేంద్ర ప్రభుత్వం ప్రాజెక్ట్ నిర్మాణానికి అయ్యే ఖర్చులో భాగంగా మరో రూ. 3,300 కోట్ల నిధులు మంజూరు చేసేందుకు కేంద్రం అంగీకారం తెలిపింది. ఇటీవల ఈ ప్రాజెక్ట్‌కు రూ. 2,300 కోట్లు విడుదల చేసిన కేంద్ర ప్రభుత్వం తాజాగా వచ్చే సెప్టెంబర్ నాటికి మరో రూ. 3,300 కోట్లు విడుదల చేసేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఆంధ్రుల జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టును పూర్తి చేయడమే లక్ష్యంగా అడుగులు వేస్తోంది. ఎట్టి పరిస్థితుల్లో 2027 జూన్ నాటికి పూర్తి చేయాలనే లక్ష్యంతో అడుగులు వేస్తోంది. ఇప్పటికే ప్రభుత్వం ప్రారంభించే సంవత్సరం ప్రకటించిన సంగతి తెలిసిందే. అయితే సమయం దగ్గరపడుతున్న నేపథ్యంలో శుక్రవారం న్యూఢిల్లీలో జలశక్తి శాఖ కార్యదర్శి కాంతారావుతో ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్, జల వనరుల శాఖ సలహాదారు వెంకటేశ్వరరావుతోపాటు పలువురు ఉన్నతాధికారులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పోలవరం ప్రాజెక్ట్‌పై కీలక చర్చ జరిగింది. ఈ సందర్భంగా ఇటీవల ఈ ప్రాజెక్ట్‌కు రూ. 2,300 కోట్లు విడుదల చేసిన కేంద్ర ప్రభుత్వం తాజాగా వచ్చే సెప్టెంబర్ నాటికి మరో రూ. 3,300 కోట్లు విడుదల చేసేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

# పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు శ్రీకారం



వేమూరు (చైతన్యరథం): అమృతలూరు మండలం, అమృతలూరు గ్రామంలోని ఎస్సీ కాలనీలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా అమృతలూరు గ్రామంలో రూ. 15లక్షల వ్యయంతో నిర్మించిన సైడ్ డ్రైన్స్, రూ. 7 లక్షల వ్యయంతో ఎంపీడీవో కార్యాలయం వద్ద నిర్మించిన ప్రజావేదికను ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు శనివారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... గ్రామాభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

**ప్రజా ఫిర్యాదుల పరిష్కార సమావేశం**

అమృతలూరు మండలంలో నిర్వహించిన "మీకోసం" కార్యక్రమంలో ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు పాల్గొన్నారు. మండల పరిధిలోని పలు గ్రామాల నుండి వచ్చిన ప్రజల అర్జీలను ఆయన స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రజలు భూ సమస్యలు, ఆదాయ సంబంధిత అంశాలు, ఎన్టీఆర్ భరోసా పింఛన్లు, గృహ నిర్మాణం, మౌలిక వసతులు వంటి వివిధ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై సంబంధిత శాఖల అధికారులు వెంటనే స్పందించి, ఆలస్యం లేకుండా పరిష్కారం చూపాలని ఎమ్మెల్యే ఆదేశించారు. ప్రతి అర్జీపై బాధ్యతాయుతంగా చర్యలు తీసుకోవాలని, ప్రజలకు వేగవంతమైన సేవలు అందించడం ప్రభుత్వ ముఖ్య లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, పార్టీ కార్యకర్తలు, గ్రామ మరియు మండల స్థాయి ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల ప్రభుత్వ అధికారులు పాల్గొని సమావేశాన్ని విజయవంతం చేశారు.

# కార్యకర్తలే పార్టీకి ప్రాణం : ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి



మార్కాపురం (చైతన్యరథం): మార్కాపురం నియోజకవర్గ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి తర్లుపాడు మండల తెలుగుదేశం పార్టీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కార్యకర్తలే తెలుగుదేశం పార్టీకి బలమని, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు మరియు అభివృద్ధి గురించి ప్రజలకు ప్రతి కార్యకర్త చెప్పాలని గత వైసీపీ ప్రభుత్వం ప్రజలపై చేసిన దౌర్జన్యాలు ప్రతి ఒక్కరికి వివరించాలని, అభివృద్ధితోపాటు ఇచ్చిన మాట కట్టుబడి ముఖ్యమంత్రి ఇప్పటికే మార్కాపురం జిల్లా ప్రకటించారని దాని అభివృద్ధి పలాలు త్వరలోనే ఈ ప్రాంతం చూడబోతుందన్నారు. రాబోయే రోజుల్లో వెలిగొండ ప్రాజెక్ట్ పూర్తిచేసి రైతు కుటుంబాలను ఆదుకుంటామని కందుల నారాయణరెడ్డి భరోసా కల్పించారు. ఈ విస్తృత స్థాయి సమావేశంలో మండల తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పల్నాడు టీడీపీ కార్యాలయంలో ఘనంగా కోడెల శివప్రసాదరావు జయంతి



పల్నాడు (చైతన్యరథం): తెలుగుదేశం పార్టీ పల్నాడు జిల్లా కార్యాలయంలో మాజీ మంత్రి, ఆంధ్రప్రదేశ్ శాసనసభ మాజీ స్పీకర్ కోడెల శివప్రసాదరావు జయంతిని శనివారం ఆయన అభిమానులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆయనకు ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ కోడెల శివప్రసాదరావు చిత్రపటానికి తెలుగుదేశం పార్టీ వైద్య విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కడియాల వెంకటేశ్వరరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కడియాల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ... కోడెల శివప్రసాదరావు తమకు రాజకీయ గురువుగా నిలిచారని తెలిపారు. ఆయన జీవితం క్రమశిక్షణ, ప్రజాసేవ, నిబద్ధతకు నిదర్శనమన్నారు. సాధారణ వైద్యుడిగా ప్రారంభమైన ఆయన ప్రయాణం, ప్రజల సేవలో అంకితభావంతో పనిచేస్తూ రాష్ట్ర స్థాయి నాయకుడిగా ఎదిగారన్నారు. కోడెల ఎన్టీఆర్, చంద్రబాబు క్యాబినెట్‌లో అనేక మంత్రి పదవులు నిర్వహించడంతో పాటు నవ్యాంధ్రప్రదేశ్ తొలి శాసనసభ స్పీకర్‌గా పనిచేసిన సమయంలో ప్రజాస్వామ్య విలువలను కాపాడుతూ, పరిపాలనలో పారదర్శకతకు ప్రాధాన్యతనిచ్చారని గుర్తు చేశారు. ముఖ్యంగా పల్నాడు ప్రాంత అభివృద్ధికి ఆయన చేసిన కృషి ఎప్పటికీ మరువలేనిదన్నారు. యువత రాజకీయాల్లోకి రావాలని, ప్రజల కోసం పనిచేయాలని ఆయన ఎప్పుడూ ప్రోత్సహించేవారని తెలిపారు. ఆయన ఆశయాలను కొనసాగించడం ప్రతి కార్యకర్త బాధ్యతగా భావించాలని సూచించారు.

## కార్పొరేట్‌కు ధీటుగా గురుకులాల విద్యార్థులు రాణిస్తున్నారు

**●వారిని ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలన్న పరిటాల సునీత**



రాప్తాడు (చైతన్యరథం): కార్పొరేట్ విద్యాసంస్థలకు ధీటుగా గురుకులాల్లో చదువుతున్న విద్యార్థులు రాణిస్తున్నారని.. రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. రామగిరి మండలం నసనకోట సమీపంలోని ఎం.జె.పి బాలికల గురుకుల పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరచడంపై ఆమె హర్షం వ్యక్తం చేశారు. ఇందులో టాప్-4 విద్యార్థినులను ఆమె ఘనంగా సత్కరించారు. అనంతపురంలోని క్యాంప్ కార్యాలయంలో విద్యార్థినులకు శాలువాలతో సన్మానించి, నగదు బహుమతిని అందించారు. ఉపాధ్యాయులను, విద్యార్థినుల తల్లిదండ్రులను ప్రత్యేకంగా అభినందించి, మొమెంటోలు అందజేశారు. ప్రతిభా పురస్కారాలు అందుకున్న వారిలో కనగానపల్లికి చెందిన గరుగు అక్షయ 581మార్కులు, మన్నీల గ్రామానికి చెందిన వహీదా 565మార్కులు, బెలుగుప్ప మండలం తగ్గుపర్తికి చెందిన గ్రీష్మ 581మార్కులు, కళ్యాణదుర్గం మండలం పాలవాయి గ్రామానికి చెందిన జాహ్నవి 577మార్కులు సాధించారు. ప్రతి ఏటా నసనకోట ఎంజేపి విద్యార్థినులు మంచి ప్రతిభ కనబరుస్తున్నారని.. ఈ ఏడాది మరింత మంచి మార్కులు సాధించడం ఆనందంగా ఉందన్నారు. ఇందులో విద్యార్థుల కృషి, పట్టుదలతో పాటు ఉపాధ్యాయుల కష్టం కూడా ఉందన్నారు. ఈ విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న వారికి స్ఫూర్తిగా నిలుస్తున్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాల్లో మెరుగైన సౌకర్యాలు కల్పిస్తోందని.. ఇక్కడ చదువుతున్న విద్యార్థులు కార్పొరేట్‌కు ఏమాత్రం తగ్గకుండా మార్కులు సాధిస్తున్నారని ఎమ్మెల్యే సునీత అన్నారు. ఈ కార్యక్రమం అనంతరం రాప్తాడు నియోజకవర్గ కేంద్రంలోని శ్రీ పండమేటి వెంకటరమణస్వామి దేవాలయానికి దాతల ద్వారా సేకరించిన రూ.30లక్షల విరాళాన్ని అందజేశారు. ఆలయ అభివృద్ధి పనులకు దాతల ద్వారా 30లక్షల రూపాయల విరాళాలను సేకరించారు. అనంతపురంలోని క్యాంప్ కార్యాలయంలో దేవస్థానం కమిటీ సభ్యులకు ఈ విరాళాలకు సంబంధించిన చెక్కును అందజేశారు. ఆలయాన్ని అభివృద్ధి చేసేందుకు దేవాదాయశాఖ ద్వారా కూడా నిధులు తీసుకొస్తున్నట్టు చెప్పారు. పండమేరు చుట్టూ పార్కును కూడా ఏర్పాటు చేసేలా ప్రణాళికలు చేసినట్టు ఎమ్మెల్యే సునీత తెలిపారు.

## ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలి

**● అధికారులకు మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి సూచన**



బనగానపల్లె (చైతన్యరథం): ప్రజల నుంచి వచ్చిన వినతులను చిత్తశుద్ధితో పరిష్కరించి బాధితులకు త్వరితగతిన న్యాయం చేయాలని అధికారులకు రాష్ట్ర రోడ్లు మరియు భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి ఆదేశించారు. నేటి సాయంత్రం బనగానపల్లె క్యాంపు కార్యాలయంలో ప్రజల నుంచి వచ్చిన పలు అర్జీలను మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఆయా సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరిస్తామని బాధితులకు హామీ ఇవ్వడం జరిగింది. అలాగే చట్టబద్ధంగా ఉన్న సమస్యల విషయంలో మంత్రి సంబంధిత అధికారులతో అక్కడికక్కడే ఫోన్‌లో మాట్లాడి ఆయా సమస్యలకు పరిష్కరించడం జరిగింది. క్షేత్రస్థాయిలో మౌలిక సదుపాయాల కల్పనపై వచ్చే సమస్యలను పరిష్కరించేందుకు సత్వరమే చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించడం జరిగింది. ఈ అర్జీలు స్వీకరణ కార్యక్రమంలో సమస్యలపై మంత్రి సానుకూలంగా స్పందించడంతో బాధితుల నుంచి సర్వత్రా సంతోషం వ్యక్తమైంది. మంత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ అర్జీల స్వీకరణ కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా వివిధ వర్గాల ప్రజలు, కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలి వచ్చారు.

## ఏలూరులో అమెరికా వెళ్తూ ప్రవాసాంధ్రుడి మృతి



ముదినేపల్లి (చైతన్యరథం): ఏలూరు జిల్లా ముదినేపల్లి మండలం చినపాలపర్రు జాతీయ రహదారిపై ప్రమాదం చోటు చేసుకుంది. ఆగి ఉన్న టిప్పర్ను కారు ఢీ కొన్న ఘటనలో ప్రవాసాంధ్రుడు జయరాం (27) ప్రాణాలు కోల్పోయాడు. వనదుర్రు గ్రామానికి చెందిన జయరాం.. తన బంధువుల ఇంట్లో జరిగిన వివాహానికికై హాజరై తిరిగి అమెరికా వెళ్లేందుకు.. శనివారం తెల్లవారు జామున రోడ్డు మార్గంలో హైదరాబాద్ పయనమయ్యాడు. కారు డ్రైవర్ నిద్ర మత్తులో ఉండటంతో చినపాలపర్రు సమీపంలో కారు రోడ్డుకు అపసవ్యదిశలో ప్రయాణించి రోడ్డు పక్కన ఆగి ఉన్న టిప్పర్ను బలంగా ఢీ కొట్టింది. దీంతో కారు ముందుభాగం నుజ్జునుజ్జయింది. అందులో చిక్కుకున్న జయరాం అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. డ్రైవర్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. జయరాం అమెరికాలో సాఫ్ట్వేర్ ఇంజినీర్‌గా పని చేస్తున్నారు.

## సంచార జాతుల గౌరవప్రద జీవనమే లక్ష్యం : మంత్రి సవిత



పెనుకొండ/శ్రీసత్యసాయి (చైతన్యరథం): రాష్ట్రంలో ఉన్న సంచార జాతుల వారు గౌరవ ప్రదమైన జీవనం సాగించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. సంచార జాతులకు గుర్తింపు కార్డులతో పాటు కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండలోని క్యాంపు కార్యాలయంలో మంత్రి సవితను పలువురు సంచార జాతులకు చెందిన ప్రతినిధులు శనివారం కలిశారు. తమ జాతులకు కుల ధ్రువీకరణ జారీ సమయంలో డీఎన్టీ అని పేర్కొంటూ నిర్ణయం తీసుకోవడంపై వారు ఆనందం వ్యక్తంచేశారు. సీఎం చంద్రబాబుకు, మంత్రి సవితకు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ, బీసీల్లో అన్ని సామాజిక వర్గాల వారికి ఆర్థిక, రాజకీయ, సామాజిక గుర్తింపు తీసుకురావడమే సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. ముఖ్యంగా సంచార జాతుల వారిని అన్ని విధాలా భరోసానిస్తోందన్నారు. సంచార జాతుల వారికి గుర్తింపు ప్రధాన సమస్యగా మారిందన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకునే గుర్తింపు కార్డుల జారీపై నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిపారు. కుల ధ్రువీకరణ పత్రాల జారీపైనా చర్యలు తీసుకుంటామన్నారు. సంచార జాతుల అభివృద్ధి విద్యతోనే ముడిపడి ఉందన్నారు. సంచార జాతుల వారికి ఇళ్లు సహా పలు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు. తమ బిడ్డలను పాఠశాలలకు పంపించాలని సూచించారు. అంతకుముందు మంత్రి సవితను సంచార జాతుల ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. మంత్రి సవితను కలిసిన వారిలో పూసల రవి, సి ఈశ్వర్ తేవర్, ముత్తు రామన్, మనీ కుమార్ తేవర్, పాండు దేవర్. పాండి తేవర్, శేఖర్ దేవ తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే కందికుంట



కదిరి (చైతన్యరథం): వైసీపీ పాలనలో రైతులకు తీవ్ర అన్యాయం జరిగిందని, తాతముత్తాతల నుంచి సంక్రమించిన భూములను సైతం ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌తో దోచుకోవాలని జగన్మోహన్‌రెడ్డి ప్రయత్నం చేశారని కదిరి నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం నియోజకవర్గంలోని నల్లచెరువు మండలం, తవళంమర్రి గ్రామంలోని రైతులకు నూతన పట్టాదారు పుస్తకాలు పంపిణీ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రైతులకు రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ చేస్తామని ఇచ్చిన హామీ మేరకు క్యూఆర్ కోడ్‌తో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ చేయడం ఆనందంగా ఉందన్నారు. వైసీపీ ప్రభుత్వంలా పట్టాదారు పాస్ పుస్తకాలపై రాజకీయ నాయకుల ఫోటోలకు స్వస్తి చెప్పి మీ ఆస్తి, మీకే సొంతం అనే నినాదంతో ఒక మంచి మార్పుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు శ్రీకారం చుట్టారని ఎమ్మెల్యే కందికుంట వ్యాఖ్యానించారు.

## డీసీసీ బ్యాంక్ నూతన భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి



ప్రొద్దుటూరు (చైతన్యరథం): ప్రొద్దుటూరు పట్టణం మైదుకూరు రోడ్డు అన్వర్ థియేటర్ ఎదురుగా ఉన్న డీసీసీ బ్యాంక్ బ్రాంచ్‌ను మైదుకూరు రోడ్డులోని కొత్త ఆటోనగర్ ఎదురుగా ఉన్న నూతన భవనంలోకి మారిన వేళ... నూతన బ్రాంచ్ బ్యాంకును శనివారం ప్రొద్దుటూరు నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజలరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఖాతాదారుల ఆకాంక్షలకు అనుగుణంగా బ్యాంకు సిబ్బంది పనిచేయాలని, ముఖ్యంగా రైతులకు రుణాలు ఇచ్చేందుకు ముందుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో చెన్నమరాజుపల్లె సొసైటీ చైర్మన్ పల్లేటి చంద్రశేఖర్ రెడ్డి కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## బత్తలపల్లిలోని జాతీయ రహదారిలో వీధి లైట్లు వెలగడం లేదు

**●హిందూ స్మశాన వాటిక లేదు, నీటి సమస్యలు పరిష్కరించండి**

**●ధర్మవరం టీడీపీ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్‌కు ప్రజల విజ్ఞప్తులు**



ధర్మవరం (చైతన్యరథం): బత్తలపల్లి మండల కేంద్రంలోని జాతీయ రహదారిపైనే విద్యుత్ బల్బులు వెలగడం లేదని.. స్థానికులు ధర్మవరం టీడీపీ ఇన్‌ఛార్జ్ పరిటాల శ్రీరామ్ దృష్టికి తీసుకెళ్లారు. బత్తలపల్లి టీడీపీ కార్యాలయంలో శ్రీరామ్ ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. బత్తలపల్లితో పాటు మండలంలోని పలు గ్రామాల వారు తరలివచ్చి శ్రీరామ్‌కు తమ సమస్యలు చెప్పుకున్నారు. ఇందులో ప్రధానంగా బత్తపల్లిలోని జాతీయ రహదారిలో ఉన్న పోలీస్ స్టేషన్ వద్ద నుంచి ఆర్డీటీ ఆసుపత్రి వరకు వీధి లైట్లు వెలగడం లేదని శ్రీరామ్‌కు తెలిపారు. ప్రతినిత్యం వేలాది వాహనాలు ఈ మార్గంలో వెళ్తుంటాయని.. నిత్యం జన సంచారం ఉంటుందని.. ఇలాంటి చోట వీధి లైట్లు వెలగడం లేదన్నారు. దీనిపై పంచాయతీ అధికారులు కానీ, జాతీయ రహదారి వారు కానీ పట్టించుకోవడం లేదన్నారు. అలాగే బత్తలపల్లి మండల కేంద్రంలో 10వేలకు పైగా జనాభా ఉందని.. ఇక్కడ హిందూ స్మశాన వాటిక లేదన్నారు. అలాగే వేసవి నేపథ్యంలో పలు కాలనీల్లో నీటి సమస్య నెలకొందన్నారు. ముఖ్యంగా చౌదరి కాలనీ, పాత ఊరిలో నీటి సమస్యలు ఉన్నట్టు తెలిపారు. పలు గ్రామాల్లో భూ సమస్యలపై కూడా శ్రీరామ్‌కు అర్జీలు ఇచ్చారు. గతంలో అధికారుల దృష్టికి తీసుకెళ్లినా అవి పరిష్కారం కాలేదన్నారు. ప్రజలు చెప్పిన అన్ని సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యేలా చూస్తామని శ్రీరామ్ హామీ ఇచ్చారు. మరోవైపు బత్తలపల్లి మండల కేంద్రానికి చెందిన పెరిమోల లోహిత్‌కు రూ.25.79వేల రూపాయల సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేశారు.

## పది ఫలితాల్లో ప్రతిభ... విద్యార్థినిని సన్మానించిన ఎమ్మెల్యే నల్లారి

పీలేరు (చైతన్యరథం): పదో తరగతి ఫలితాల్లో పీలేరు ఉన్నత పాఠశాలకు చెందిన వైష్ణవి 595 మార్కులు సాధించడంతో ఆ బాలికను పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి సన్మానించారు. అనంతరం జ్ఞాపిక అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విద్యార్థిని పట్టుదల, తల్లిదండ్రుల ప్రోత్సాహంతో రాష్ట్రస్థాయిలో రెండో స్థానం సాధించిందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థిని ఈ ఘనత సాధించడం మనకు ఎంతో గర్వకారణమన్నారు. ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన వసతులు, నైపుణ్యం గల ఉపాధ్యాయులు, మెరుగైన విద్యా బోధన ఉంటుందని అన్నారు.

ప్రవాసాంధ్ర
NRI TDP
చైతన్యరథం




## నేడు శాన్ ఆంటోనియోలో 'టాసా' ఆధ్వర్యంలో అవగాహన సదస్సు

**శాన్ ఆంటోనియో:** శాన్ ఆంటోనియో తెలుగు సంఘం (TASA) ఆధ్వర్యంలో ప్రవాస భారతీయుల కోసం ప్రత్యేకంగా "ఇమ్మిగ్రేషన్ & వీసా అవగాహన సదస్సు" నిర్వహించనున్నారు. ప్రఖ్యాత అటార్నీ ఉమా మంత్రవాది ఈ సెషన్‌లో పాల్గొని ప్రస్తుత వీసా నిబంధనలు, పాలసీ మార్పులపై కీలక సమాచారం అందించనున్నారు.

తేదీ, సమయం: మే 3వ తేదీ మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు.

వేదిక: లున్నా ఈవెంట్ సెంటర్ (Lunna Event Center), 7142 శాన్ పెడ్రో ఏవ్ #113, శాన్ ఆంటోనియో, TX 78216.

చర్చించబోయే అంశాలు: H1-B ఫైలింగ్స్, H4 నుంచి F1 మార్పులు, STEM OPT & CPT, EB2, EB5 అప్‌డేట్స్, తాజా ఇమ్మిగ్రేషన్ పాలసీ మార్పులు.

ప్రవేశం పూర్తిగా ఉచితం.

సదస్సులో పాల్గొనేవారు చివరలో తమ సందేహాలను నివృత్తి చేసుకునేందుకు అటార్నీతో నేరుగా ఇంటరాక్టివ్ Q&A సెషన్ ఉంటుంది.

ఆసక్తి గల వారు తమ ప్రశ్నలను ముందుగానే ఆన్‌లైన్ ద్వారా సమర్పించవచ్చని నిర్వాహకులు తెలిపారు. మరిన్ని వివరాలకు ఆదినారాయణ, నీరజ సుంకర లేదా నూతన్ ఎల్లంకిలను సంప్రదించాలని 'టాసా' కార్యవర్గ సభ్యులు కోరుతున్నారు.

### తప్పులను సరిచేసుకోకపోతే

# తెలుగు భాష సంకరమయ్యే ప్రమాదం

### 'తానా' సాహిత్య సదస్సులో ప్రముఖుల విశ్లేషణ

**డాలస్, టెక్సాస్:** తానా సంస్థ సాహిత్య విభాగం 'తానా ప్రపంచ సాహిత్య వేదిక' ఆధ్వర్యంలో "నెల నెలా తెలుగు వెలుగు" పేరిట ప్రతి నెలా ఆఖరి ఆదివారం అంతర్జాతీయ అంతర్జాల దృశ్య సమావేశాలు నిర్వహిస్తున్న విషయం విదితమే. "సరిగ్గా తెలుగు పలుకు: అర్థం-అనర్థం-అపార్థం" అంశంపై జరిగిన 91వ అంతర్జాల దృశ్య సమావేశంతో 6 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా జరుపుకున్న 6వ వార్షికోత్సవం ఘనంగా జరిగింది.

తానా ప్రపంచ సాహిత్య వేదిక నిర్వాహకుడు డాక్టర్ ప్రసాద్ తోటకూర మాట్లాడుతూ ఆరు సంవత్సరాల క్రితం ప్రజాకవి వంగపండు ప్రసాదరావు తన కళాకారుల బృందంచే జానపద గాన, నృత్య కార్యక్రమాలతో అంగరంగ వైభవంగా ప్రారంభించి అప్పటి నుంచి ఇప్పటివరకు స్త్రీవాద సాహిత్యం, దళిత సాహిత్యం, ముస్లిం, మైనారిటీ సాహిత్య అంశాలు సహా అనేక కార్యక్రమాలతో కొన్ని వందల మంది సాహితీ ప్రముఖులతో ప్రతి నెలా ఆఖరి ఆదివారం అంతర్జాల దృశ్య సమావేశాలు నిర్వహిస్తున్నామన్నారు. మన నిత్య జీవితంలో అనాలోచితంగా దొర్లే తప్పులను సరిజేసుకోకపోతే అవే తప్పులతో మన తెలుగు భాష సంకరమయ్యే ప్రమాదం ఉందన్నారు. ఈ అంశంపై కొన్ని రచనలు వచ్చినప్పటికీ ప్రముఖ రచయిత డాక్టర్ రవ్వా శ్రీహరి రాసిన "వాడుక తెలుగులో అప ప్రయోగాలు" పుస్తకంలో చాలా విషయాలను వివరించారన్నారు.

తానా పూర్వాధ్యక్షుడు లావు అంజయ్య చౌదరి మాట్లాడుతూ ఈ సాహిత్య కార్యక్రమాలు విశ్వవ్యాప్తంగా ఉన్న సాహిత్యాభిమానుల ప్రశంసలు అందుకుంటున్నాయన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు తెలుగు భాషా మాధుర్యాన్ని చిన్నప్పటినుంచే అందించాలన్నారు. తెలుగు మాటలు రాసేటప్పుడు జాగ్రత్త వహించకపోతే అపార్థాలకు దారితీస్తాయన్నారు.

పత్రికా రచయితగా నాలుగు దశాబ్దాలకు పైగా అనుభవం గడించిన ఈనాడు (ఆంధ్రప్రదేశ్) దినపత్రిక సంపాదకుడు ఎం. నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా ప్రసంగిస్తూ.. ప్రభుత్వాలు, విశ్వవిద్యాలయాలు ఇలాంటి అంశాలపై నిర్వహించాల్సిన సమావేశాలను తానా ప్రపంచ సాహిత్య వేదిక గత ఆరు సంవత్సరాలుగా క్రమం తప్పకుండా నిర్వహించడం విశేషం. అన్నారు. 'షష్ఠి పూర్తి' అంటే ఆరు సంవత్సరాలు పూర్తి చేసుకోవడం, 'షష్టి పూర్తి' అంటే 60 సంవత్సరాలు పూర్తి చేసుకోవడం. ఒక చిన్న అక్షరం అర్థంలో ఎంతో మార్పు తీసుకొస్తుంది. కనుక ఏ సందర్భంలో ఏమి వాడుతున్నామో జాగ్రత్త వహించాలన్నారు. సొగసైన తెలుగు భాషను




కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందన్నారు.

పత్రికా రచయితగా సుదీర్ఘమైన అనుభవం గడించిన, ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం అధ్యక్షుడు పూల విక్రం ఈ సభలో గౌరవ అతిథిగా పాల్గొని తన హోదాలో ప్రభుత్వ పరిపాలనలోను, నామ ఫలకాలపై, ఉత్పాదక వస్తువులపై తెలుగు ఉండేటట్లు తన వంతు కృషి చేస్తున్నానన్నారు. అందరి సూచనలు, సలహాలతో పరిపాలనా భాషగా తెలుగు ఎక్కువగా వాడకంలో ఉండేలా చేయడమే తన ధ్యేయమన్నారు. ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు తెలుగు భాషాభిమాని. ఆయన తెలుగు వాడకానికి ఎంతో ప్రాముఖ్యత ఇచ్చేవారని, ఎన్నో ప్రభుత్వ పథకాలకు చక్కని తెలుగు పేర్లు ఏరి కోరి పెట్టేవారన్నారు. అలాంటి రోజులు మరలా తిరిగి రావాలన్నారు.

విశిష్ట అతిథిగా పాల్గొన్న ప్రముఖ నటుడు, వక్త, సంగీతావధాని డాక్టర్ మీగడ రామలింగస్వామి మాట్లాడుతూ తెలియక తప్పుగా రాయడం ఒక విషయమైతే బాగా చదువుకున్న వాళ్లు, రచయితలు కూడా తెలుగును అక్షర దోషాలతో రాయడం విచారకరమన్నారు.

రాజమహేంద్రవరానికి చెందిన ప్రముఖ మానసిక వైద్య నిపుణుడు, తెలుగు సాహిత్యాభిమాని డాక్టర్ కర్రి రామారెడ్డి తన దృష్టిలో ఉన్న కొన్ని తెలుగు పదాలను ఉటంకించారు. సామాన్య ప్రజల మాటల నుంచి కూడా మనం కొత్త పదాలను నేర్చుకోవచ్చన్నారు. తెలుగు సుందరమైన భాష అన్నారు.

విశిష్ట అతిథిగా పాల్గొన్న ప్రముఖ శతావధాని డాక్టర్ బులుసు అపర్ణ మాట్లాడుతూ తల్లిదండ్రులు భక్తిపూర్వకంగా తమ పిల్లలకు పేర్లు పెట్టేటప్పుడు ఆలోచించకుండా పెట్టేస్తున్నారన్నారు.

తానా ప్రపంచ సాహిత్య వేదిక సమన్వయకర్త చిగురుమళ్ళ శ్రీనివాస్ మాట్లాడుతూ ఇప్పటివరకు 90కి పైగా సాగిన సాహిత్య కార్యక్రమాలు సాహిత్య పరిశోధక విద్యార్థులకు ఉపకరించే అంశాలుగా మారడం ముదావహమన్నారు.

## 10న షికాగోలో మదర్స్ డే సంబరాలు

**షికాగో:** అమెరికాలోని షికాగో ఆంధ్ర అసోసియేషన్ (సీఏఏ) 10వ వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా మే 10న ఘనంగా 'మదర్స్ డే' (అమ్మల గంట) నిర్వహించనుంది. నేపర్విల్లేలోని ఉల్ఫ్ క్రాసింగ్ కమ్యూనిటీ పార్క్‌లో ఉదయం 8 నుంచి 11 గంటల వరకు సంబరాలు జరగనున్నాయి. అన్ని తరాల వారు కలిసి ఆనందించేలా కార్యక్రమాన్ని రూపొందించారు.

ఫ్యామిలీ వాక్ & గేమ్స్: కుటుంబ సభ్యులందరితో కలిసి సరదాగా సాగే వాక్, ఫిట్‌నెస్ ఆధారిత క్రీడలు.

ఫ్లవర్ మేకింగ్: తల్లుల కోసం ప్రత్యేకంగా పూల అలంకరణ, తయారీ కార్యక్రమం.

బేక్ & షేర్: తల్లుల కోసం ఇష్టమైన తినుబండారాలను తయారు చేసి అందరితో పంచుకునే అవకాశం.

జుంబా & క్రికెట్: సౌమ్య బొజ్జా ఆధ్వర్యంలో జుంబా సెషన్, మహిళల కోసం ప్రత్యేకంగా 'క్రికెట్ డే అవుట్' నిర్వహించనున్నారు.

ప్లాంట్ సేల్: షికాగో ఆంధ్ర ఫౌండేషన్ (CAF) ఆధ్వర్యంలో స్వచ్ఛంద సేవా కార్యక్రమాల కోసం మొక్కల విక్రయం (Spring Plant Sale) చేపట్టనున్నారు.

రిజిస్ట్రేషన్ వివరాలు: అసోసియేషన్ సభ్యులకు ప్రవేశం ఉచితం. సభ్యులు కాని వారు 5 డాలర్లు చెల్లించాల్సి ఉంటుంది. ఆసక్తి ఉన్నవారు https://bit.ly/CAAWalk2026 లింక్ ద్వారా రిజిస్టర్ చేసుకోవచ్చు.

ఈ వేడుకలను దిగ్విజయంగా నిర్వహించేందుకు అసోసియేషన్ ప్రతినిధులు తమిశ్ర కొంచాడ (ప్రెసిడెంట్), నరసింహారెడ్డి ఓగ్గు, సౌమ్య బొజ్జా, శృతి కూచంపూడి, ఇతర ట్రస్టీలు, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు.

షికాగో పరిసర ప్రాంతాల్లోని తెలుగు కుటుంబాలన్నీ ఈ వేడుకల్లో పాల్గొని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.



# ఏఐతోనే వైద్యరంగ భవిష్యత్

### వైభవంగా సెయింట్ మార్టినస్ విశ్వవిద్యాలయ వార్షికోత్సవం

**సెయింట్ మార్టినస్:** ప్రవాసాంధ్రుల ఆధ్వర్యంలో కరేబియన్ దీవుల్లో నిర్వహిస్తున్న సెయింట్ మార్టినస్ యూనివర్సిటీ (SMU) 2026 గ్రాడ్యుయేషన్ వేడుక ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయం మూడు ముఖ్యమైన మైలురాళ్లను చేరుకున్నట్టు నిర్వాహకులు ప్రకటించారు. 92 శాతం రెసిడెన్సీ మ్యాచ్ రేటు సాధించినట్టు వెల్లడించారు. Prime Healthcare Servicesతో కొత్త భాగస్వామ్యం, వైద్య విద్యలో కృత్రిమ మేధస్సు (AI) వినియోగించనున్నట్టు తెలిపారు. యూనివర్సిటీ 25ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ ప్రకటనలు వెలువరించారు.

బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ చైర్మన్ డాక్టర్ హరనాథ్ పొలిచెర్ల మాట్లాడుతూ ఎస్ఎంయూ, ప్రైమ్ హెల్త్‌కేర్ సర్వీసెస్ మధ్య భాగస్వామ్యం ద్వారా అమెరికా ఆసుపత్రుల్లో క్లినికల్ ట్రైనింగ్ అవకాశాలు పెరుగుతాయని తెలిపారు. వైద్యరంగ భవిష్యత్తును ఏఐ ముందుకు నడిపిస్తోందని, విద్యార్థులు తదుపరి తరానికి సిద్ధంగా ఉండేందుకు SMU పాఠ్య ప్రణాళికలో AIని చేర్చుతున్నట్టు తెలిపారు.

యూనివర్సిటీ అధ్యక్షుడు డాక్టర్ మురళి గింజుపల్లి మాట్లాడుతూ 2026లో SMU 92 శాతం రెసిడెన్సీ మ్యాచ్ రేటు సాధించడం గొప్ప విజయమని చెప్పారు. డాక్టర్ శ్రీరామ్ పూరేటి ఆధ్వర్యంలో స్వాగత కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ సంజీవ్ కౌల్, చాన్సలర్ డాక్టర్ సురేయ్యా సవాసన్, వైస్ చాన్సలర్ డాక్టర్ దన్నా సోరియా, డీన్ ఆఫ్ క్లినికల్ సైన్సెస్ డాక్టర్ బ్రాండన్ క్రౌట్ తమ సందేశాలను అందించారు. డాక్టర్ రాఘవేంద్ర చౌదరి వేములపల్లి విద్యార్థులతో ప్రమాణం చేయించారు.

బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ చైర్మన్ తాళ్లూరి జయశేఖర్ విద్యార్థులకు అభినందనలు తెలిపారు. బోర్డ్ సభ్యులు నిరంజన్ శృంగవరపు, సురేష్ పుట్టగుంట, కృష్ణ కుర్రా, ప్రకాశ్ గేరా, నవీన్ ఆలే, రాధిక కత్తరగడ్డ, ప్రముఖ కన్సల్టెంట్ డాక్టర్ కమేంద్ర దేవిదాస్ దహత్, అలుమ్ని డాక్టర్ గోపీ ములకా, డాక్టర్ మోహిత్ శర్మ, డాక్టర్ నౌషాద్ మన్సూరి, ప్రసాద్ బెతంచెర్ల, జోగేశ్వరరావు పెద్దిబోయిన, డాక్టర్ సమ్విత్ చంద్ర గింజుపల్లి, డాక్టర్ పొలిచెర్ల విజయ్‌కృష్ణ తదితరులు పాల్గొన్నారు.








## దుర్గామాత కూడా ఫలితాలను అంచనా వేయలేదు

**- సౌరవ్ గంగూలీ**



ప్రధాని మోదీ కానీ, బెంగాల్ సీఎం మమతా బెనర్జీ కానీ, బెంగాలీలు పూజించే దుర్గామాత కూడా 2026 అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను అంచనా వేయలేరని టీమిండియా మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ అన్నారు. సోమవారం బ్యాలెట్ బాక్సులను ఓపెన్ చేసిన తర్వాతే ఆ విషయం తెలుస్తుందన్నారు. అప్పుడే మనకు సమాధానం దొరుకుతుందన్నారు. 294 స్థానాలు ఉన్న బెంగాల్ అసెంబ్లీకి రెండు దశల్లో ఎన్నికలు జరిగాయి. ఏప్రిల్ 23,29తేదీల్లో ఆ ఎన్నికలు నిర్వహించారు.ఇక ఇవాళ సౌత్ 24 పరగనాస్ జిల్లాలో 15 పోలింగ్ బూత్‌ల పరిధిలో రీపోలింగ్ నిర్వహిస్తున్నారు. బెంగాల్ ఎన్నికలకు రాష్ట్ర పోలీసులతో పాటు కేంద్ర బలగాలు భారీ స్థాయిలో బందోబస్తు నిర్వహించాయి.తొలి దశ పోలింగ్ 152స్థానాలు, రెండో దశ 142స్థానాల్లో జరిగింది. అయితే చాలా వరకు ఎగ్జిట్‌పోల్స్.. బీజేపీకే విజయాన్ని కట్టబెట్టాయి. రెండో స్థానంలో టీఎంసీ ఉన్నది.

## ఛత్తీస్‌గఢ్‌లో ఘోరం ఐఈడీ పేలి ముగ్గురు జవాన్లు మృతి

ఛత్తీస్‌గఢ్: కాంకేర్ జిల్లాలో ఘోర ప్రమాదం సంభవించింది. ఐఈడీ పేలుడు ధాటికి ముగ్గురు జవాన్లు మృతిచెందగా.. మరొకరికి తీవ్ర గాయాలు అయ్యాయి. మావోయిస్టులు అమర్చిన మందుపాతర తొలగిస్తుండగా ప్రమాదవశాత్తూ పేలింది. నారాయణ్‌పూర్ జిల్లాకు ఆనుకుని ఉన్న ఛోటేబేతియా పోలీస్ స్టేషన్ పరిధిలోని అటవీ ప్రాంతంలో ఈఘటన చోటు చేసుకుంది. ఛత్తీస్‌గఢ్‌ని మార్చి 31న సాయుధ మావోయిస్టులు లేని రాష్ట్రంగా ప్రకటించారు. అయితే, గతంలో మావోయిస్టులు అమర్చిన ఐఈడీలను గుర్తించి నిర్వీర్యం చేసేందుకు డిస్ట్రిక్ రిజర్వ్ గార్డ్ (డీఆర్జీ) బృందం మైన్ల తొలగింపు ఆపరేషన్ చేస్తోంది. శనివారం మైన్ల తొలగింపు చేస్తుండగా ప్రమాదవశాత్తూ ఐఈడీ పేలింది. దీంతో నలుగురు డీఆర్జీ జవాన్లు తీవ్రంగా గాయపడగా.. వారిలో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారని బస్తర్ ఐజీ పి.సుందర్‌రాజ్ తెలిపారు. మరొకరికి తీవ్రగాయాలు అయ్యాయని, చికిత్స అందిస్తున్నట్లు వెల్లడించారు. సాయుధ మావోలు లేని రాష్ట్రంగా ప్రకటించిన తర్వాత ఇది తొలి పేలుడు ఘటన అని ఐజీ సుందర్‌రాజ్ పేర్కొన్నారు.



# 200 సీట్లలో గెలుస్తాం

## విజయ్ టీవీకే ధీమా

చెన్నై: ఎగ్జిట్‌పోల్ ఫలితాలతో ఉత్సాహంగా ఉన్న విజయ్ తమిళగ వెట్రి కళగం (ఎఖ) పార్టీ తమిళనాడులో కొత్త ప్రభుత్వం ఏర్పాటుపై ధీమా వ్యక్తం చేసింది. 2026 అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు చారిత్రకం కానున్నట్లు తెలిపింది.

టీవీకే ఎగ్జిక్యూటివ్ చీఫ్ కో–ఆర్డినేటర్ కేఏ సెంగోట్టియన్ శనివారంనాడు ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ... తమిళనాడులో ఏ పార్టీ మెజారిటీ సాధించకపోవడం అనే పరిస్థితి ఉండదని, టీవీకే 180 నుంచి 200 సీట్లు గెలుస్తుందని చెప్పారు. ఎన్నికల అనంతరం అన్నాడీఎంకే, ఎన్డీయేతో పొత్తుకు అవకాశం లేదని స్పష్టం చేశారు. తమిళనాడు తదుపరి ముఖ్యమంత్రిగా విజయ్ 'విజనరీ పాలన' అందించనున్నట్టు చెప్పారు. విజయ్ అనేక అవాంతారాలను ఎదుర్కొని ముందుకు ప్రయాణం సాగించారని, ఇందుకు తగిన ఫలితం మే 4న వస్తుందని అన్నారు.

ఎగ్జిట్‌పోల్స్ ఏం చెప్పాయంటే..

ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ డీఎంకే తిరిగి అధికారంలోకి రానుందని దాదాపు అన్ని ఎగ్జిట్‌పోల్స్ జోస్యం చెప్పాయి. విజయ్ పార్టీ లాభపడుతుందని, అయితే భారీ విజయం సాధించే అవకాశం లేదని తేల్చిచెప్పాయి. రెండు ఎగ్జిట్ పోల్స్... యాక్సిస్ మై ఇండియా, టుడేస్ చాణక్య మాత్రం తమిళనాడులో కింగ్‌మేకర్‌గా టీవీకే నిలుస్తుందని జోస్యం చెప్పాయి. 98 నుంచి 120 నియోజకవర్గాల్లో టీవీకే గెలుస్తుందని యాక్సిస్ మై ఇండియా పేర్కొంది. 63 సీట్ల వరకూ టీవీకే గెలవచ్చని టుడేస్ చాణక్య తెలిపింది. అన్నాడీఎంకే సారథ్యంలోని ఎన్డీయే తమిళనాడులో అధికారంలోకి రాదని దాదాపు అన్ని ఎగ్జిట్‌పోల్స్ తెలిపాయి. రాష్ట్రంలోని 234 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఏప్రిల్ 23న ఒకే విడతలో పోలింగ్ జరిగింది. 85 శాతం పోలింగ్ నమోదైంది. మే 4న ఎన్నికల ఫలితాలు వెలువడనున్నాయి.



# ఈసీ నిర్ణయంలో తప్పే లేదన్న 'సుప్రీం'

## మమతకు షాక్

ఎన్నికల కౌంటింగ్‌కి కొన్ని గంటల ముందుకు బెంగాల్ ముఖ్యమంత్రి, టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీకి సుప్రీంకోర్టులో గట్టి షాక్ తగిలింది. ఓట్ల లెక్కింపులో పర్యవేక్షకులుగా కేంద్ర ప్రభుత్వరంగ సంస్థల ఉద్యోగులను సిబ్బందిగా ఎంపిక చేసుకునే అధికారం ఎన్నికల సంఘానికి వుందని సుప్రీం కోర్టు పేర్కొంది. ఏప్రిల్ 13 నాడు ఎన్నికల సంఘం జారీ చేసిన సర్క్యులర్‌ను తప్పని తాము చెప్పలేమని సుప్రీంకోర్టు పేర్కొంది. ఓట్ల లెక్కింపులో కేవలం కేంద్ర ప్రభుత్వ సిబ్బందిని మాత్రమే నియమిస్తూ ఈసీ తీసుకున్న నిర్ణయాన్ని సవాల్ చేస్తూ మమతాబెనర్జీ మొదట కలకత్తా హైకోర్టుకు వెళ్లారు. అయితే ఈసీ నిర్ణయంలో ఎలాంటి తప్పూ లేదని పేర్కొంది. దీనిని సవాల్ చేస్తూ ఆమె సుప్రీంకోర్టుకు వెళ్లారు. జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస్ జోయ్ మాల్య బాగ్చీలతో కూడిన ప్రత్యేక ధర్మాసనం ఈ పిటిషన్‌ను విచారించింది.

శనివారం సెలవు అయినా సుప్రీం ధర్మాసనం ఈ పిటిషన్ ను విచారించింది. తృణమూల్ పక్షాన సీనియర్ న్యాయవాది కపిల్ సిబాల్ వాదనలు వినిపించారు. ఈ సందర్భంగా సుప్రీం కోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. కౌంటింగ్ సమయంలో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులే వుండాలన్న రూల్ ఏమీ లేదని, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులను నియమిస్తే తప్పేంటి? అని ప్రశ్నించింది. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల నియామకం నిబంధనలకు విరుద్ధం కానే కాదని సుప్రీం ధర్మాసనం తెలిపింది. మరోవైపు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు కలిసే కౌంటింగ్ లో వుంటారని ఈసీ స్పష్టంగా తన సర్క్యులర్ లో పేర్కొంది. ఓట్ల లెక్కింపులో అక్రమాలు జరుగుతాయన్న టీఎంసీ ఆందోళనలు నిరాధారమైనవని ఈసీ పేర్కొంది.



# జబల్‌పూర్ బోటు ప్రమాదం..

**చివరి నిమిషంలో లైఫ్ జాకెట్ల కోసం..**

**వెలుగులోకి మరో వీడియో!**

భోపాల్: మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్ జిల్లా బర్గి డ్యామ్‌లో పడవ మునిగిన ఘటనకు సంబంధించి మరో వీడియో వెలుగులోకి వచ్చింది. పడవ మునిగిపోవడానికి కొన్ని నిమిషాల ముందు ఏం జరిగిందో ఆ వీడియోలో ఉంది. ఆ వీడియోలో ఏముందంటే.. పడవలోకి నీళ్లు వస్తున్నాయి. భయపడిపోయిన పర్యాటకులు భయంతో కేకలు వేస్తున్నారు. పడవలో కూర్చున్న వారిలో చాలా మందికి లైఫ్ జాకెట్లు లేవు. పడవ సిబ్బంది అప్పటికప్పుడు కొత్త లైఫ్ జాకెట్లు కట్టను అక్కడికి తీసుకువచ్చారు. ఓ వైపు పడవ నీటిలో మునిగిపోతూ ఉంటే..మరోవైపు వాళ్లు కొత్త జాకెట్లను పంచటం మొదలెట్టారు.

**ఐఎమ్‌డీ హెచ్చరికలు చేసినా పట్టించుకోలేదు..**

ప్రమాదం జరిగిన సమయంలో పడవలో నలభైకి పైగా మంది పర్యాటకులు ఉన్నారు. వీరిలో కేవలం 29 మందికి మాత్రమే టికెట్లు ఇచ్చినట్టు తెలుస్తోంది. అంతకు ముందే ఐఎమ్‌డీ ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. గంటలకు 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని హెచ్చరించింది. అయినా కూడా పడవ బర్గి డ్యామ్‌లోకి వెళ్లింది. బర్గి డ్యామ్ నర్మదా నదిపై ఉంది. తుఫాను లాంటి బలమైన గాలుల కారణంగా పడవ తిరగబడింది.

6.15 గంటలకు రెస్క్యూ టీమ్‌కు సమాచారం వెళ్లింది. అయితే సమాచారం అందిన 40 నిమిషాల తర్వాత రెస్క్యూ టీమ్ సంఘటనా స్థలానికి వచ్చింది. రెండో రెస్క్యూ టీమ్ 7 గంటలకు సంఘటనా స్థలానికి చేరుకుంది. ప్రమాదం జరిగిన వెంటనే స్థానిక మత్స్యకారులు, రైతులు స్పందించారు. వాళ్లే సహాయక చర్యలు మొదలుపెట్టారు. మత్స్యకారులు, రైతులు వేగంగా స్పందించటం కారణంగా 15 మంది ప్రాణాలతో బయటపడ్డారు.



## మండుటెండల నుంచి త్వరలో ఉపశమనం

**ఈ నెల 14న అండమాన్‌కు నైరుతి రుతుపవనాలు**

దేశంలో భగభగ మండుతున్న ఎండల నుంచి త్వరలో ఉపశమనం లభించనుందని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. నైరుతి రుతుపవనాలు ఈసారి ముందుగానే వచ్చే అవకాశం ఉందని, ఈ నెల 14 నుంచి 16 మధ్య రుతుపవనాలు అండమాన్ నికోబార్ దీవులను తాకే అవకాశం ఉందని ప్రకటించింది. ఇది సాధారణ సమయం కంటే కొంత ముందేనని ఆ ప్రకటనలో పేర్కొంది.

నైరుతి రుతుపవనాలు ముందే రానుండటంతో దేశవ్యాప్తంగా సగటు వర్షపాతం సాధారణం కంటే ఎక్కువగా ఉండే అవకాశం ఉందని ఐఎండీ తెలిపింది. ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాలు, పశ్చిమ భారతంలో అధిక వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. ఈశాన్య రాష్ట్రాల్లో, తూర్పు మధ్య భారతంలోని కొన్ని ప్రాంతాల్లో మాత్రం సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే సూచనలు ఉన్నాయని ఐఎండీ చెప్పింది. అయితే ఈ సారి మే నెలలో పగటిపూట మాత్రమే కాకుండా రాత్రి సమయాల్లోనూ వేడి ఎక్కువగా ఉంటుందని తెలిపింది.

దక్షిణ ద్వీపకల్పంలోని కొన్ని ప్రాంతాల్లో మాత్రం కనిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణంగా లేదా అంతకంటే తక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని ఐఎండీ వివరించింది. ఆంధ్రప్రదేశ్, ఒడిశా, పశ్చిమ బెంగాల్ తదితర రాష్ట్రాల్లో సముద్రపు తేమతో కూడిన వేడి గాలులవల్ల ఎక్కువ ఉక్కపోత ఉంటుందని ఐఎండీ తెలిపింది.



# ఆస్కార్ విజేతకు చేదు అనుభవం

## ఆస్కార్ విగ్రహాన్ని ఆయుధంగా భావించిన సెక్యూరిటీ!

రష్యాకు చెందిన ఆస్కార్ అవార్డు గ్రహీత, ఫిల్మ్ మేకర్ పాషా తాలాన్కిన్‌కు విమానాశ్రయంలో ఒక విచిత్రమైన, చేదు అనుభవం ఎదురైంది. ఆయన తన ఆస్కార్ విగ్రహాన్ని వెంట తీసుకెళ్తుండగా విమానాశ్రయ భద్రతా సిబ్బంది దాన్ని ఒక 'ఆయుధంగా' పరిగణించి అభ్యంతరం వ్యక్తం చేశారు.

**ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు:**

పాషా తాలాన్కిన్ వీటీ. Nobody Against Putin అనే డాక్యుమెంటరీకి కో-డైరెక్టర్‌గా వ్యవహరించి ఈ ఏడాది ఆస్కార్ అవార్డు గెలుచుకున్నారు. గతంలో ఉపాధ్యాయుడిగా పనిచేసిన ఆయన ప్రస్తుతం ప్రవాస జీవితం గడుపుతున్నారు. తాలాన్కిన్ ఇటీవల లుఫ్తాన్సా విమానంలో న్యూయార్క్‌లోని జేఎఫ్‌కె ఎయిర్‌పోర్టు నుంచి జర్మనీలోని ఫ్రాంక్‌ఫర్ట్ బయల్దేరారు. విమానాశ్రయ సెక్యూరిటీ సిబ్బంది



ఆయన ఆస్కార్ విగ్రహాన్ని విమానం లోపలికి అనుమతించక పోవడంతో దాన్ని ఒక డబ్బాలో పెట్టి కార్గోలో పంపాల్సి వచ్చింది.

**మాయమైన అవార్డు:** ఫ్రాంక్‌ఫర్ట్ చేరుకున్న తర్వాత కార్గోలో పంపిన ఆ డబ్బా కనిపించక పోవడంతో ఆయన తీవ్ర ఆందోళన చెందారు. గతంలో ఈ పురస్కారంతో ఎన్నోసార్లు విమాన ప్రయాణాలు చేశానని... కానీ ఎప్పుడూ ఇలాంటి అనుభవం ఎదురుకాలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రెండు రోజుల తర్వాత ఆ విగ్రహం దొరికిందని లుఫ్తాన్సా ఎయిర్‌లైన్స్ ప్రకటించింది. ఈ ఘటనపై తాలాన్కిన్‌కు క్షమాపణలు చెప్పిన సంస్థ, అవార్డును వీలైనంత త్వరగా ఆయనకు అందజేస్తామని తెలిపింది. అసలు ఏం జరిగిందో తెలుసుకునేందుకు అంతర్గత విచారణకు ఆదేశించింది. గతంలో రష్యా ప్రభుత్వం అమలు చేయాలని చూసిన జాతీయవాద విద్యా విధానాన్ని ధిక్కరించినందుకు సొంత దేశంలోనే బహిష్కరణకు గురైన ఒక ఉపాధ్యాయుడి కథను ఆయన తన డాక్యుమెంటరీలో తెరకెక్కించారు.

---

### పశ్చిమ ఆసియా దేశాలకు
## అమెరికా భారీ ఆయుధ విక్రయాలు

**రూ.81వేల కోట్ల డీల్‌కు ఆమోదం!**

ఇరాన్‌తో ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ పశ్చిమాసియాలోని తన మిత్రదేశాలకు భారీగా ఆయుధాలను విక్రయించాలని అమెరికా నిర్ణయించింది.ఇజ్రాయెల్ సహా పలుదేశాలకు దాదాపు 8.6 బిలియన్ డాలర్ల(సుమారు రూ.81వేల కోట్లు) విలువైన సైనిక పరికరాల విక్రయానికి యూఎస్ విదేశాంగశాఖ ఆమోదం తెలిపింది.

***ప్రయోజనం పొందే దేశాలు:*** ఇజ్రాయెల్, కువైట్, ఖతార్, యూఏఈ వంటి దేశాలకు ఈ ఆయుధాలు అందనున్నాయి.

***ఖతార్‌కు భారీ ప్యాకేజీ:*** ఖతార్ దాదాపు 4 బిలియన్ డాలర్ల విలువైన పేట్రియాట్ వాయు, క్షిపణి రక్షణ వ్యవస్థలతో పాటు అత్యంత కచ్చితత్వంతో కూడిన ఆయుధాలను అందుకోనుంది.

***ఇతర దేశాలకు:*** కువైట్‌కు 2.5 బిలియన్ డాలర్ల ఆయుధాలు, అలాగే ఇజ్రాయెల్ మరియు యూఏఈలకు గైడెడ్ రాకెట్ లాంచర్లను అమెరికా విక్రయించనుంది.

***అత్యవసర నిర్ణయం:*** సాధారణంగా ఈ విక్రయాలను అమెరికా కాంగ్రెస్ రివ్యూ చేయాల్సి ఉంటుంది. అయితే ట్రంప్ యంత్రాంగం తమ అత్యవసర అధికారాలను ఉపయోగించి ఈ ప్రక్రియను వేగవంతం చేయాలని నిర్ణయించింది. ఈ నిర్ణయాన్ని యూఎస్ విదేశాంగ మంత్రి మార్కో రూబియో సమర్థించారు. ఒకవైపు కాల్పుల విరమణ ఒప్పందం అమలవుతున్న తరుణంలో అమెరికా ఈ కీలక నిర్ణయం తీసుకోవడం అంతర్జాతీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది.



## యుద్ధం మళ్లీ మొదలు కావొచ్చు: ఇరాన్



యుద్ధం దాదాపు ముగిసినట్టే అని అమెరికా పదేపదే చెబుతున్న వేళ ఇరాన్ సైనిక అధికారి ఒకరు కీలక వ్యాఖ్యలు చేశారు. యుద్ధం మళ్లీ మొదలయ్యే అవకాశం ఉందని సైనిక ప్రధాన కార్యాలయం అధికారి మొహమ్మద్ జాఫర్ అసదీ తాజాగా హెచ్చరించారు. ఈ మేరకు ఇరాన్ వార్తాసంస్థ కీలక కథనాన్ని ప్రచురించింది. ఇరు దేశాల మధ్య ఇటీవల కుదిరిన దౌత్యపరమైన ఏకాభిప్రాయాన్ని అమెరికా ఉల్లంఘిస్తు న్నట్టు కనిపిస్తోందన్నారు. అయితే ఇరాన్ దళాలు మాత్రం పూర్తి అప్రమత్తంగా ఉన్నాయని చెప్పారు. తమను రెచ్చగొట్టేందుకు అమెరికా ప్రయత్నిస్తే దీటుగా బదులిస్తామని హెచ్చరించారు. ఇదిలా ఉంటే యుద్ధం ముగింపు దిశగా ఇరాన్ చేసిన ప్రతిపాదనలను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తిరస్కరించా రు. డీల్‌కు ఇరాన్ సిద్ధంగా ఉన్నప్పటికీ తాము అంగీకరించలేని మినహాయింపుల ను కోరుతోందన్నారు. ఇరాన్ నాయక త్వంలో చీలికలు ఏర్పడ్డాయని, రెండు మూడు గ్రూపులుగా నాయకత్వం విడిపోయిందని చెప్పారు. ప్రస్తుత కాల్పుల విరమణ కారణంగా యుద్ధం దాదాపుగా ముగిసినట్టేనని ట్రంప్ ఇప్పటికే పలుమార్లు చెప్పుకొచ్చారు. ఇక యుద్ధం మొదలు పెట్టాక 60 రోజుల్లోపు అమెరికా ప్రభుత్వం కాంగ్రెస్ (చట్టసభలు) అనుమతిని తప్పనిసరిగా తీసుకోవాలన్న 1973 నాటి వార్ పవర్స్ తీర్మానం కూడా రాజ్యాంగ విరుద్ధమని ట్రంప్ అంటున్నారు. సర్వసైన్యాధిపతి అయిన అధ్యక్షుడి అధికారాలకు ఈ తీర్మానం రాజ్యాంగ విరుద్ధంగా పరిమితులు విధిస్తోందని చెప్తున్నారు. గత అధ్యక్షులు అనేకసార్లు ఈ తీర్మానాన్ని పక్కనపెట్టిన విషయాన్ని గుర్తు చేశారు. వార్ పవర్స్ తీర్మానం ప్రకారం ప్రత్యర్థులపై యుద్ధం ప్రారంభించాక 48 గంటల్లో అమెరికా అధ్యక్షుడు ఈ విషయాలను కాంగ్రెస్‌కు తెలియజేయాలి. ఆ తరువాత యుద్ధాన్ని కొనసాగించేందుకు 60రోజుల్లోపు కాంగ్రెస్ అనుమతి పొందలేని పక్షంలో దాడులను ఆపేయాలి.

---

## భారత్‌కు త్వరలో బుజ్జి అతిథి!

**6 రోజుల్లో 6వేల కిలోమీటర్ల జర్నీ**

భారత్‌కు త్వరలో ఓ బుజ్జి అతిథి రానుంది. అమూర్ ఫాల్కన్ జాతికి చెందిన ఒక చిట్టి పక్షి ఆఫ్రికాలోని సోమాలియా దేశం నుంచి భారత్‌కు బయలుదేరింది. రాబోయే ఆరు రోజుల్లో ఈ పక్షి దాదాపు 6 వేల కిలోమీటర్ల దూరం ప్రయాణించి మణిపూర్ రాష్ట్రానికి చేరుకోనుందని తమిళనాడు పర్యావరణ శాఖ అడిషనల్ సెక్రటరీ సుప్రియా సాహూ ఎక్స్ వేదికగా వెల్లడించారు. అమూర్ ఫాల్కన్ పక్షుల వలసల అధ్యయనం కోసం ఉద్దేశించిన వైల్డ్ లైఫ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా ప్రాజెక్టుకు సంబంధించిన అప్‌డేట్‌ను ఆమె పంచుకున్నారు. దాదాపుగా ఆరు రోజుల పాటు ఈ పక్షి అవిశ్రాంతంగా ప్రయాణించి భారత్‌కు చేరుకుంటుందని చెప్పారు.

ఈ ప్రాజెక్టులో భాగంగా అమూర్ ఫాల్కన్‌లకు చెందిన అపాపాంగ్, అలాంగ్, ఆహూ అనే మూడు పక్షులకు శాటిలైట్





ట్యాగ్స్‌ను గతేడాది నవంబరులో జత చేశారు. వీటి ఆధారంగా పక్షుల ప్రయాణాన్ని సిబ్బంది గమనిస్తున్నారు. గతేడాది మణిపూర్ నుంచి బయల్దేరిన ఈ పక్షులు కేవలం ఐదు రోజుల్లో 5వేల కిలోమీటర్లు ప్రయాణించి సోమాలియా వెళ్లాయి. కేవలం 150 గ్రాముల బరువు ఉండే ఒక్కో పక్షి సగటున రోజుకు వెయ్యి కిలోమీటర్ల దూరం ప్రయాణించింది. సోమాలియా నుంచి జింబాబ్వే, బొత్స్వానా, కెన్యా దేశాలకు వెళ్లి అక్కడి సవానా గడ్డి మైదానాల్లో గడిపాయి. ఏప్రిల్ మొదట్లోనే అలాంగ్, అపాపాంగ్ పక్షులు సోమాలియా వైపు తిరుగు ప్రయాణం ప్రారంభించాయి. అహూ కదలికలను కూడా పరిశోధకులు నిశితంగా పరిశీలిస్తున్నారు. సముద్రం దాటడం ప్రమాదకరం కావడంతో గాలులు తమకు అనుకూలంగా ఉన్నప్పుడే అవి సముద్రం దాటుతాయని పరిశోధకులు చెబుతున్నారు.

ఎండాకాలంలో ఈ పక్షులు ఆసియాలోని ఈశాన్య ప్రాంతాలకు వెళ్తాయి. శీతాకాలం మాత్రం ఆఫ్రికా ఖండంలో ఉంటాయి. ఆఫ్రికాకు వెళ్లే క్రమంలో నాగాలాండ్, మణిపూర్ రాష్ట్రాల్లో కొన్ని రోజులు సేద తీరి సుదీర్ఘ ప్రయాణానికి కావాల్సిన శక్తివనరులను ఒంట్లో నిల్వ చేసుకుంటాయి. వాతావరణ మార్పులు, గాలుల మార్పులు వంటి వాటిని తట్టుకుంటూ ఈ చిట్టి పక్షులు సముద్రాలను ఎలా దాటుతాయో తెలుసుకునేందుకు వైల్డ్ లైఫ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో శాస్త్రవేత్తలు అధ్యయనం నిర్వహిస్తున్నారు.

---

## బ్రిట్నీ స్పియర్స్‌పై చార్జ్‌షీట్

అమెరికన్ పాప్ సింగర్ బ్రిట్నీ స్పియర్స్(44)పై కాలిఫోర్నియాలోని వెంచురా కౌంటీ డిస్ట్రిక్ట్ అటార్నీ కార్యాలయం చార్జ్‌షీట్ దాఖలు చేసింది. మార్చి నెలలో జరిగిన అరెస్టుకు సంబంధించి ఆమెపై ఈ క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. మార్చి 4న తన ఇంటి సమీపంలోని యూఎస్ 101 హైవేపై బ్రిట్నీ తన నల్లటి బీఎండబ్ల్యూ కారును అత్యంత వేగంగా, నిబంధనలకు విరుద్ధంగా నడుపుతుండటంతో పోలీసులు ఆమెను అడ్డుకున్నారు. ఆమె మద్యం, మాదక ద్రవ్యాల మత్తులో వాహనం నడుపుతు న్నట్లు ప్రాథమిక పరీక్షల్లో తేలడంతో పోలీసులు ఆమెను అరెస్ట్ చేసి, వెంచురా కౌంటీ జైలుకు తరలించారు. అరెస్ట్ అయిన మరుసటి రోజే ఆమె బెయిల్‌పై విడుదలయ్యారు.



***తాజా పరిణామాలు:*** పోలీసులు దర్యాప్తును పూర్తి చేసి మార్చి 23న నివేదిక సమర్పించారు. దీని ఆధారంగా ప్రాసిక్యూటర్లు ఆమెపై 'మిస్డెమినర్' కింద కేసు నమోదు చేశారు. ఈ కేసుకు సంబంధించిన విచారణ మే 4, సోమవారం వెంచురా కౌంటీ కోర్టులో జరగనుంది. ఇది చిన్నస్థాయి నేరం కావడంతో... బ్రిట్నీ స్వయంగా కోర్టుకు హాజరు కావాల్సిన అవసరం లేదని, ఆమె తరపు న్యాయవాదులు ప్రాతినిధ్యం వహించవచ్చని అధికారులు తెలిపారు. ఈ ఘటన తర్వాత బ్రిట్నీ స్వచ్ఛందంగా మాదకద్రవ్యాల విముక్తి కేంద్రంలో చేరి చికిత్స పొందుతున్నారు. కోర్టులో ఆమెకు 'వెట్ రెక్లెస్' ఒప్పందాన్ని ప్రతిపాదించే అవకాశం ఉంది. ఆమె నేరాన్ని అంగీకరిస్తే ఒక ఏడాది ప్రొబేషన్, జరిమానాతో ఈ కేసు నుంచి బయటపడవచ్చు.

## పర్షియన్ గల్ఫ్‌పై పట్టుబిగించనున్న ఇరాన్

**హార్ముజ్ జలసంధిలో కొత్త వ్యూహాలు!**



పర్షియన్ గల్ఫ్, హార్ముజ్ జలసంధి విషయంలో ఇరాన్ తన పట్టును మరింత బలోపేతం చేయాలని నిర్ణయించుకుంది. ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తబా ఖమేనీ ఆదేశాలకు అనుగుణంగా ఐఆర్‌జీసీ నౌకాదళం ఈ మేరకు కీలక ప్రకటన చేసింది. హార్ముజ్ జలసంధిలోని కీలక సముద్ర మార్గాలపై తమ నియంత్రణను పెంచేందుకు అవసరమైన సమీకరణలు, నిబంధనలు సిద్ధమయ్యాయని ఇరాన్ వెల్లడించింది. దాదాపు 2,000 కి.మీ. మేర విస్తరించి ఉన్న ఇరాన్ తీర ప్రాంతం, ప్రాదేశిక జలాలపై పూర్తి నిశిత నిఘా ఉంచడమే తమ లక్ష్యమని ఇరాన్ అధికారిక మీడియా 'ప్రెస్ టీవీ' పేర్కొంది. మరోవైపు హార్ముజ్ ప్రాంతంలో అమెరికా తన దిగ్బంధనాన్ని కొనసాగిస్తోంది. ఇప్పటి వరకు 42 నౌకలను అడ్డుకున్నామని యూఎస్ సెంట్రల్ కమాండ్ వెల్లడించడం గమనార్హం.

**ఇరాన్ కొత్త సముద్ర వ్యూహం**

ఇటీవల జరిగిన 'పర్షియన్ గల్ఫ్ దినోత్సవం' సందర్భంగా ఇరాన్ సుప్రీం లీడర్ ఒక వ్యూహాత్మక ప్రణాళికను ఆవిష్కరించారు. దీని ప్రకారం జలసంధి గుండా వెళ్లే నౌకల నుంచి వచ్చే ఆదాయాన్ని ఇరాన్ రియాల్‌లలో వసూలు చేయడం. ఇరాన్‌పై ఆంక్షలు విధించిన లేదా దురాగతాలకు పాల్పడిన దేశాల నౌకల నుండి పరిహారం వసూలు చేయడం. నౌకల రాకపోకలను పూర్తిగా సైనికుల నియంత్రణలోనే ఉంచడం వంటి కీలక అంశాలు ఈ ప్రణాళికలో ఉన్నాయి.



# వయసు అడ్డంకి కాదు

**మళ్లీ బుమ్రా-భువనేశ్వర్ కాంబినేషన్ రావాలి: సెహ్వాగ్**

అద్భుతమైన ఆటతీరు కనబరిస్తే ఎంపిక చేయడానికి వయసు అడ్డంకి కాబోదని భారత మాజీ క్రికెటర్ వీరేంద్ర సెహ్వాగ్ వ్యాఖ్యానించాడు. ఐపీఎల్ 2026 సీజన్లో అత్యుత్తమ ప్రదర్శనతో ఆదరగొడుతున్న స్టార్ పేసర్ భువనేశ్వర్ కుమార్ విషయంలో బీసీసీఐ పునరాలోచన చేయాలని సూచించాడు. ప్రస్తుతం భువీ వద్దే పర్పుల్ క్యాప్ (అత్యధిక వికెట్లు తీసే బౌలర్) ఉంది. బ్యాటర్లు దూకుడుగా ఆడే టీ20ల్లో ఇప్పటికీ భువీ సత్తా చాటుతున్నాడు. స్వింగ్ బౌలింగ్తో ప్రత్యర్థి బ్యాటర్లను ఇబ్బంది పెడుతున్నాడు. ఈ క్రమంలో అతడికి అవకాశం కల్పించాలని సెహ్వాగ్ బీసీసీఐకి కీలక సూచనలు ఇచ్చాడు. జస్ప్రీత్ బుమ్రాకు భువీ జతైతే ప్రత్యర్థులకు మరిన్ని కష్టాలు తప్పవని తెలిపాడు.

"వయసు అనేది అదొక నంబర్ మాత్రమేనని ఒక్కోసారి అనిపిస్తుంటుంది. భువనేశ్వర్కు ఇప్పుడు 35 లేదా 30 ఏళ్లు ఉండొచ్చు. ఐపీఎల్లో అద్భుతమైన ప్రదర్శన చేస్తున్నాడు. అలాంటప్పుడు టీ20 ఫార్మాట్లో భారత్కు ప్రాతినిధ్యం వహించేందుకు పునరాగమనంపై ఆలోచన చేయడంలో తప్పులేదు. సెలక్టర్లు దీనిపై దృష్టిసారించాల్సిన అవసరం ఉంది. బుమ్రా-భువనేశ్వర్ కుమార్ కాంబినేషన్ను ఇప్పటికే చూశాం. మరోసారి అలా ప్రయత్నించొచ్చు. భువీ బౌలింగ్లో ఇప్పటికీ ఆ షార్ప్ నెస్ తగ్గలేదు. మునుపటి భువనేశ్వర్ను చూస్తున్నట్లే ఉంది. అందుకే అతడు మళ్లీ జాతీయ జట్టులోకి అడుగు పెట్టేందుకు ఆలోచనలు చేయాలి" అని వీరేంద్ర సెహ్వాగ్ వెల్లడించాడు.

**తగ్గని పదును**


రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుకు ప్రాతినిధ్యం వహిస్తున్న భువనేశ్వర్ పవర్ ప్లేలో అత్యంత కీలక బౌలర్. ఢిల్లీతో జరిగిన మ్యాచ్లో భువీ దెబ్బకు ప్రత్యర్థి బ్యాటర్లు హడలెత్తారు. ప్రస్తుతం అతడి వద్దే అత్యధిక వికెట్లు తీసిన బౌలర్కు ఇచ్చే పర్పుల్ క్యాప్ ఉంది. ఇప్పటివరకు ఈ సీజన్లో ఆడిన మ్యాచుల్లో భువనేశ్వర్ 17 వికెట్లు పడగొట్టాడు. ఎకానమీ కూడా 7.54 కావడం గమనార్హం. ఆర్సీబీ విజయాల్లో అతడిదే కీలక పాత్ర

# నా నిర్ణయంలో మార్పు లేదు

**క్లాసెన్ సంచలన ప్రకటన**

ఐపీఎల్ 2026లో సన్రైజర్స్ హైదరాబాద్ స్టార్ ప్లేయర్ హెన్రిచ్ క్లాసెన్ అద్భుత ప్రదర్శనలతో దూసుకుపోతున్నాడు. మిడిలార్డర్లో ఎస్ఆర్హెచ్కు కీలక ప్లేయర్గా క్లాసెన్ మారాడు. ఈ సీజన్లో ఇప్పటివరకు జరిగిన దాదాపు ప్రతి మ్యాచ్లోనూ అతడి బ్యాట్ నుంచి భారీగానే పరుగులు వచ్చాయి. ఐపీఎల్లో భీకర ఫామ్లో ఉన్న క్లాసెన్ తన అంతర్జాతీయ క్రికెట్ రిటైర్మెంట్ను వెనక్కి తీసుకోవాలని ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ కెవిన్ పీటర్సన్ సూచించాడు.

'దక్షిణాఫ్రికా ఇప్పటివరకు ఒక్క ప్రపంచకప్ కూడా గెలవలేదు. వచ్చే ఏడాది వన్డే వరల్డ్కప్ వారి సొంతగడ్డపైనే జరగనుంది. కాబట్టి సౌతాఫ్రికా క్రికెట్ బోర్డు వెంటనే అతడికి ఫోన్ చేసి రిటైర్మెంట్ వెనక్కి తీసుకుని జట్టులో చేరమని కోరాలి' అని పీటర్సన్ ఎక్స్ వేదికగా రాసుకొచ్చాడు.



తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఇదే విషయంపై క్లాసెన్ స్పందించాడు. తాను తిరిగి జాతీయ జట్టుకు ఆడాలని అనుకోవడం లేదని స్పష్టం చేశాడు. 'ఇప్పుడు నా జీవితంలో కొత్త అధ్యాయం మొదలైంది. యూరోపియన్ టీ20 ప్రీమియర్ లీగ్లో రోటర్డామ్తో భాగస్వామ్యం కుదుర్చుకున్నాను. ఈ లీగ్ను ప్రపంచ స్థాయికి తీసుకెళ్లడమే నా లక్ష్యమని' క్లాసెన్ పేర్కొన్నాడు. కాగా క్లాసెన్ గతేడాది అంతర్జాతీయ క్రికెట్కు వీడ్కోలు పలికిన సంగతి తెలిసిందే.

# ఫిఫా కప్ హక్కుల్ని భారత్‌లో కొనేవాళ్లేరీ?



ప్రతిష్ఠాత్మక ఫిఫా ప్రపంచ కప్ జూన్ 11న ప్రారంభం కానుంది. అయితే ఈ మెగా ఈవెంట్ను ప్రత్యక్ష ప్రసారం ద్వారా తిలకించే భాగ్యం భారత ఫుట్‌బాల్ ప్రేమికులకు లేనట్టేనా..? ఇందుకు కారణంగా.. భారత్‌లో వరల్డ్ కప్ ప్రసార హక్కులకోసం ఏ ఒక్క సంస్థ ముందుకు రాకపోవడమే. జూన్ 11 నుంచి జూలై 19 వరకు జరిగే ప్రపంచ కప్‌నకు అమెరికా, కెనడా, మెక్సికో సంయుక్తంగా ఆతిథ్యం ఇస్తున్న విషయం విదితమే. 48 జట్లు పాల్గొంటున్న టోర్నీలో మొత్తం 104 మ్యాచ్‌లు జరగనున్నాయి. ఇక.. భారత్‌లో ప్రత్యక్ష ప్రసారం లేకపోవడానికి కారణాలు ఏమిటంటే..

1. ***భారీ మొత్తం వల్లే:*** భారత్‌లో ప్రపంచ కప్ మ్యాచ్‌ల ప్రసార హక్కుల ధరను ఫిఫా తొలుత రూ.948 కోట్లుగా ఖరారు చేసింది. అయితే ఏ సంస్థ ముందుకు రాలేదు. దీంతో ఫిఫా ఆ మొత్తాన్ని రూ.332 కోట్లకు తగ్గించింది. అయినా ఎవరూ ఆసక్తి చూపలేదు.
2. ***మ్యాచ్‌ల సమయం:*** ప్రసార హక్కులకోసం ఏ సంస్థ ముందుకు రాకపోవడానికి ప్రధాన కారణం మ్యాచ్‌ల సమయమే. మెగా టోర్నీలో మొత్తం 104 మ్యాచ్‌లు జరుగుతుండగా అందులో 14 మాత్రమే భారత కాలమానం ప్రకారం రాత్రి 12 గంటల కంటే ముందు జరుగుతున్నాయి. ఫైనల్ సహా మిగతా మ్యాచ్‌లన్నీ రాత్రి 12 తర్వాతే మొదలవుతాయి. దాంతో..అర్ధరాత్రి తర్వాత జరిగే మ్యాచ్‌లను భారత్‌లో ఎవరూ చూడరని బ్రాడ్‌కాస్టింగ్ సంస్థలు భావిస్తున్నాయి. చైనా, శ్రీలంక, మలేసియా, థాయ్‌లాండ్ దేశాల్లో కూడా ఇదే పరిస్థితి.
3. ***పోటీ తగ్గడం..:*** 2022 ఫిఫా ప్రపంచ కప్ ప్రసార హక్కుల కోసం వయాకామ్ రూ.450 నుంచి రూ.550 కోట్లు చెల్లించింది. కానీ 2014, 2018 వరల్డ్ కప్‌ల ప్రసార హక్కులను సోనీ నెట్‌వర్క్ రూ.600 కోట్ల మొత్తానికే దక్కించుకుంది. ప్రస్తుతం వయాకామ్, హాట్‌స్టార్ సంస్థలు విలీనమయ్యాయి. దాంతో హక్కుల కోసం పోటీ తగ్గింది.
4. ***ఐపీఎల్ సైతం:*** ఐపీఎల్ పూర్తయిన రెండు వారాలకే ఫిఫా ప్రపంచ కప్ మొదలవనుండడం కూడా బ్రాడ్‌కాస్ట్ సంస్థలు ఆసక్తి చూపకపోవడానికి ఇంకో కారణం. భారత్‌లోని కంపెనీలన్నీ తమ మార్కెటింగ్ బడ్జెట్ మొత్తాన్ని ఐపీఎల్‌కే కేటాయిస్తాయి. ఒక అంచనా ప్రకారం భారత్ క్రీడా మార్కెట్‌లో 89 శాతం డబ్బును క్రికెట్‌పైనే వెచ్చిస్తున్నాయి. మిగిలిన అన్ని క్రీడలపై కలిపి 11 శాతమే ఖర్చు చేస్తుండడం గమనార్హం.

ప్రసార హక్కుల మొత్తాన్ని ఫిఫా మరింత తగ్గించే వరకు వేచిచూడాలని జియో స్టార్ భావిస్తోందట. ఒకవేళ ఫిఫా అందుకు సిద్ధంగా లేకపోతే.. ఫిఫా యాప్‌లోనే వరల్డ్ కప్‌ను స్ట్రీమింగ్ చేయాల్సి ఉంటుంది.

# సిక్సర్ల సునామీ

**గేల్, వార్నర్ సరసన రాహుల్**

**ఐపీఎల్ ఓపెనర్‌గా సరికొత్త మైలురాయి**



ఢిల్లీ క్యాపిటల్స్ మళ్లీ విజయాల బాటలోకి వచ్చింది. గత మూడు మ్యాచుల్లో ఘోర ఓటములతో ఇబ్బందిపడిన ఢిల్లీ కీలక సమయంలో రాజస్థాన్‌పై సూపర్ విక్టరీ సాధించింది. ఢిల్లీ క్యాపిటల్స్ చరిత్రలో అత్యధిక లక్ష్య ఛేదనను పూర్తిచేసి గెలవడం గమనార్హం. కేఎల్ రాహుల్ (75) కీలక ఇన్నింగ్స్‌తో మరోసారి ఆకట్టుకున్నాడు. రాజస్థాన్ నిర్దేశించిన 230 పరుగుల లక్ష్య ఛేదనలో "ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు. అత్యధిక పరుగులు చేసే బ్యాటర్‌కు ఇచ్చే ఆరెంజ్ క్యాప్‌ను మళ్లీ ధరించాడు. ప్రస్తుతం 9 మ్యాచుల్లో 485 పరుగులతో అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. ఈక్రమంలో మరో అరుదైన ఘనతను కేఎల్ రాహుల్ తన ఖాతాలో వేసుకున్నాడు. ఐపీఎల్ చరిత్రలో భారత్ తరఫున మరే ఓపెనర్ ఇప్పటివరకూ ఈ ఘనత సాధించకపోవడం గమనార్హం.

ఐపీఎల్ చరిత్రలో ఇప్పటిదాకా ఓపెనర్‌గా ముగ్గురు మాత్రమే 300 సిక్స్ లు కొట్టారు. అందులో కేఎల్ రాహుల్ మూడో ప్లేయర్. కానీ తొలి భారత ఆటగాడిగా నిలవడం విశేషం. కేఎల్ రాహుల్ 112 మ్యాచుల్లో ఓపెనర్‌గా ఆడాడు. అందులో 200ం సిక్స్‌లను బాదేశాడు. తాజాగా ఢిల్లీతోనూ నాలుగు సిక్స్‌లు కొట్టిన కేఎల్ ఖాతాలో ప్రస్తుతం 203 సిక్స్‌లు ఉన్నా యి. ఐపీఎల్‌లో ఓపెనర్ కేఎల్ 50.01 సగటున 141.88 స్ట్రైక్ రేట్ 4,851 పరుగులు చేశాడు. రాహుల్ కాకుండా ఐపీఎల్ లో 200ం సిక్స్‌లు బాదిన మరో ఇద్దరు ఓపెనర్లు విదేశీ క్రికెటర్లే. అందరికంటే ఎక్కువగా యూనివర్సల్ బాస్ క్రిస్ గేల్ 326 సిక్స్‌లు కొట్టాడు. అతడి తర్వాత సన్‌రైజర్స్‌కు సారథిగా వ్యవహరించిన డేవిడ్ వార్నర్ 210 సిక్స్‌లు బాదాడు. ఈ సీజన్లోనే కేఎల్ రాహుల్ రెండో స్థానానికి చేరుకునే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఢిల్లీ ఇంకా ఐదు లీగ్ మ్యాచ్‌లు ఆడాల్సి ఉంది. కనీసం రెండేసి కొట్టినా వార్నర్‌ను కేఎల్ అధిగమించడం ఖాయం.

# ఆ 'ఇద్దరికీ' విజయం అంకితం

**ఢిల్లీ క్యాపిటల్స్ కెప్టెన్ వెల్లడి**



పంజాబ్ 263 పరుగుల భారీ స్కోరు. కానీ విజయం వరించలేదు. ఆ తర్వాత రాయల్ ఛాలెంజర్స్‌తో ఘోర పరాభవం. ఈ రెండింటి నుంచి బయటపడేలా అద్భుత ప్రదర్శనతో ఢిల్లీ క్యాపిటల్స్ విజయం సాధించింది. రాజస్థాన్ రాయల్స్ నిర్దేశించిన భారీ టార్గెట్ను అలవోకగా ఛేదించి గెలిచింది. ఐపీఎల్ 2020 సీజన్లో తొలి మ్యాచ్ ఆడిన మిచెల్ స్టార్క్ నాలుగు ఓవర్లలో మూడు వికెట్లు తీసి 40 పరుగులు ఇచ్చాడు. కేఎల్ రాహుల్ (15) ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు. అయితే ఈ విజయాన్ని రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన అభిమానులకు అంకితం చేస్తున్నట్లు కెప్టెన్ అక్షర్ పటేల్ వెల్లడించాడు. "గత మ్యాచ్ తర్వాత మా జట్టు అభిమానులు రోడ్డు ప్రమాదానికి గురై ప్రాణాలు విడిచారు. వారికి సంఘీభావంగా ఈ విజయాన్ని అంకితం చేస్తున్నా. మా ఢిల్లీ క్యాపిటల్స్ కుటుంబంలో ఇద్దరిని కోల్పోయాం' అని అక్షర్ పటేల్ తెలిపాడు. ఆర్సీబీతో మ్యాచ్ అనంతరం ఇద్దరు సోదరులు యాగ్యా భాటియా. అభవ్ భాటియా రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. బైక్‌పై వెళ్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. వారిద్దరూ మృతి చెందారు. ఢిల్లీ క్యాపిటల్స్ తన సోషల్ మీడియా ఖాతాలో వారిద్దరికి సంఘీభావం చెబుతూ పోస్టు పెట్టింది.

చైతన్య రథం
సినిమా
ఆదివారం 3 మే 2026 X

# మిల్కీ బ్యూటీ... నగధగలు



శ్రీ మూవీతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన తమన్నా భాటియా తక్కువ టైమ్‌లోనే ఊహించని పాపులారిటీని సొంతం చేసుకుంది. మిల్కీ బ్యూటీగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న తమన్నా ఓవైపు హీరోయిన్‌గా నటిస్తూనే, మరోవైపు స్పెషల్ సాంగ్స్, బ్రాండ్ ఎండార్స్‌మెంట్స్, బిజినెస్ కోసం కష్టపడుతూ కెరీర్లో ముందుకెళ్తూ ఉంటుంది. అయితే కెరీర్లో ఎంత బిజీగా ఉన్నప్పటికీ తమన్నా సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటూ ఎప్పటికప్పుడు తన అప్డేట్స్‌ను షేర్ చేస్తూ ఉంటుంది. అందులో భాగంగానే తమన్నా తాజాగా కొన్ని ఫొటోలను షేర్ చేసింది. వీటిల్లో ఆమె స్విమ్ సూట్ ధరించి తన కొత్త మోడల్ జువెలరీ నెక్ చైన్‌ను పరిచయం చేస్తూ తన అందాలను ఆరబోసింది. ఈ ఫొటోల్లో తమన్నా నగల కంటే మెరిసిపోతోందంటూ నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు.

# చరణ్ యాక్టింగ్ రంగస్థలంను మించి ఉంటుంది





మెగా పవర్ స్టార్ రామ్‌చరణ్ హీరోగా, బుచ్చిబాబు సాన దర్శకత్వంలో రూపొందుతున్న ప్రతిష్టాత్మక సినిమా 'పెద్ది'పై అంచనాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. ఈ సినిమాకు సంబంధించిన రిలీజ్ డేట్‌ను ప్రకటించేందుకు మేకర్స్ ఏర్పాటుచేసిన ప్రెస్‌మీట్‌కు హాజరైన ప్రముఖ డైరెక్టర్ సుకుమార్ చేసిన వ్యాఖ్యలు ప్రత్యేకంగా ఆకట్టుకున్నాయి. తన శిష్యుడు బుచ్చిబాబు టాలెంట్‌ను ప్రశంసిస్తూ... ఉప్పెన సినిమా క్లైమాక్స్ చూసినప్పుడే అతనిలో ఉన్న డైరెక్టర్ సామర్థ్యాన్ని గుర్తించానని సుకుమార్ వెల్లడించారు. ఆ క్లైమాక్స్ తీసినప్పుడు ఏ జానర్ అయినా సమర్థంగా హ్యాండిల్ చేయగలడనిపించిందని సుకుమార్ అభిప్రాయపడ్డారు.

'పెద్ది' గురించి మాట్లాడుతూ సుకుమార్ చేసిన వ్యాఖ్యలు సినిమాపై హైప్‌ను మరింత పెంచాయి. ఇది ఒక భారీ స్క్రిప్ట్‌తో తెరకెక్కుతున్న ఎమోషనల్ డ్రామా అని... ఇటీవలి కాలంలో ఇలాంటి భావోద్వేగభరితమైన సినిమాను ప్రేక్షకులు చూడలేదన్నారు. ముఖ్యంగా రామ్‌చరణ్ నటన గురించి ప్రస్తావిస్తూ...తన దర్శకత్వంలో వచ్చిన రంగస్థలంను మించి ఈ సినిమాలో చరణ్ పెర్ఫార్మెన్స్ ఉంటుందని చెప్పడం విశేషం. ఈ కామెంట్స్‌తో 'పెద్ది' సినిమాపై ఇండస్ట్రీలోనే కాకుండా అభిమానుల్లోనూ భారీ అంచనాలు ఏర్పడుతున్నాయి.

# 'ఆస్కార్' కొత్త రూల్స్

### నటులకు సూపర్ గుడ్ న్యూస్

ప్రపంచ సినిమా రంగంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన ఆస్కార్ అవార్డుల (100వ ఎడిషన్) కోసం అకాడమీ సరికొత్త నిబంధనలను తీసుకువచ్చింది. -2027 ఆస్కార్ అవార్డులకు సంబంధించి ఆకాడమీ ఆఫ్ మోషన్ పిక్చర్ ఆర్ట్స్ అండ్ సైన్సెస్ (Oscars 2027) యాక్టింగ్, అంతర్జాతీయ సినిమాలు, సాంకేతిక విభాగాల్లో కీలక మార్పులు చేసింది.




కొత్త నిబంధనల ప్రకారం.. ఒకే నటుడు ఒకే జాబితాలో రెండు వేర్వేరు సినిమాలకు నామినేట్ అయ్యే అవకాశం ఉంది. ఇప్పటివరకూ నటీనటులు ఒక విభాగంలో ఒక సినిమాకు మాత్రమే నామినేట్ అయ్యే అవకాశం ఉండేది. దీనివల్ల టాలెంట్ ఉన్న నటులు ఒకే ఏడాది ఎన్ని చిత్రాల్లో గొప్ప ప్రదర్శనలు ఇచ్చినా ఏదో ఒకదానితోనే సరిపెట్టుకోవాల్సి వచ్చేది. ఇకపై ఈ నిబంధనను తొలగించి ఎన్ని సినిమాలకు అయినా నామినేట్ చేసుకునే అవకాశాన్ని అకాడమీ కల్పించింది.

అంతర్జాతీయ ఫీచర్ ఫిల్మ్ విభాగంలో కూడా అకాడమీ కీలక మార్పులు చేసింది. ఒక దేశం నుంచి ఇప్పుడు ఒకటి కంటే ఎక్కువ సినిమాలు నామినేషన్లకు అర్హత సాధించొచ్చు. అలాగే కేన్స్ లాంటి ప్రముఖ అంతర్జాతీయ చలనచిత్ర వేడుకల్లో అగ్ర పురస్కారాలు అందుకున్న సినిమాలు నేరుగా ఆస్కార్ బరిలో పోటీపడే అవకాశాన్ని కూడా అకాడమీ కల్పించింది. మరోవైపు అంతర్జాతీయ సినిమా కేటగిరీలో ట్రోఫీపై దేశం పేరుతో పాటు దర్శకుడి పేరును కూడా ముద్రించనున్నారు.

సినిమా రంగంలో పెరుగుతున్న కృత్రిమ మేధ వినియోగంపై అకాడమీ కఠిన నిర్ణయం తీసుకుంది. రైటింగ్ (స్క్రీన్ప్లే) విభాగంలో రచయితలు రాసిన కథలను మాత్రమే పరిగణనలోకి తీసుకోనున్నట్లు తెలిపింది. ఏఐ సహాయంతో రాసిన వాటిని అనుమతించబోమని వెల్లడించింది. యాక్టింగ్లో కూడా కృత్రిమ మేధతో సృష్టించిన సీన్స్, మార్పులు చేసిన ప్రదర్శనలను అంగీకరించబోమని స్పష్టం చేసింది. నటీనటులు నేరుగా చేసిన ప్రదర్శనలకే అవార్డులు ఇవ్వనున్నట్టు తెలిపింది. వచ్చే ఏడాది ఆస్కార్ అవార్డుల వేడుకలో ఈ నిబంధనలు అమలుకానున్నాయి. 90వ ఆస్కార్ అవార్డుల వేడుక మార్చి 14న లాస్ ఏంజెల్స్‌లో ఘనంగా జరగనుంది.

# వరుస యాక్షన్ చిత్రాలతో గోపీచంద్ దూకుడు

### మరో యాక్షన్ డ్రామాకి రెడీ!



టాలీవుడ్ యాక్షన్ హీరో గోపీచంద్ ప్రస్తుతం వరుస చిత్రాలతో బిజీగా ఉన్నాడు. కెరీర్‌లో మరోసారి జోరు పెంచిన ఆయన కొత్త కథలతో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతున్నాడు. ప్రస్తుతం ఆయన దర్శకుడు సంకల్ప్‌రెడ్డి తెరకెక్కిస్తున్న 'భరతవర్ష' చిత్రంలో నటిస్తున్నారు. ఇటీవల విడుదలైన ఈ సినిమా దృశ్యాలకు మంచి స్పందన లభించింది. ఈ చిత్రంలో గోపీచంద్ తన రూపాన్ని పూర్తిగా మార్చుకోవడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఇదే సమయంలో నూతన దర్శకుడు కుమార్ సాయితో మరో చిత్రానికి కూడా ఆయన అంగీకరించారు. ఈ సినిమా చిత్రీకరణలో ఎక్కువ భాగం విదేశాల్లో జరగనుంది. సీనియర్ నిర్మాత బీవీఎస్ఎన్ ప్రసాద్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

ఇక తాజాగా గోపీచంద్ తన జాబితాలో మరో యాక్షన్ కథను చేర్చాడు. ప్రముఖ స్టంట్ మాస్టర్ వెంకట్ ఈ సినిమా ద్వారా దర్శకుడిగా పరిచయం కానున్నారు. యాక్షన్ ప్రధానంగా సాగే ఈచిత్రానికి ప్రముఖ సంగీత దర్శకుడు సామ్ సీఎస్ సంగీతం అందించనున్నారు. పలువురు ప్రముఖ సాంకేతిక నిపుణులు ఈ ప్రాజెక్టులో భాగమవుతున్నారు. ఈకొత్త సినిమా ప్రారంభోత్సవం మే 3న హైదరాబాద్‌లోని రామానాయుడు స్టూడియోస్‌లో ఘనంగా జరగనుంది. త్వరలోనే అధికారిక ప్రకటన వెలువడనుంది.

# 'వారణాసి'... బ్లాక్ ఫారెస్ట్‌లో మహేష్ టెక్కింగ్!




రాజమౌళి-మహేష్‌బాబు కాంబినేషన్లో రానున్న 'వారణాసి' కోసం ప్రపంచవ్యాప్తంగా ఉన్న సినీ ప్రియులు ఎదురుచూస్తున్నారు. ఈ సినిమా అప్డేడేట్స్ ఎప్పుడు పంచుకుంటారా అని ఆసక్తిగా ఉన్నారు. కొంచెం విరామం -దొరికినా విదేశాలకు వెళ్లే మహేష్ ఇటీవల జర్మనీ వెళ్లడంతో పర్సనల్ టూర్ అని అందరూ భావించారు. కానీ వారణాసి ట్రైనింగ్‌లో భాగంగా వెళ్లినట్లు మహేష్ పంచుకున్న ఫొటోలు చూస్తే అర్థమవుతోంది.

ప్రస్తుతం మహేశ్‌బాబు జర్మనీలోని బ్లాక్ ఫారెస్ట్‌లో ఉన్నారు. అక్కడ ఆయన ఫిట్నెస్, వెల్నెస్ నిపుణులు డాక్టర్ హ్యారీ కోనిగ్ పర్యవేక్షణలో కఠినమైన శిక్షణ పొందుతున్నారు. దీనికి సంబంధించిన ఫొటోలను మహేష్ తన సోషల్ మీడియాలో స్వయంగా పంచుకున్నారు. ట్రెక్కింగ్‌లో ట్రైనింగ్ తీసుకుంటూ వారణాసి కోసం సిద్ధమవుతున్నట్టు క్యాప్షన్ పెట్టారు. ప్రస్తుతం ఈ ఫొటోలు వైరల్ అవుతున్నాయి.

గ్లోబల్ ప్రేక్షకులను ఆకర్షించడమే లక్ష్యంగా రాజమౌళి ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. 'వారణాసి' సినిమాతో మరిన్ని కొత్త మార్కెట్లనీ కొల్లగొట్టాలనే ప్రణాళికల్ని చిత్ర బృందం సిద్ధం చేసింది. ముఖ్యంగా దక్షిణ అమెరికాతో పాటు, లాటిన్ అమెరికా దేశాల మార్కెట్ పైన గురిపెట్టినట్టు తెలుస్తోంది. 'వారణాసి' కథ కూడా పలు దేశాలతో ముడి పడినది కావడం, కథా నాయకుడు ప్రపంచాన్ని చుట్టే సాహసికుడు-కావడంతో... మరిన్ని కొత్త దేశాలకు, కొత్త మార్కెట్లకీ ఈ సినిమాని తీసుకెళ్లాలనే ప్రణాళికలు రచిస్తున్నారు. వచ్చే ఏడాది ఏప్రిల్ 7న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది.

# I, Nobody టీజర్

### ఉనికి కోసం ఒక సామాన్యుడి అసాధారణ పోరాటం




మలయాళ స్టార్ హీరో పృథ్వీరాజ్ సుకుమారన్, టాలెంటెడ్ నటి పార్వతి తిరువోతు ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం I, Nobody (ఐ, నోబడీ). 'రోషాక్' వంటి ప్రయోగాత్మక చిత్రంతో మెప్పించిన దర్శకుడు నిసామ్ బషీర్ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నాడు. తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన అఫీషియల్ టీజర్‌ను మేకర్స్ విడుదల చేశారు.

ఈ టీజర్ చూస్తుంటే సినిమా కథాంశం ఒక వ్యక్తి తన అస్తిత్వం కోసం చేసే పోరాటం లేదా రహస్యం చుట్టూ తిరుగుతుందని అర్థమవుతోంది. ఒక సాధారణ ఉద్యోగి అనుకోకుండా కొన్ని క్లిష్ట పరిస్థితుల్లో చిక్కుకుంటాడు. ఆ ప్రమాదం నుంచి తనను తాను కాపాడుకుంటూనే తన కుటుంబాన్ని ఎలా రక్షించుకున్నాడు అనేదే ఈ చిత్ర ప్రధాన కథాంశంగా కనిపిస్తోంది. ఇందులో పృథ్వీరాజ్ సరికొత్త లుక్, పార్వతి నటన సినిమాపై భారీ అంచనాలను పెంచుతున్నాయి. వీరిద్దరి కాంబినేషన్ ఈ చిత్రానికి ప్రధాన బలంగా నిలవనుంది. జేక్స్ బిజోయ్ అందించిన నేపథ్య సంగీతం టీజర్‌కు ప్రాణం పోసింది. ప్రతి సన్నివేశాన్ని తన మ్యూజిక్‌తో ఆయన ఎంతో ఉత్కంఠభరితంగా మలిచారు.